www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కల్తీ కల్లు తాగి.. ఇద్దరి మృతి!

3

మరొకరు విషమం.. బర్త్‌డే వేడుకలో విషాదం


మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెంలో..

పార్టీలో 17 మంది.. కల్లు తాగింది ముగ్గురే

విషం కలిపి ఉంటారా? ఘటనపై అనుమానాలు

శుక్రవారం | 5-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 80 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: అమావాస్య తె. 4.28 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆర్ద్ర తె. 4.06 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ.12.22-1.59, దుర్ముహూర్తం: ఉ.8.25-9.17, మ.12.45-1.37, అమృతఘడియలు: సా.6.01-7.37, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కప్పొంగిన అభిమానం

అటు అరేబియా సముద్రం.. ఇటు అభిమాన జన సంద్రం.. బ్రహ్మరథం పట్టడం అంటే ఇదేనేమో అనిపించేలా.. జగజ్జేతలకు జేజేలు పలకడం అంటే ఇదీ అనేలా.. భారత క్రికెట్ వీరులకు అపూర్వ స్వాగతం లభించింది. టి20 ప్రపంచ కప్‌తో వచ్చిన రోహిత్‌శర్మ బృందానికి ముంబై మహా నగరం జయహో అంటూ జై కొట్టింది.. ఢిల్లీలో విమానం దిగిన దగ్గర మొదలైన అభిమాన ప్రవాహం ముంబై మెరైన్ డ్రైవ్ వరకు కొనసాగింది. జోరున వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా వెన్నంటి సాగింది.. గంటన్నర పాటు జరిగిన విజయ యాత్ర వాంఖడే వరకు బారులు తీరింది.. దిక్కులు దద్దరిల్లే నినాదాలతో మైదానం హోరెత్తింది. ఈ దృశ్యాలను చూసినవారి మనసు భావోద్వేగంలో తడిసి ముద్దయింది.

11



- ఓపెన్‌టాప్ బస్‌లో వస్తున్న భారత టీ20 జట్టుకు గురువారం ముంబైలోని మెరైన్ డ్రైవ్‌లో జన నీరాజనం
- ప్రధాని మోదీతో జట్టు సభ్యులు

సరితూగే అభ్యర్థుల్లేకే!

రాష్ట్రంలో లోక్‌సభ ఫలితాలపై సీఎం రేవంత్ విశ్లేషణ

కొన్నిచోట్ల మా అభ్యర్థుల స్థాయి సరిపోలేదు.. కాంగ్రెస్ దిగ్గజ నేతలంతా అసెంబ్లీకి వచ్చారు

ఓడి మళ్లీ పోటీ చేయడం బీజేపీకి కలిసొచ్చింది.. రాజధానిపై నా మార్కు మూసీ ప్రాజెక్టు

మొదలెట్టిన మూడేళ్లలో పూర్తి చేస్తాం.. నాలుగు ఏజెన్సీలతో ప్రాజెక్టు పనులు చేస్తాం

ఫోన్ ట్యాపింగ్ చేయించినోళ్లు అనుభవిస్తారు

ఈవీఎంలతో అక్రమాలకు అవకాశముంది

రాష్ట్ర ప్రయోజనాలపై కేసీఆర్‌లా రాజీపడను

ఏపీతో పంపకాల్లో చట్టప్రకారమే వ్యవహరిస్తా

ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ ఇష్టాగోష్ఠి

న్యూఢిల్లీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థులకు సరితూగే అభ్యర్థులు లేకపోవడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కొన్నిచోట్ల ప్రతికూల ఫలితాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తన నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు లోక్‌సభ ఎన్నికలలో శాయశక్తులా పోరాడాయని చెప్పారు. తనతో పాటు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క, వివేక్, దామోదర రాజనర్సింహ లాంటి కాంగ్రెస్ దిగ్గజ నేతలంతా శాసనసభకు ఎన్నిక కావడంతో లోక్‌సభ ఎన్నికలలో పలుచోట్ల బీజేపీ అభ్యర్థులకు సరితూగే నేతలు లేకపోయారని అన్నారు. బీజేపీ తరఫున పోటీ చేసిన ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్‌లు అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయి, తిరిగి లోక్‌సభకు పోటీ చేయడం వల్ల వారి పర్స నాలిటీలతో పోటీపడే విషయంలో అక్కడి తమ అభ్యర్థులు కాస్త వెను కబడ్డారన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుగ్లక్ రోడ్డులోని తన అధికార నివాసంలో విలేకరులతో

మిగతా 13వ పేజీలో...



గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి కరచాలనం

3 బ్లాకులు మాకే ఇవ్వండి

సింగరేణి గనులను వేలం వేయొద్దు

రద్దు చేసిన ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలి

ఐఐఎం ఏర్పాటు చేస్తే భూమిని కేటాయిస్తాం

కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం హామీలు నిలుపుకోండి

రక్షణ భూములు 2450 ఎకరాలు మాకివ్వండి

సెమీ కండక్టర్ల మిషన్‌లో రాష్ట్రాన్ని చేర్చండి

ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ వినతి

13

నిఘా విభాగాలను ఆధునికీకరించాలి..

అవసరమైన నిధులు ఇవ్వండి

ఐపీఎస్ అదనపు పోస్టులు మంజూరు చేయండి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రేవంత్, భట్టి విజ్ఞప్తి

ఆ నివేదిక తర్వాతే 'చైర్మన్ గిరీ'!

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల పనితీరుపై కురియన్ కమిటీ సమీక్ష

14

నివేదిక ఇచ్చాకే నామినేటెడ్ పోస్టుల భర్తీ

ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

కాంగ్రెస్‌లోకి

కారు దిగిన విఠల్, భానుప్రసాద్, సారయ్య, దయానంద్, ప్రభాకర్‌రావు, మల్లేశం

రేవంత్ నివాసంలో అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత పార్టీ మారిన నేతలు



రేవంత్, దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా 'కారు' దిగిపోతున్నారు. హస్తం గూటికి చేరుతున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దండే విఠల్, భానుప్రసాద్, బుగ్గారపు దయానంద్, ప్రభాకర్‌రావు, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్య అధికార పార్టీలో చేరారు. వీరంతా గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆయన ఢిల్లీ నుంచి రావాల్సిన విమానం ఆలస్యమైంది. ఢిల్లీ నుంచి రాగానే ఆరుగురు ఎమ్మెల్సీలు రేవంత్‌తో భేటీ అయ్యారు. అనంతరం దీపాదాస్ మున్షీ సమక్షంలో సీఎం వారికి కాంగ్రెస్ కండువా కప్పారు. మండలిలో కూడా ఆధిక్యం కోసం కాంగ్రెస్ పావులు కదుపుతోంది. శాసనమండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా.. 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఆరుగురు సభ్యులున్నారు. తాజాగా ఆరుగురు చేరడంతో ఆ పార్టీ బలం 12కు చేరింది. అవసరమైనప్పుడు వామపక్ష ఎమ్మెల్సీ మద్దతు కూడా కాంగ్రెస్‌కే ఉండే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్‌కు మరో ఐదారు సీట్లు ఉంటే మెజారిటీ దక్కుతుంది. బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నారు. వీరు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసే అవకాశం లేదు. అప్పుడు కీలక బిల్లుల విషయంలో రేవంత్ సర్కారుకు ఊరట లభిస్తుంది.

బండ్లను చేర్చుకుంటే

ఆత్మహత్యే!

కాంగ్రెస్‌లోకి కృష్ణమోహన్‌రెడ్డి వద్దే వద్దు

గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేరికపై రగడ

కార్యకర్తల ధర్నాలు, ఆత్మహత్యాయత్నాలు

13

సెల్‌టవర్ ఎక్కి ఒకరు.. పెట్రోల్ పోసుకుని మరో ముగ్గురు..

ఎప్పుడు చేరేది రెండ్రోజుల్లో ప్రకటిస్తా: బండ్ల

అనుమతుల్లేని మల్లారెడ్డి విద్యా సంస్థపై చర్యలు

హైకోర్టు ఆదేశం

14



వణికిస్తున్న డెంగీ.. చికున్ గున్యా

- 103-104 డిగ్రీల జ్వరం.. తగ్గిపోతున్న ప్లేట్‌లెట్లు
- అడుగు తీసి అడుగు వేయలేనంతగా కీళ్లనొప్పులు
- రాష్ట్రవ్యాప్తంగా టైగర్ దోమల స్వైరవిహారం
- పగటిపూట కుట్టే ఆ దోమలతో వ్యాపిస్తున్న జ్వరాలు
- సొంత వైద్యం వద్దని వైద్యుల హితవు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విపరీతమైన జ్వరం. ఒళ్లునొప్పులు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం.. అడుగు తీసి అడుగు వేయలేనంతగా కీళ్ల నొప్పులు!! రాష్ట్రంలో ఈ తరహా లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. వారికి పరీక్షలు చేయిస్తే.. చాలామందిలో డెంగీ, చికున్‌గున్యా నిర్ధారణ అవుతోంది. వారిలో కొంతమందిని ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు 103-104 డిగ్రీల జ్వరంతో వస్తున్న ఔట్‌పేషెంట్లలో.. 90% కేసులు డెంగీ, చికున్‌గున్యావే అయి ఉంటున్నాయని వారు వెల్లడిస్తున్నారు. వారిలోనూ డెంగ్యూ బాధితులే ఎక్కువగా ఉంటున్నారని.. మూడో వంతు కేసులు చికున్‌గున్యావి ఉంటున్నాయని వైద్యులు వివరించారు. అలాగే.. నిత్యం ఓపీకి వస్తున్నవారిలో కనీసం ఐదో వంతు

మిగతా 14వ పేజీలో...

హై.. హై.. 'హైడ్రా'!

జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు పరిధి

27 మునిసిపాలిటీలు, 33 పంచాయతీలు

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నుంచి నిధులు

సంస్థ కమిషనర్‌కు పూర్తి అధికారాలు

12

చెరువులు, సర్కారీ స్థలాలపైన పర్యవేక్షణ

అక్రమ నిర్మాణాల నియంత్రణకు చర్యలు



సకల వసతుల 'పల్లె'

- గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు తదితర వసతులపై దృష్టి
- 10,909 గ్రామాల్లో కల్పనకు యోచన
- రాష్ట్ర ప్రణాళిక సంఘం సంకల్పం
- ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక
- సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి వెల్లడి

13



హైదరాబాద్-విజయవాడ హైవేను

విస్తరించాలి

హైదరాబాద్-అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలి

కోలుకునేదాకా ఏపీకి సాయం చేయాలి

మోదీ, షాకు ఏపీ సీఎం చంద్రబాబు వినతి

ఏపీ పునర్నిర్మాణానికి చేయూత: మోదీ

రేపు రేవంత్-చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఏపీ రాజధాని అమరావతి దాకా గ్రీన్‌ఫీల్డ్ హైవేను అభివృద్ధి చేయాలని.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేదా ఎనిమిది లేన్ల హైవేగా మార్చాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. అలాగే.. ఏపీ జెన్‌కో, తెలంగాణ డిస్కమ్‌ల మధ్య ఉన్న ఆర్థిక సమస్యలను కూడా

మిగతా 3వ పేజీలో...

- అమరావతికి కేంద్ర సంస్థల క్యూ!

3

- నేడు హైదరాబాద్‌కు చంద్రబాబు

ప్రాణాలు తోడేస్తున్న

వాయుకాలుష్యం



హైదరాబాద్‌తోపాటు దేశంలోని పది నగరాల్లో అంతర్జాతీయ స్థాయి అధ్యయనం

రోజువారీ మరణాల్లో 7.2 శాతానికి వాయుకాలుష్యమే కారణం.. లాన్సెట్‌లో వెల్లడి

2

8 నెలల గరిష్ఠానికి

నిరుద్యోగిత రేటు

మేలో 7% నుంచి జూన్‌లో 9.2 శాతానికి!

గ్రామీణ ప్రాంతాల్లో, మహిళల్లో అధికం

సీఎంఐఈ హౌస్‌హోల్డ్ సర్వేలో వెల్లడి

రాజ్యసభ సభ్యత్వానికి

కేకే రాజీనామా

ఆయనను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

14

ఉగ్రవాదాన్ని పెంచే దేశాలను ఏకాకిని చేయాలి

» ఎస్‌సీవో సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

అస్తానా, జూలై 4: ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న, ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిన దేశాలను ఏకాకిని చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. కజకిస్థాన్ అధ్యక్షతన అస్తానాలో నిర్వహిస్తున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సులో మోదీ సందేశాన్ని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చదివి వినిపించారు. "ఎస్‌సీవో ఒక సూత్ర ఆధారిత సంస్థ. ఇది దాని సభ్య దేశాల పరస్పర అంగీకారంతో నడుస్తుంది. ఇవి మిగిలిన దేశాల సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, ప్రాంతీయ ఐక్యతను, సమానత్వాన్ని పరస్పరం గౌరవిస్తాయి. అలాగే ఒక దేశ అంతర్గత వ్యవహారాల్లో మరొకటి జోక్యం చేసుకోదు' అని మోదీ పేర్కొన్నారు. ఎస్‌సీవో వాస్తవ లక్ష్యాల్లో ఒకటైన ఉగ్రవాద నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కాగా సరిహద్దు వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నాలను రెట్టింపు చేయాలని భారత్, చైనా అంగీకరించాయి. గురువారం ఎస్‌సీవో సదస్సుకు హాజరయ్యేందుకు కజకిస్థాన్‌లోని అస్తానా వెళ్లిన భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అక్కడ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సరిహద్దు వెంబడి సమస్యల పరిష్కారానికి చర్చలను వేగవంతం చేయాలని ఇద్దరు నేతల మధ్య అంగీకారం కుదిరింది.

8న రష్యాకు ప్రధాని మోదీ.. ఐదేళ్ల తర్వాత తొలిసారి

న్యూఢిల్లీ, జూలై 4: ప్రధాని నరేంద్రమోదీ జూలై 8,9,10 తేదీల్లో రష్యా, ఆస్ట్రియా దేశాల్లో పర్యటించనున్నారు. 8న రష్యాకు వెళ్లనున్న ప్రధాని.. అక్కడ రెండు రోజుల పాటు జరిగే 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం ఆస్ట్రియాకు బయలుదేరి వెళ్లనున్నట్లు విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. 22వ శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి మోదీ సమీక్షించనున్నారు. కాగా, 2019లో వ్లాదివోస్టోక్‌లో జరిగిన ఆర్థిక సదస్సులో పాల్గొన్న మోదీ దాదాపు ఐదేళ్ల తర్వాత తిరిగి రష్యాలో పర్యటించబోతున్నారు. రష్యాలో సమావేశం ముగిశాక ఆస్ట్రియాకు వెళ్లనున్న మోదీ.. 9,10 తేదీల్లో అక్కడ పర్యటిస్తారు. భారతదేశ ప్రధాని ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్లలో ఇదే ప్రథమం కావడం గమనార్హం.

ప్రధాని మోదీ, ఎంపీ అనురాగ్‌పై చర్యలు తీసుకోండి

» లోక్‌సభ స్పీకర్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణిక్కమ్ ఠాగూర్ లేఖ

న్యూఢిల్లీ, జూలై 4: సభలో అవాస్తవాలు మాట్లాడడంతోపాటు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ మాణిక్కమ్ ఠాగూర్ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ సభలో మాట్లాడుతూ.. ప్రతీ మహిళకు నెలకు రూ.8500 ఇస్తామని కాంగ్రెస్ తప్పుడు హామీ ఇచ్చిందని అన్నారని మాణిక్కమ్ ఠాగూర్ లేఖలో పేర్కొన్నారు. కానీ, ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆ హామీని అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని వివరించారు. వివిధ అంశాలపై ప్రధాని తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ లేఖలో పేర్కొన్నారు. ఇక, ఎంపీ అనురాగ్ ఠాకూర్ కూడా కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని ఆయన తెలిపారు.

హరియాణా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్- కాంగ్రెస్ పొత్తు ఉండదు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూలై 4: హరియాణా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో కాంగ్రెస్ పొత్తు ఉండదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అయితే మహారాష్ట్రలో శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్‌సీపీ)తో, ఝార్ఖండ్‌లో జేఎంఎంతో కలిసి పోటీ చేస్తామని ఆయన తెలిపారు. గురువారం ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో హరియాణాలో పొత్తులో భాగంగా ఆప్‌కు ఒక సీటు ఇచ్చామని, అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఉండదని చెప్పారు. ఇక ఢిల్లీలో ఇండియాతో పొత్తు పెట్టుకోమని ఆప్ స్వయంగా చెప్పిందని వెల్లడించారు. పంజాబ్‌లోనూ పొత్తు ఉండదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి ఇండియా కూటమికి ఒక విధానమేమీ లేదని, ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులకనుగుణంగా పొత్తులపై నిర్ణయాలు ఉంటాయని జైరాం రమేశ్ అన్నారు.

మా కుమారుడి వివాహానికి రండి

» సోనియా గాంధీని ఆహ్వానించిన ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ, జూలై 4: ఈ నెల 12న జరిగే తన చిన్న కుమారుడి పెళ్లికి రావాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌లోని సోనియా నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ అయ్యారు. అనంతరం పెళ్లి శుభలేఖను అందజేశారు. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడికి, రాధికా మర్చెంట్‌కు ముంబైలోని బాంద్రా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో వివాహం జరగనుంది.

నీట్-యూజీ పరీక్షను రద్దు చేయొద్దు

» సుప్రీంకు 'నీట్'లో అర్హత సాధించిన గుజరాత్ విద్యార్థులు

న్యూఢిల్లీ, జూలై 4: వివాదాస్పదమైన నీట్-యూజీ పరీక్షను రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వంతో పాటు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ)ను ఆదేశించాలని కోరుతూ గుజరాత్‌కు చెందిన 56 మంది నీట్ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లలో నీట్‌కు అర్హత సాధించిన వారితో పాటు ఫస్ట్ ర్యాంకు పొందిన వారూ ఉన్నారు. ఈ ఏడాది మే 5న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ చేసిన వారు, దానికి సహకరించిన వారు, అలాగే అన్యాయమైన పద్ధతులను అనుసరించి పరీక్ష రాసిన వారిని విచారణ జరిపి గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర విద్యాశాఖను ఆదేశించాలని కూడా పిటిషనర్లు కోర్టును అభ్యర్థించారు. అవకతవకల నేపథ్యంలో నీట్‌ను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని కోరుతూ దాఖలైన 26 పిటిషన్లపై ఈనెల 8న అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో.. గుజరాత్ విద్యార్థులు కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించడం వల్ల అర్హత సాధించిన అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రాలకు బియ్యం విక్రయాల పునరుద్ధరణ

» ప్రైవేటు వ్యాపారులకు కూడా.. కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 4: రాష్ట్రాలకు సబ్సిడీ ధరపై బియ్యం విక్రయాలను పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో ప్రైవేటు వ్యాపారులకు కూడా విక్రయించనుంది. తాను భారీగా సేకరించిన బియ్యం నిల్వలను తగ్గించుకోవడం ఈ నిర్ణయం ముఖ్యోద్దేశం. సబ్సిడీపై బియ్యం విక్రయాలను కేంద్రం గత ఏడాది జూన్‌లో నిలిపివేయడంతో కర్ణాటక, తమిళనాడు, కేరళ సహా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. అయితే నిరుడు వర్షాలు సమృద్ధిగా పడనందున విక్రయాలు ఆపేశామని.. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ విభాగం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పంటల దిగుబడి బాగా ఉండే అవకాశం ఉండడం.. ఇదే సమయంలో ఆహార నిల్వలు బాగా పెరిగిపోవడం.. వాటి నిర్వహణకు బాగా ఖర్చవుతుండడం.. నిల్వకు ఉన్న గోదాములు కూడా సరిపోకపోవడం తదితర కారణాలతో విక్రయాలు పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. నిర్వహణ ఖర్చుల భారం రూ.16-18 వేల కోట్లు అధికంగా ఉండబోతోందని.. ఈ నెలలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిని ప్రస్తావించనున్నట్లు వెల్లడించారు. పెరిగిన బియ్యం నిల్వలు తగ్గించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సారథ్యంలోని అంతర్-మంత్రిత్వ శాఖల కమిటీకి ఆహార శాఖ సిఫారసు చేసిందని.. దీంతో అమ్మకాల పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు.

పార్లమెంట్ ప్రాంగణంలో అల్లూరి విగ్రహం పెట్టాలి

» కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మంత్రి సీతక్క

కవాడిగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. అల్లూరి విగ్రహం ఏర్పాటు కోసం తెలుగు రాష్ట్రాల ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం ట్యాంక్‌బండ్‌పై క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్క.. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన అల్లూరి అంటే ఒక పోరాటం, ఒక వెలుగు, ఒక స్ఫూర్తి అని కొనియాడారు.

ప్రాణాలు తోడేస్తున్న వాయుకాలుష్యం

హైదరాబాద్‌తోపాటు దేశంలోని పది నగరాల్లో అంతర్జాతీయస్థాయి అధ్యయనం

» రోజువారీ మరణాల్లో 7.2 శాతానికి వాయుకాలుష్యమే కారణం

» వాహన, పారిశ్రామిక ఉద్గారాలతోనే ముప్పు: లాన్సెట్‌లో వెల్లడి


న్యూఢిల్లీ, జూలై 4: వాయుకాలుష్యం పలు రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చి పెట్టటమే కాదు.. ఏకంగా ప్రాణాలనే హరిస్తోంది. మన దేశంలో ప్రధాన నగరాల్లో రోజువారీ సంభవించే మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలు వాయుకాలుష్యం వల్లనే సంభవిస్తున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ నగరాల్లో హైదరాబాద్ కూడా విశేషం. 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయనం వివరాలు ప్రచురితమయ్యాయి. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజెస్ కంట్రోల్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన పరిశోధన సంస్థలతో కూడిన ఒక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, అహ్మదాబాద్, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, షిమ్లా, వారణాసిల్లో పరిశోధకులు.. పీఎం 2.5 వాయుకాలుష్యానికి ఆయా నగరాల్లో మరణాలకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు. 2.5 మైక్రాన్ల కంటే తక్కువ వ్యాసం ఉన్న కాలుష్య కణాలను పీఎం 2.5 కాలుష్యంగా పేర్కొంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో ఒక ఘనపు మీటరుకు 15 మైక్రోగ్రాముల పీఎం 2.5లోపు ఉంటే అక్కడి గాలి సురక్షితంగా ఉన్నట్లు. అయితే, భారత్‌లో వాయు ప్రమాణాలు వేరుగా ఉన్నాయి. 60 మైక్రోగ్రాములలోపు పీఎం 2.5 ఉంటే నాణ్యమైన గాలిగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మన దేశంలోని ప్రమాణాల ప్రకారమే శాస్త్రవేత్తలు అధ్యయనం నిర్వహించారు. 2008-2019 మధ్య కాలంలో పది నగరాల్లో సంభవించిన 36 లక్షల మరణాలు, వాటికి కారణాలను విశ్లేషించారు. దీని ప్రకారం.. నగరాల్లో పీఎం 2.5 కాలుష్యానికి ప్రధాన కారణం వాహన, పారిశ్రామిక ఉద్గారాలే. రోజువారీ మరణాల్లో వీటి వల్ల సంభవిస్తున్నవి 7.2 శాతం ఉన్నాయి. పీఎం 2.5 కాలుష్య కారకాలు సగటున 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువారీగా 2.7 శాతం మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఢిల్లీలో పీఎం 2.5 కాలుష్యం అత్యధికంగా 113 స్థాయిలో ఉండగా, అక్కడి రోజువారీ మరణాల్లో 11.5 శాతం మరణాలకు వాయుకాలుష్యం కారణమవుతోంది. హైదరాబాద్‌లో పీఎం 2.5 38.9 ఉండగా, రోజువారీ మరణాల్లో 5.6 శాతం వాయుకాలుష్యం వల్ల సంభవిస్తున్నాయి. మొత్తం 10 నగరాల్లో షిమ్లాలో పీఎం 2 కాలుష్యం అత్యల్పంగా 28.4 స్థాయిలో ఉంది. అక్కడి రోజువారీ మరణాల్లో వాయుకాలుష్యం వల్ల సంభవిస్తున్నవి 3.7 శాతమే. ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న ముఖ్య శాస్త్రవేత్తల్లో ఒకరైన భార్గవ్ కృష్ణ మాట్లాడుతూ, దేశంలో వాయుకాలుష్యం ఆందోళనకరస్థాయిలో పెరిగిపోయిందన్నారు. వాయునాణ్యతకు సంబంధించి భారత్‌లో నిర్ణయించుకున్న ప్రమాణాలు ఉండాల్సిన పరిమితి కన్నా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు.



సగటు పీఎం 2.5, రోజువారీ మరణాల్లో కాలుష్యం కారణంగా సంభవిస్తున్నవి (శాతంలో)

నగరం	సగటు	శాతం
అహ్మదాబాద్	37.9	5.6
బెంగళూరు	33.0	4.8
చెన్నై	33.7	4.9
ఢిల్లీ	113	11.5
హైదరాబాద్	38.9	5.6
కోల్‌కతా	55.2	7.3
ముంబై	41.7	5.6
పుణె	45.3	5.9
షిమ్లా	28.4	3.7
వారాణసీ	82.1	10.2
మొత్తం	53.6	7.2

లోకం తీరు



ఝార్ఖండ్ సీఎంగా హేమంత్ ప్రమాణం

రాంచీ, జూలై 4: జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ (48) గురువారం ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా మళ్లీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హేమంత్ సోరెన్ చేత గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. హేమంత్ సోరెన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది మూడోసారి. ఈ కార్యక్రమంలో సోరెన్ తండ్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) చీఫ్ శిబూ సోరెన్, ఆయన తల్లి రుపి సోరెన్, భార్య కల్పనా సోరెన్‌తోపాటు జేఎంఎం నేతృత్వంలోని కూటమి సీనియర్ నేతలు, బుధవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన చంపయి సోరెన్ కూడా పాల్గొన్నారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఝార్ఖండ్ హైకోర్టు జూన్ 28న బెయిల్ మంజూరు చేయడంతో దాదాపు ఐదు నెలల తర్వాత హేమంత్ సోరెన్ జైలు నుంచి విడుదలయ్యారు. కాగా ప్రతిపక్షాలు తనపై కుట్రపన్నాయని, ఫలితంగా తాను దాదాపు ఐదు నెలల పాటు జైల్లో ఉండాల్సి వచ్చిందని హేమంత్ వీడియో సందేశంలో తెలిపారు. కాగా హేమంత్ సోరెన్ క్యాబినెట్‌కు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.



ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న హేమంత్

మైక్రోసాఫ్ట్‌లో మరోసారి ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ, జూలై 4: ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి లేఆఫ్‌లు ప్రకటించింది. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొన్ని బృందాలకు చెందిన ఉద్యోగులను తొలగించినట్లు 'గీక్‌వైర్' అనే మీడియా సంస్థ తెలిపింది. జూన్ 30తో ఆర్థిక సంవత్సరం ముగియడంతో... కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఎంతమందిని తొలగించింది అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. అయితే తాజా తొలగింపులపై మైక్రోసాఫ్ట్‌పై అధికార ప్రతినిధి ఒకరు స్పందించారు. వ్యాపార నిర్వహణలో భాగంగా సంస్థాగతంగా కొన్ని మార్పులు తప్పవని తెలిపారు. వినియోగదారులకు, భాగస్వాములకు మెరుగైన సేవలు అందించే క్రమంలో కోతలు సర్వసాధారణమేనని పేర్కొన్నారు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాదిలోనే దాదాపు 3 వేల మందిని తొలగించింది.

8 నెలల గరిష్ఠానికి నిరుద్యోగిత రేటు

» మేలో 7% నుంచి జూన్‌లో 9.2 శాతానికి!

» 2023 జూన్ నాటికి ఈ రేటు 8.5 శాతమే

» పట్టణాలతో పోలిస్తే గ్రామీణప్రాంతాల్లో పురుషులతో పోలిస్తే మహిళల్లో అధికం

» సీఎంఐఈ హౌస్‌హోల్డ్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో నిరుద్యోగ రేటు జూన్‌లో 9.2 శాతానికి చేరిందని.. ఇది 8 నెలల గరిష్ఠమని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వెల్లడించింది. 2024 మేలో 7 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. నెలలోనే 2.2 శాతం మేర పెరగడం గమనార్హం. 'కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్' సర్వే ఆధారంగా సీఎంఐఈ ఈ వివరాలను విడుదల చేసింది. దాని ప్రకారం..

- గత ఏడాది ఇదే సమయానికి.. అంటే 2023 జూన్ నాటికి దేశంలో నిరుద్యోగ రేటు 8.5 శాతంగా ఉంది.
- నిరుడు జూన్‌లో 15.1 శాతంగా ఉన్న మహిళా నిరుద్యోగ రేటు.. ఈ ఏడాది మరింత పెరిగి 18.5 శాతానికి చేరింది. జాతీయ నిరుద్యోగరేటుకు ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం.
- పురుషుల్లో నిరుద్యోగరేటు గత ఏడాది జూన్‌లో 7.7% ఉండగా.. ఈ ఏడాది అది 7.8 శాతంగా ఉంది.
- ఎప్పటిలాగానే ఈసారి కూడా.. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు అధికంగా ఉంది. మే నెలలో గ్రామీణ ప్రాంతాల్లో 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. జూన్‌నాటికి 9.3 శాతానికి చేరింది. 2023లో ఇది 8.8 శాతమే. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల్లో మే నాటికి 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు జూన్‌కి 8.2 శాతానికి, మహిళల్లో నిరుద్యోగ రేటు 12 శాతం నుంచి 17.1 శాతానికి పెరగడం గమనార్హం.
- పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు స్వల్పంగా మాత్రమే (మేలో 8.6% నుంచి జూన్‌లో 8.9 శాతానికి) పెరిగింది. పట్టణ మహిళల్లో నిరుద్యోగ రేటు మాత్రం 18.53 శాతం నుంచి 21.36 శాతానికి పెరిగింది.

వర్షాలతో వణుకుతున్న ఉత్తరాఖండ్



డెహ్రాడూన్, జూలై 4: ఎడతెరపి లేని వానలు ఉత్తరాఖండ్‌ను వణికిస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ రాష్ట్రంలోని ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అలకనంద, మందాకిని, భగీరథి నదులు ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటేసి ప్రవహిస్తుండగా.. గంగా, సరయు నదులు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. గోమతి, కాళీ, గౌరీ, శారద నదుల్లో కూడా నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దాదాపు 100 రహదారులను మూసివేశారు. అలకనంద నది ఉప్పొంగడంతో రుద్రప్రయాగ వద్ద నది పక్కన ఏర్పాటు చేసిన 10 అడుగుల శివుడి విగ్రహం నీట మునిగింది. చంపావత్, అల్మోరా, పిథోర్‌గఢ్, ఉధమ్‌సింగ్ నగర్, కుమావ్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో మరో వారంరోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఉత్తరాఖండ్ వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల కారణంగా డెహ్రాడూన్, పౌరి, తెహ్రీ, హరిద్వార్‌లోనూ ఆరెంజ్ అలర్ట్ (సిద్ధంగా ఉండాలి) ప్రకటించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గంగా, అలకనంద, భగీరథి, శారద, మందాకిని, కోసి నదుల్లో నీటిమట్టం భారీగా పెరిగింది. గత 24 గంటల్లో అల్మోరాలోని చౌకుటియాలో అత్యధికంగా 72.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. లోతట్టు ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీరప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హత్రాస్ తొక్కిసలాట కేసులో ఆరుగురి అరెస్టు

» ప్రధాన నిందితుడు దేవ్‌ప్రకాశ్ మధుకర్ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమానం: పోలీసులు

హత్రాస్, జూలై 4: హత్రాస్ తొక్కిసలాట దుర్ఘటన కేసుకు సంబంధించి భోలే బాబా సేవాదారులు ఆరుగురిని అరెస్టు చేశామని యూపీ పోలీసులు ప్రకటించారు. ఆ ఆరుగురిలో సత్సంగ్ నిర్వాహక కమిటీకి చెందిన ఇద్దరు మహిళా సేవాదార్లు ఉన్నట్టు వారు వెల్లడించారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు.. సత్సంగ్ నిర్వహణకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్న సేవాదార్.. దేవ్‌ప్రకాశ్ మధుకర్ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమానం ప్రకటిస్తామని అలీగఢ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శలభ్ మాథుర్ తెలిపారు. అతడిపై నాన్‌బెయిలబుల్ వారంట్ కూడా జారీ చేయనున్నట్టు చెప్పారు. తాము అరెస్ట్ చేసిన ఆరుగురిలో ఒకరైన రామ్ లదైతే (50), ఉపేంద్రసింగ్ యాదవ్ (62) మెయిన్‌పురివాసులని.. మిగతా నలుగురు మేఘ్ సింగ్ (61), ముఖేశ్ కుమార్ (38), మంజు యాదవ్ (30), మంజు దేవి (40) హత్రాస్‌వాసులని వివరించారు. వీరంతా సత్సంగ్ నిర్వాహక కమిటీ సభ్యులని, సేవాదార్లుగా పనిచేస్తున్నారని మాథుర్ తెలిపారు. ఆరోజు జనాన్ని అక్కడికి తరలించింది, విరాళాలు స్వీకరించింది వీరేనని వివరించారు. పెద్ద ఎత్తున వచ్చిన జనాన్ని నియంత్రించేందుకు పోలీసులను, అధికారులను వారు అనుమతించలేదని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో భోలే బాబా పేరును చేర్చకపోవడం గురించి ప్రశ్నించగా.. అవసరమైతే ఆయన్నూ ప్రశ్నిస్తామని పేర్కొన్నారు. ఇక ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారందరి వివరాలనూ గుర్తించి, మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు యూపీలోని మెయిన్‌పురిలో ఉన్న భోలే బాబా ప్రధాన ఆశ్రమం 'రామ్ కుటీర్ చారిటబుల్ ట్రస్ట్'లో యూపీ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ భోలే బాబా లేరని, 30-40 మంది సేవాదార్లు మాత్రం ఉన్నారని మీడియాకు తెలిపారు. అయితే బాబా సత్సంగ్‌లో ఇంత ఘోరం జరిగినా ఇంకా చాలా మంది ఆయన ఆశ్రమం వద్దకు వచ్చి 'ఇలా జరిగిందేంటి బాబా' అని కన్నీరు పెడుతున్నారు. 'జై భోలే బాబా' అని నినాదాలు చేస్తున్నారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా, జూలై 4: కోచింగ్ కేంద్రాలకు నిలయమైన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జేఈఈకి శిక్షణ తీసుకుంటున్న బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన సందీప్ కుమార్ కుర్మి బుధవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. గత రెండేళ్లుగా ఇక్కడి మహావీర్ నగర్‌లోని పేయింగ్ గెస్ట్ (పీజీ) రూంలో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. కోటాలో జనవరి నుంచి ఇంతవరకు 13 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. 13 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. గత ఏడాది లెక్కలను కూడా కలుపుకొంటే మొత్తం 26 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

ఎంపీల సగటు ఓట్లు 50.58%

» గతంతో పోల్చితే స్వల్పంగా తగ్గుదల

» ఏడీఆర్ విశ్లేషణలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 4: తాజా లోక్‌సభ ఎన్నికల్లో విజేతలు పోలైన ఓట్లలో సగటున 50.58% ఓట్లు పొందారు. 2019 ఎన్నికలతో పోల్చితే ఇది 2% తక్కువ కావడం గమనార్హం. దేశంలోని మొత్తం ఓట్ల సంఖ్య ఆధారంగా విశ్లేషణ జరిపితే.. వారికి సగటున 33.44% ఓట్లు మాత్రమే వచ్చాయి. మునుపటి ఎన్నికల్లో సగటు ఓట్లు 35.46% మేర ఉండగా ఈసారి అవి తగ్గాయి. పోలింగ్ శాతం తగ్గడమే ఇందుకు కారణం. క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల్లో 42% మందికి కూడా 50శాతం కన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ)లు జరిపిన సమగ్ర విశ్లేషణలో ఇలాంటి ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. గుజరాత్‌లోని సూరత్ నియోజకవర్గంలో ఏకగ్రీవ ఎన్నిక జరగడంతో దాన్ని మినహాయించి మొత్తం 542 స్థానాల ఫలితాలను విశ్లేషించాయి.

- మొత్తం విజేతల్లో 279 మంది ఎంపీలకు పోలైన ఓట్లలో 51% కన్నా అధికంగా ఓట్లు వచ్చాయి.
- 263 మంది ఎంపీలకు 50% కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. వీరిలో 75 మంది బీజేపీ, 57 మంది కాంగ్రెస్, 32 మంది సమాజ్‌వాదీ, 21 మంది తృణమూల్, 14 మంది తృణమూల్ ఎంపీలు ఉన్నారు.
- 215 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉండగా వారిలో 106 మంది 50శాతం కన్నా అధికంగా ఓట్లు సంపాదించారు.
- మొత్తం ఎంపీల్లో 503 మంది కోటీశ్వరులు కావడం విశేషం. వీరిలో 262 మంది పోలైన ఓట్లలో సగానికన్నా ఎక్కువగానే ఓట్లు సంపాదించారు.
- అయిదుగురు ఎంపీలు 2,000 ఓట్ల కన్నా తక్కువ మెజార్టీతో విజయం సాధించారు.
- అత్యధికంగా ఓట్ల వాటా పొందిన వారిలో బీజేపీకి చెందిన శివరాజ్ సింగ్ చౌహాన్ (56.43%- విదీశా), శంకర్ లాల్వానీ (64.54%- ఇండోర్) ఉన్నారు. మహిళల్లో అయితే కీర్తి దేవి దేబ్‌బర్మన్ (68.54%- తూర్పు త్రిపుర) ఉన్నారు.
- 214 మంది ఎంపీలు మరోసారి ఎన్నిక కాగా, వారిలో 101 మందికి సగానికన్నా ఎక్కువగా ఓట్లు వచ్చాయి.
- నోటాకు కూడా ఈ సారి తక్కువ ఓట్లే పడ్డాయి. 2019లో 1.12% ఓట్లు నోటాకు పడగా ఈసారి 0.99% మాత్రమే వచ్చాయి.
- మొత్తం ఓటింగ్ శాతం తగ్గడమే ఇందుకు ఒక కారణం. 2019లో 67.35% ఓట్లు పోల్ కాగా, ఈ సారి 66.12 శాతం మంది మాత్రమే ఓటు వేశారు.



24 గంటలు.. మూడు బ్రిడ్జిలు

» బిహార్ సరన్ జిల్లాలో కూలిన మరో వారధి

పట్నా, జూలై 4: బిహార్‌లో బ్రిడ్జిలు కూలిపోయే పరంపర కొనసాగుతోంది. ఒక్క సరన్ జిల్లాలోనే 24 గంటల్లో మూడో వారధి పడిపోయింది. ఆ రాష్ట్రంలో 17 రోజుల్లో ఇది 12వ ఘటన. సరన్‌లోని బనియాపూర్ బ్లాక్‌లో పదిహేనేళ్ల క్రితం నిర్మించిన చిన్న బ్రిడ్జి గురువారం కూలిపోయింది. గండకీ నదిపై కట్టిన ఈ వారధి సరన్‌లోని పలు గ్రామాలు, పొరుగునున్న సివాన్ జిల్లాలోని ఊళ్లను కలుపుతుంది. తాజా ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని, ఘటనపై ఉన్నతాధికారులతో విచారణ కమిటీని వేశామని సరన్ కలెక్టర్ అమన్ సమీర్ తెలిపారు. సరన్ జిల్లాలో దీనికిముందు జనతా బజార్, లహ్లద్ పూర్ ఏరియాల్లో రెండు చిన్న బ్రిడ్జిలు పడిపోయాయి. ఈ జిల్లాలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బ్రిడ్జిలు కూలడానికి ఇదీ ఓ కారణమని స్థానికులు చెబుతున్నారు. మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లోనూ ఇటీవలికాలంలో పది వారధులు కూలాయి. రాష్ట్రంలోని అన్ని పాత బ్రిడ్జిల పరిస్థితిపై ప్రభుత్వం సమీక్షకు ఆదేశించింది. ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నాయని బిహార్ అదనపు ప్రధాన కార్యదర్శి చైతన్య ప్రసాద్ (జల వనరులు) తెలిపారు. గండకీ నదిపై సివాన్, సరన్ జిల్లాల్లోనే బుధ, గురువారాల్లో 6 వంతెనలు పడిపోయాయన్నారు. వీటిలో చాలావరకు 30ఏళ్ల కింద నిర్మించినవి, పునాదులు లోతుగాలేవని చెప్పారు. కాగా వరుస ఘటనల నేపథ్యంలో బిహార్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా సూచించాలని న్యాయవాది బ్రజేశ్ సింగ్ సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దేశంలోనే అత్యంత వరద ప్రభావిత రాష్ట్రం బిహార్ అని ఆయన పేర్కొన్నారు.

కల్తీ కల్లు తాగి.. ఇద్దరి మృతి

» మరొకరు విషమం.. పుట్టినరోజు వేడుకలో విషాదం

» మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెంలో ఘటన

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా), జూలై 4: స్నేహితుల పుట్టినరోజు వేడుక రెండు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. పార్టీలో భాగంగా కల్లు తెప్పించగా దాన్ని తాగిన ముగ్గురు యువకులూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఈ విషాద ఘటన జరిగింది. ఎస్సై సతీశ్, గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొంతు విజయ్, గొడిశాల మనోజ్, బోగోజి శ్రావణ్ (26), ఎస్కే. రహీంపాష (25), ఉపేంద్రాచారి స్నేహితులు. జూన్ 10న విజయ్, మనోజ్ పుట్టినరోజు కావడంతో ఆ రోజు స్నేహితులంతా కలిసి పార్టీ చేసుకోవాలనుకున్నారు. సాయంత్రం శ్రావణ్, రహీం పాష, ఉపేంద్రచారి మరో 12మంది యువకులు కలిసి ఊరు చివరన విజయ్, మనోజ్‌తో కేక్ కట్ చేయించి వేడుక చేసుకున్నారు. చికెన్‌తో భోజనం చేశారు. కొందరు మద్యం తాగారు. రామన్న గూడెం, ముంగిమడుగు గ్రామాల చెందిన ముగ్గురు గీతకార్మికుల వద్ద 12సీసాల కల్లు తెప్పించారు. ఆ కల్లును శ్రావణ్, రహీం పాష, ఉపేంద్రాచారి తాగారు. మరుసటిరోజు నుంచి ఈ ముగ్గురూ తీవ్రమైన జర్వం, ఒళ్లునొప్పులతో బాధపడ్డారు. జూన్ 18న మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యుడిని సంప్రదించారు. రక్త పరీక్షలు చేయగా కామెర్లు వచ్చినట్లు తేలింది. ఆ డాక్టర్ మందులు ఇచ్చినప్పటికీ జ్వరం మరింత తీవ్రం కావడంతో వారు 26న ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌కు వెళ్లి మరోసారి రక్త పరీక్షలు నిర్వహించారు. కల్లులో రసాయనాలను కలపడంతో అది మిథనాల్‌గా మారిందని.. కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం పడిందని వైద్యులు వెల్లడించారు. ఆ మరుసటి రోజు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వేర్వేరు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ముగ్గురిలో శ్రావణ్ బుధవారం మధ్యాహ్నం, రహీం పాషా గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఉపేంద్రాచారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.


శ్రావణ్, రహీంపాషా(ఫైల్)

విషప్రయోగంపై అనుమానాలు..

కల్లులోనే ప్రాణాంతకరమైన మందులు కలిపి ఉండొచ్చని బాధిత కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేడుకలో పాల్గొన్న కొందరు స్నేహితులే ఆ ముగ్గురిపై విషప్రయోగం చేసి, ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న యువకులు రెండు గ్రూపులుగా విడిపోయారని, కొందరి మధ్య ఆధిపత్య పోరు సాగుతోందని, ఈ క్రమంలో వారిలోనే కొందరు ముగ్గురిపై విషప్రయోగం చేసి ఉండొచ్చన్న అనుమానాలను వ్యక్తమవుతున్నాయి.

లోడు ఎరువుకు రూ.లక్ష లంచం

» ఏసీబీకి చిక్కిన కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్, క్యాషియర్


ఏసీబీకి చిక్కిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ కుమారస్వామి

కరీంనగర్ క్రైం, జూలై 4 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించిన కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన డబ్బుకు బదులు ఎరువుల లోడ్‌లు ఇస్తూ ఒక్కో లోడుకు రూ.లక్ష చొప్పున లంచం డిమాండ్ చేస్తున్న కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వలకు చిక్కారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన కావటి రాజు అనే కాంట్రాక్టర్ మౌలిక వసతులు కల్పించారు. ఇందుకు సంబంధించి 2018-23 వరకు రాజుకు రూ.90,16,652 కమీషన్ చెల్లించాల్సి ఉంది. ఈ కమీషన్ ఇవ్వాలంటే తనకు లంచం ఇవ్వాలని డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు రాజును వేధిస్తున్నారు. అయితే, రాజుకు చెల్లించాల్సిన డబ్బు కింద ఇటీవల రూ.20,91,500 విలువైన ఎరువులు ఇచ్చిన మేనేజర్ వెంకటేశ్వర్‌రావు 4 లక్షల లంచం డిమాండ్ చేశాడు. మిగిలిన రూ. 69,25,152 కోసం రాజు అడగ్గా 4 లక్షలు లంచం ఇవ్వాలని, మిగిలిన డబ్బుకు బదులుగా 15 లారీల ఎరువులు ఇస్తానని చెప్పాడు. ఒక్కో లారీ తీసుకెళ్లేముందు లోడుకు రూ.లక్ష చొప్పున చెల్లించాలని స్పష్టం చేశాడు. దీంతో విసిగిపోయినన రాజు జూలై1న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ సూచనల మేరకు డీసీఎంఎస్ మేనేజర్‌ను కలిసిన రాజు రూ.లక్ష ఇవ్వబోగా నగదును క్యాషియర్ కుమారస్వామికి ఇవ్వాలని మేనేజర్ సూచించారు. రాజు నుంచి కుమారస్వామి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

హైదరాబాద్ - విజయవాడ హైవేను విస్తరించాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాక తొలిసారి ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు.. గురువారం అక్కడ ప్రధాని మోదీని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా ఆరుగురు కేంద్ర మంత్రులను కలిసి ఏపీ పునర్నిర్మాణానికి చేయూతనివ్వాలని అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ఆర్థికంగా అస్తవ్యస్తమై, అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని.. రాష్ట్రం కోలుకునేంతవరకూ ఆర్థిక సహకారం అందించాలని ప్రధాని మోదీని కోరారు. నిధుల నిర్వహణలో గత ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడినందువల్ల ఏపీలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. రాష్ట్రానికి ఆర్థికంగా చేయూతనివ్వడంతోపాటు.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంపూర్ణ సహకారం, రాజధాని అమరావతిలో ప్రభుత్వ సముదాయాలు, మౌలిక సదుపాయాల పూర్తికి సమగ్ర ఆర్థిక మద్దతు.. పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాలు, రోడ్లు, వంతెనలు, నీటి పారుదల, తాగునీటి ప్రాజెక్టుల వంటి అత్యవసర రంగాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి వ్యయం కోసం ప్రత్యేక సాయం కింద అదనపు కేటాయింపులు, బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో వెనుకబడినప్రాంతాలకు మద్దతు, దుగరాజపట్నం రేవు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అభ్యర్థించారు. విభజన కంటే గడిచిన ఐదేళ్లలో జగన్ పాలన వల్ల రాష్ట్రానికి కలిగిన నష్టమే ఎక్కువని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక వనరుల లోటు తీవ్రంగా ఉందని ప్రధానికి వివరించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తేనే ఈ సవాళ్లను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. చంద్రబాబు విజ్ఞప్తికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడతామని.. రాజధాని అమరావతి సహా రాష్ట్ర పునర్నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. అలాగే.. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్‌గడ్కరీ, ఖట్టర్, పీయూష్‌గోయల్, శివరాజ్‌సింగ్ చౌహాన్, హర్దీప్ సింగ్‌పురీ.. ఏపీ పునర్నిర్మాణానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అమిత్ షా, చంద్రబాబు దాదాపు అర గంట సేపు కీలక సమాలోచనలు జరిపారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక అంశాలను చంద్రబాబుతో చర్చించానని హోం మంత్రి స్వయంగా ట్వీట్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వికసిత్ భారత్‌తో పాటు వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు కట్టుబడి ఉందని తెలిపారు. కాగా.. చంద్రబాబు శుక్రవారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, రాందాస్ అథవాలేతో పాటు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, జపాన్ రాయబారి సుజుకి హిరోషీని కలుస్తారు.


కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు వర్మ, పెమ్మసాని, టీడీపీ ఎంపీలు

నేడు హైదరాబాద్‌కు ఏపీ సీఎం చంద్రబాబు

» ఘన స్వాగతానికి టీడీపీ ఏర్పాట్లు

» బేగంపేట నుంచి భారీ ఊరేగింపు

హైదరాబాద్, రాంనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా టీడీపీ అధినేత చంద్రబాబు హైదరాబాద్‌కు వస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకునే ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ టీడీపీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం వరకు వేలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నారు. పలుచోట్ల పసుపు తోరణాలు, స్వాగత ఫ్లెక్సీలతో పాటు బతుకమ్మ, బోనాలు, డీజేలను సిద్ధం చేశారు. టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌ను అలంకరించారు. కాగా, శనివారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు భేటీ కానున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా బాబు నివాసం నుంచి భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని, ఘనంగా సన్మానించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. మరోవైపు అధినేతతో టీటీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఉండనుంది. ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. రాష్ట్ర పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకానికి సంబంధించి వారి నుంచి అభిప్రాయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే తెలంగాణలో టీడీపీ బలోపేతం, సభ్యత్వ నమోదు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై బాబు దిశా నిర్దేశం చేస్తారు. కాగా, హైదరాబాద్‌తో చంద్రబాబుకు ప్రత్యేక అనుబంధం ఉందని.. నగరంతో పాటు తెలంగాణలో ఆయన చేసిన అభివృద్ధి ఆనవాళ్లు ఎప్పటికీ కనిపిస్తాయని టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాగా, చంద్రబాబుకు చరిత్రలో నిలిచిపోయేలా స్వాగతం పలుకుతామని టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు పర్యటనతో పార్టీ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొందని అధికార ప్రతినిధి సూర్యదేవర లత చెప్పారు. ఫిరాయింపుల దుష్ట సంప్రదాయాన్ని కేసీఆర్ ప్రోత్సహించారని.. ఇప్పుడు దానికే బీఆర్ఎస్ బలవుతోందని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.దుర్గాప్రసాద్ అన్నారు. కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీడీపీ వైపు చూస్తున్నారని, టీడీపీ నుంచి వెళ్లినవారిని తిరిగి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో తాను చేసిన అభివృద్ధిని తర్వాత వచ్చిన పాలకులు కొనసాగించారని ప్రకటించి చంద్రబాబు రాజ నీతిజ్ఞత ప్రదర్శించారని అధికార ప్రతినిధి డాక్టర్ ఎ.ఎస్.రావు అన్నారు.

రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఇస్తేనే బతుకుతాడు

» ఏడాది బాబుకు అరుదైన వ్యాధి.. మరో 11 నెలల్లో ఇంజెక్షన్ ఇవ్వాల్సిందే: వైద్యులు

» దాతల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు


శ్రేయాన్

కోటపల్లి, జూలై 4: శారీరక ఎదుగుదల లేకపోవడంతో ఏడాది వయసున్న బాబును ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు చెప్పిన మాటలు విని ఆ తల్లిదండ్రుల గుండెలు బద్దలయ్యాయి! బాబు, కోటి మందిలో ఒకరికి వచ్చే అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని స్వస్థత పొందాలంటే రూ.16 కోట్లు ఖరీదు చేసే ఇంజెక్షన్ చేయించాలని వైద్యులు చెప్పారు. ఎకరం పొలం సాగు చేసుకొని బతికే తాము అంత డబ్బు ఎక్కడి నుంచి తేగలం? అని ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లికి చెందిన పడాల సతీశ్-రవళి దంపతులకు వచ్చిన పెద్ద కష్టమిది. వీరికి కుమారుడు శ్రేయాన్ (13నెలలు) ఉన్నాడు. బాబు బోర్లా పడటం లేదని, బలహీనంగా ఉన్నాడంటూ ఆర్నెల్ల క్రితం మంచిర్యాల ఆస్పత్రిలో చూపించారు. గత ఏప్రిల్ 29న హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాబు "స్పైనల్ మస్క్యులర్ అట్రాసి టైప్ 2" అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని నిర్ధారించారు. చిన్నారికి రెండేళ్ల వయసు నిండేలోపు జోల్‌జన్‌స్మా ఇంజక్షన్ చేయించాలని, అప్పుడే ఫలితం ఉంటుందని, ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి తెప్పించాలని, దాని ఖరీదు రూ.16 కోట్లు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడిని బతికించాలని శ్రేయాన్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

అమరావతికి కేంద్ర సంస్థల క్యూ!

మళ్లీ రాజధానికి విచ్చేస్తున్న 45 సంస్థలు

» 40కి పైగా సంస్థలు సీఆర్‌డీఏతో చర్చలు

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో కేంద్ర సంస్థలు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి క్యూ కడుతున్నాయి. గతంలో భూ కేటాయింపులు పొందిన సంస్థలు ఒక్కొక్కటిగా కాలుమోపుతుండగా తాజాగా కేంద్ర సంస్థలు కూడా అమరావతి బాట పడుతున్నాయి. సోమవారం నుంచి 45 కేంద్ర సంస్థలు అమరావతిలో తమకు కేటాయించిన భూములలో కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనున్నాయి. కొన్ని సంస్థలు ఇప్పటికే సీఆర్‌డీఏ అధికారులతో టచ్‌లోకి వచ్చాయి. తమకు కేటాయించిన భూములను చదును చేసే అంశాలపై చర్చిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతి రాజధానిలో మొత్తం 132 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయి. వీటిలో కేంద్ర సంస్థలు 45 వరకూ ఉన్నాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత అమరావతి విధ్వంసానికి పాల్పడింది. కార్యాలయాల ఏర్పాటు, స్థలాల స్వాధీనం, అగ్రిమెంట్ల విషయంలో ఆయా సంస్థలను అనేక ఇబ్బందులకు గురిచేసింది. దీంతో గత ఐదేళ్ల కేంద్ర సంస్థలు ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలూ నిర్వహించలేకపోయాయి. కొన్ని సంస్థల భూకేటాయింపులను రద్దు చేస్తామని కూడా వైసీపీ ప్రభుత్వం బెదిరించింది. ఆయా సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పడంతో వెనకడుగు వేసింది. ఈ నేపథ్యంలో సంస్థలకు సహకరించకుండా ఇబ్బందులు పెట్టింది. టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో.. సుమారు 40 సంస్థలు మళ్లీ సీఆర్‌డీఏ అధికారులను సంప్రదిస్తున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) అధికారులు మిగిలిన సంస్థలకు ఫోన్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఆ సంస్థలతో మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీని కలిసిన సందర్భంలో కూడా కేంద్ర సంస్థలు అమరావతిలో తమ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వెంటనే ప్రధాని కార్యాలయం నుంచి ఆయా సంస్థలకు యుద్ధప్రాతిపదికన అమరావతిలో కార్యాలయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాలు అందాయి. దీంతో గురువారం సాయంత్రమే కేంద్ర సంస్థల నుంచి సీఆర్‌డీఏ అధికారులకు ఫోన్ల మీద ఫోన్లు వచ్చాయి. దాదాపుగా అన్ని కేంద్ర సంస్థల నుంచి సుముఖత వ్యక్తమైంది. సోమవారం నుంచి తమ కార్యాలయాల ఏర్పాటుకు వీలుగా చర్యలు చేపడతామని ఆయా సంస్థలు సీఆర్‌డీఏకు తెలిపాయి. తమకు కేటాయించిన స్థలాలలో జంగిల్ క్లియరెన్స్ చేసి పెట్టాల్సిందిగా కొన్ని సంస్థలు సీఆర్‌డీఏను కోరాయి.

ఆగస్టు నుంచి అశోక్ లేలాండ్ ఉత్పత్తి

మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి ప్రారంభం కావడానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చొరవతో ఆగస్టు నెల నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు సంస్థ యాజమాన్యం సిద్ధమైనట్టు తెలిసింది.

ఏపీ నుంచి రిలీవ్ చేయండి

» తెలంగాణ ఉద్యోగుల వినతి

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి తమను రిలీవ్ చేయాలని తెలంగాణ నేటివ్ ఎంప్లాయిస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేసినట్లు అసోసియేషన్ నేతలు గురువారం అమరావతి సచివాలయంలో మీడియాకు చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ నేటివ్ ఉద్యోగులను ఏపీకి కేటాయించారు. వారిలో కొందరు తిరిగి తెలంగాణకు వెళ్లిపోయారు. మిగిలిన కొద్ది మందిని కూడా పంపాలని వారు తాజాగా కోరారు. విభజన జరిగి పదేళ్లయినా తమను స్వరాష్ట్రానికి పంపకపోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ సీఎంలు 6న భేటీ కానున్న నేపథ్యంలో తమ సమస్యపై చర్చిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగలే యమపాశాలై...!

» విద్యుదాఘాతంతో రైతు, మరొకరి మృతి

చందంపేట, కనగల్, జూలై 4: పొలంలో తీగలు సరిచేస్తూ రైతు, తీగలు మీద పడి ఓ యువకుడు విద్యుదాఘాతంతో చనిపోయారు. నల్లగొండ జిల్లాలో గురువారం ఈ ఘటనలు జరిగాయి. కనగల్ మండలం బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన రైతు నల్లబోలు సైదిరెడ్డి (51) పొలంలో గాలి దుమారానికి బోరు మోటర్ వద్ద తెగిపడిన కరెంట్ తీగలను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సైదిరెడ్డి నల్లగొండ వ్యవసాయ కమిటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే, చందంపేట మండల కేంద్రానికి చెందిన కోమళ్ల అనిల్(22) గురువారం ఉదయం పొలంలో స్ప్రింక్లర్ పైపులు మారుస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ కనెక్షన్ తీగ అకస్మాత్తుగా తెగి మీద పడ్డాయి. దీంతో అనిల్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తెలుగు, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీల విభజన తేలేది.. సీఎంల సమావేశం తర్వాతనే!

» అనంతరమే ఈ ఏడాది ప్రవేశాలకు నోటిఫికేషన్లు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల మధ్య విభజన అంశాలపై శనివారం జరగనున్న ముఖ్యమంత్రుల సమావేశం తర్వాతనే తెలుగు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏవోయూ)లకు సంబంధించిన పలు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సీఎంల భేటీ అనంతరమే వీటిలో ప్రవేశాలకు నోటిఫికేషన్లు జారీ అవనున్నాయి. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున.. ఈ విశ్వవిద్యాలయాలు ఆయా రాష్ట్రాల వారీగా కార్యకలాపాలను కొనసాగించాల్సి ఉంటుంది. కానీ, ఏపీ పూర్తి స్థాయి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రవేశాలు, ఇతర కార్యకలాపాలపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న సీఎంల సమావేశంలో తెలుగు, బీఆర్ఏవోయూల విభజన కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. కార్యకలాపాలు వేర్వేరుగా కొనసాగించడంపై విశ్వవిద్యాలయాల అధికారులు గతంలోనే ఏపీకి లేఖ రాశారు. వారు మాత్రం ఈ ఏడాదికి మినహాయింపును కోరారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ఎలాంటి నిర్ణయమూ వెలువడలేదు. వర్సిటీల విభజనలో భాగంగా ఉద్యోగుల కేటాయింపు, నిధుల పంపకం పరిష్కారం కాలేదు. చాలామంది సిబ్బంది ఏపీకి వెళ్లాల్సి ఉంది. తెలుగు వర్సిటీకి ఏపీ నుంచి రూ.120 కోట్ల మేర రావాల్సి ఉంది. రిటైరైన ఉద్యోగులకు చెల్లించే పింఛన్ల విషయంలో ఏ రాష్ట్రం ఎంత భరించాలనేదానిపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఇవన్నీ సీఎంల సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. సురవరం ప్రతాపరెడ్డి, పాల్కుర్కి సోమనాథుడి పేర్లల్లో ఒకటి పెట్టాలనే చర్చ జరుగుతోంది.

అవును.. పిన్నెల్లి ఈవీఎం పగలగొట్టాడు!

» పోలింగ్ బూత్‌లో అన్యాయం జరుగుతోందని చెప్పడానికే: జగన్



నెల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'పాల్వాయిగేటు వంటి సెన్సిటివ్ పోలింగ్ బూత్‌లో ఒకే ఒక హోంగార్డును పెట్టి నడుపుతా ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో అన్యాయం జరుగుతా ఉందని చెప్పడం కోసం, అన్యాయం జరిగిన వారి పక్షాన నిలబడడం కోసం పిన్నెల్లి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎం పగలగొట్టే కార్యక్రమం చేశారు. నిజంగానే రామకృష్ణారెడ్డి కనుక రిగ్గింగ్ చేసుకుంటా ఉంటే.. నిజంగా అక్కడ ఎమ్మెల్యే పరిస్థితి బాగానే ఉండి ఉంటే ఎందుకు ఈవీఎం బద్దలు కొడతాడు' అని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈవీఎం కేసులో ఆయనకు బెయిల్ వచ్చిందని.. అయితే ఈ ఘటన జరిగిన పది రోజుల తర్వాత రామకృష్ణారెడ్డి ఆ బూత్‌లో హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదు చేశారని.. నిజంగానే అటువంటిది జరిగి ఉంటే సిట్ తన రిపోర్టులో చెప్పాలి కదా అని వ్యాఖ్యానించారు. పిన్నెల్లి మంచోడు కాబట్టే వరుసగా నాలుగు సార్లు గెలిచారన్నారు. అటువంటి వ్యక్తిని తప్పుడు కేసుల్లో జైల్లో పెట్టారని ఆరోపించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ గురువారం ములాఖత్‌లో కలిశారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్న ఆయన.. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబులతో కలిసి జైలుకు వెళ్లారు. పిన్నెల్లితో 20 నిమిషాలు మాట్లాడారు. అనంతరం జగన్ జైలు వెలుపల మీడియాతో మాట్లాడారు. కారంపూడిలో మే 14న ఓ ఎస్సీ వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు పిన్నెల్లి బయల్దేరితే ఊరి బయటే అడ్డగించారని, హత్యాయత్నం కేసు పెట్టిన సీఐ నారాయణస్వామి అసలు పిన్నెల్లికి తారసపడలేదని చెప్పారు. ఆ సమయంలో కారంపూడి టౌన్‌లో రెండు వర్గాలు రాళ్లు విసురుకున్న ఘటనలో సీఐకి చిన్న రాయి ఏదో తగిలి ఉండవచ్చన్నారు. కానీ ఆ రోజు సీఐ మెడికో లీగల్ కేసు పెట్టలేదని, మే 23న హత్యాయత్నం కేసు పెట్టారని తెలిపారు. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన సిట్ ఈ ఘటననూ తన రిపోర్టులో పేర్కొనలేదని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు రెడ్‌బుక్స్ పెట్టుకుని అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. 'చంద్రబాబును ప్రజలు క్షమించరాని పరిస్థితులు వస్తాయి. మీరు వేసే విత్తనమే రేపటి రోజున పండుతుంది. రేపటి రోజు గ్రామాల్లో మీ నాయకులకు ఇదే జరుగుతుంది. చంద్రబాబును హెచ్చరిస్తున్నా..' అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేరం ఎవరిది?

హత్రాస్ దేశమంతటికీ తెలిసిన పేరు. నాలుగేళ్ల కిందట అక్కడ ఒక దళిత అమ్మాయి అత్యాచారం, హత్య జరిగాయి. దోషులు అగ్రకులానికి చెందినవారు. ఎంతగా నిరసన వ్యక్తమైనా, ప్రభుత్వం చర్య తీసుకోవడానికి గాని, తీసుకున్నట్టు కనిపించడానికి కానీ సిద్ధపడలేదు. ఇప్పుడు, మరొక విషాదానికి హత్రాస్ కేంద్రమయింది. ఒక దళిత కుటుంబంలో సూరజ్ పాల్‌గా పుట్టి, నారాయణ్ సకాల్ హరి అలియాస్ భోలే బాబాగా ప్రసిద్ధుడయిన ఒక బాబా పాదధూళి కోసం మంగళవారం నాడు జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించారు. మరో ముప్పై మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయినవారిలో 112 మంది మహిళలే. ఇప్పుడు కూడా ప్రభుత్వం, అదే ఆదిత్యనాథ్ ప్రభుత్వం, ఎటువంటి కఠిన చర్య తీసుకోవడానికి సిద్ధంగా లేదు. బాబా మీద కేసే లేదు. ప్రభుత్వ యంత్రాంగం ప్రాణనష్టానికి ఎటువంటి బాధ్యతా తీసుకోవడం లేదు. అక్కడ భక్తుల సమావేశం (సత్సంగ్) నిర్వహించిన వారు ఆరుగురి మీద మాత్రం కేసు పెట్టారు. ఇదంతా అలక్ష్యం వల్ల, వైఫల్యం వల్లా జరగలేదని, ఏదో కుట్ర ఉండి ఉండవచ్చునని ప్రభుత్వ పెద్దలు అనుమానిస్తున్నారు. న్యాయవిచారణకు కూడా ఆదేశించారు.

భోలేబాబా మథుర, ఆగ్రా, హత్రాస్ పరిసర ప్రాంతాలలో బాగా ప్రసిద్ధుడు. ఈ సంఘటన తరువాత, డేరా బాబా వంటి వారితో ఈయన పేరును కలిపి చెబుతున్నారు కానీ, ఈయన పెద్ద హంగామా ఉన్న బాబా కాదు. భక్తులు మాత్రం దళితులతో పాటు, ఇతర కులాల్లో కూడా ఉన్నారు. ఈ బాబాను సమీపించడమే కష్టం అని చెబుతారు. మంచిచెడుల గురించి బోధనలు చేస్తాడని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉపదేశిస్తాడని భక్తులు చెబుతున్నారు. ఈయన గత చరిత్రలో ఏమన్నా నేరాలు, ఘోరాలు ఉన్నాయా అని పోలీసులు, మీడియా పరిశోధనలు చేశారు కానీ, పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసి స్వచ్ఛంద విరమణ చేసిన ఈ సూరజ్‌పాల్ మీద దాదాపు పాతికేళ్ల కిందట ఒక కేసు నమోదయింది. చనిపోయిన ఒక బాలికను బతికిస్తానని చెప్పి, ఖననం చేసిన శవాన్ని వెలికి తీయించిన అభియోగం అది. అప్పుడు ఆయన మీద ఆ నేరారోపణ ఉంది కానీ, తన సత్సంగ్‌లలో బాబా ఎటువంటి మాయమంత్రాలు ప్రదర్శించడని భక్తులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు, మానసిక కలవరాలు ఆయన మాటలు వింటే తొలగిపోతాయని, మనశ్శాంతి దొరుకుతుందని వాళ్లు నమ్ముతున్నారు. ఇన్నిమరణాలకు కారణమైన సంఘటనలో బాబా నేరమేమీ లేదని, సొంతవారిని కోల్పోయిన భక్తులు కూడా వాదిస్తున్నారు.

ఎనభై వేల మంది హాజరవుతారని చెప్పిన సమావేశానికి రెండు లక్షల ముప్పైవేల మంది వచ్చారు. సమావేశ స్థలం పక్కన బురద నేల ఉంది. వర్షం వచ్చేట్టు ఉన్నదని వాతావరణ సూచన ఉన్నా, అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. కారులో వెడుతున్న బాబాను అందుకోవడానికో, కారు కింది మట్టిని ముట్టుకోవడానికో భక్తులు ఎగబడిపోయారు. అదుపు తప్పింది. సమావేశంలో క్రమశిక్షణ కోసం నిర్వాహకులు నియమించుకున్న వలంటీర్లు చేతులెత్తేశారు. ఏదో ప్రమాదం జరిగిందని పసిగట్టిన వెంటనే బాబా అక్కడి నుంచి పారిపోయాడు.

ఇప్పుడు నేరం ఎవరిదని చర్చ. బాబాను కేసులో చేర్చడానికి ప్రభుత్వం సంకోచిస్తున్నది. అతనికి ఉన్న ప్రజాదరణ రీత్యా ఆ సంకోచం సహజమే కావచ్చు. మరో పక్క, దేశవ్యాప్తంగా బాబా మీద చర్య కోసం డిమాండ్ పెరుగుతున్నది. ఇటువంటి జనసమీకరణలో, కార్యక్రమ నిర్వాహకుల బాధ్యత ఎంత, స్థానిక ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత ఎంత అన్న చర్చ కూడా అవసరం. రెండు లక్షలమందికి పైగా ఒక చోట గుమిగూడినప్పుడు, అక్కడ అవాంఛనీయ పరిస్థితులు నివారించడానికి ప్రభుత్వమే కల్పించుకోవడం ఆనవాయితీ. సమస్యల మీద గొంతెత్తే ప్రజలు నలుగురు గుమిగూడితే చాలు, పరిగెత్తుకువచ్చే పోలీసులు ఇంత జనసమ్మర్దాన్ని ఎట్లా వదిలేస్తారు? పరిస్థితిని అదుపు చేయడంలోను, త్వరితగతిన చెదరగొట్టి, వైద్య సదుపాయాలు అందించడంలోను వైఫల్యం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అంగీకరించాలి.

అనుమతి పొందిన సంఖ్య కంటె ఎక్కువ మంది గుమిగూడడం, నిర్వాహకులు బాధ్యతారహితంగా ఉండడం వంటివి సాంకేతిక అంశాలు. ప్రభుత్వ యంత్రాంగం పాత్ర కూడా జవాబుదారీతనానికి సంబంధించినది. అసలు సమస్య, ఎందుకు అంత మంది అటువంటి బాబాలకు భక్తులవుతున్నారు? అతని వంటి వారి మాటల నుంచి, వారిని నమ్మడం నుంచి ప్రజలకు కలుగుతున్న ఉపశమనమేమిటి? వ్యవస్థాగతమైన, పాలనాపరమైన ఏ లోపాల నుంచి, ఏ జీవన సంక్షోభాల నుంచి ప్రజలు బాబాలను ఆశ్రయిస్తున్నారు? అవధులు దాటిన ఈ బాబా భక్తి వెనుక ఉన్న సామాజిక, మానసిక ధోరణులేమిటి? వీటిని శోధించాలి. అతనిని చూడడంలో, వినడంలో, చివరికి ధూళిని అందుకోవడంలో ఆ ప్రజలు చూపిన ఆత్రుత, తపన ఆశ్చర్యకరమైనవి. ప్రభుత్వాల నుంచి, వ్యవస్థల నుంచి పొందిన ఆశాభంగాలే, వారిని గుడ్డినమ్మకాల వైపు తరుముతున్నాయి. ఇటీవల తమిళనాడులో కల్తీ మద్యం తాగి పెద్ద సంఖ్యలో మరణించడానికి, ఈ తొక్కిసలాటకీ పెద్ద తేడా లేదు. రెండూ తరుణోపాయం కోసం ప్రజల ప్రయత్నంలో జరిగిన ప్రమాదాలే.

జలజగడాలు కొనసాగవలసిందేనా?



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన పదేళ్ల తర్వాత కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రుల స్థాయిలో సమావేశం కావాల్సిన దుస్థితి నేడు నెలకొని ఉంది. ఆశాజనకమైన అంశమేమంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవడం, అంతకుముందే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంసిద్ధత వెలిబుచ్చి ఉండడంతో ఇరువురిలోనూ సమస్యల పరిష్కారానికి నిజాయితీ ఉందని భావించవచ్చు. పైగా ముఖ్యమంత్రుల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు లేవు. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనే కాకుండా సోదరులైన ప్రజల మధ్య కూడా స్నేహ సంబంధాలు నెలకొనాలనే ఆకాంక్ష ఉంది. కాబట్టి పట్టువిడుపులతో ఇద్దరూ ప్రయత్నిస్తే ఈ ఒక్క సమావేశంలోనే అన్ని సమస్యలు పరిష్కారం కాకున్నా, మున్ముందు దారి దొరకకపోదు. ఎంతటి జటిల సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకొన్న సంఘటనలున్నాయి. తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి సంస్థల విభజన, ఆస్తుల పంపకాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర అనేక అపరిష్కృత సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వాల స్థాయిలో ఉన్నవి మాత్రమే. కాని అంతర్ రాష్ట్ర జల వివాదాలు ప్రభుత్వాల మధ్యనే కాకుండా ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చురేగి పతాకస్థాయికి చేరి ఉన్నాయి. ప్రధానంగా ఇరువురు ముఖ్యమంత్రులు జల జగడాలకు ముందుగా తెరదించే యత్నం చేయాలి.

కేసీఆర్, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న 2016 సెప్టెంబర్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఉప్పు నిప్పుగా ముగిసింది. తదుపరి అయిదేళ్ల కాలంలో కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఇరువురూ అలాయ్ బలాయ్ ఆడుకున్నా దుష్ఫలితాలే మిగిలాయి. కేసీఆర్ బడిపంతులు పాత్ర పోషిస్తే, జగన్మోహన్ రెడ్డి మన్నన గల విద్యార్థిగా వ్యవహరించేవారు. తత్ఫలితంగా మూడవ ట్రిబ్యునల్ నియామకం జరిగింది. పైగా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఇరువురూ పలుమార్లు సమావేశమైనా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య రావణ కాష్టంగా ఉన్న జల జగడాల గురించి గాని, ఇతర అపరిష్కృత సమస్యలు గాని చర్చకు వచ్చిన సందర్భం లేదు. వాళ్ళ ప్రైవేటు వ్యవహారాలతో పాటు విందులతో సమావేశాలు ముగిసేవి. ప్రస్తుత ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశం కావడంపై గొంతెండిపోతున్న దక్షిణ తెలంగాణ ప్రాంత ప్రజలతో పాటు నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమ వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

దక్షిణ తెలంగాణ ప్రజలు వేయికళ్లతో ఎదురు చూస్తున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి కేటాయింపుల్లో బ్రేక్ పడింది. ఈ మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిని కలిసినపుడు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కోరారు. నీటి కేటాయింపులు జరిగితే తప్ప ఆ ప్రాజెక్టు ముందుకు పోదు. ఆంధ్రప్రదేశ్ సహకరిస్తే గాని ఇది సాధ్యం కాదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కెసి కెనాల్‌కు నీటి కేటాయింపులు ఉన్నాయి. 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు గల ఈ పథకానికి కేవలం 1.25 టియంసిలు నీటి సామర్థ్యం గల సుంకేసుల బ్యారేజీ ఒక్కటే దిక్కు. 20 టియంసిల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించాలంటే తెలంగాణ భూభాగంలో ముంపు వస్తుంది. తెలంగాణ అనుమతి ఇస్తేనే ముందుకు సాగుతుంది. రెండు రాష్ట్రాలకు ఉపకరించే సిద్దేశ్వరం అలుగు నిర్మాణం జరగాలన్నా తెలంగాణ ఆమోదం తప్పని సరి. ఒక్క మాటలో చెప్పాలంటే కవల పిల్లలు వాణి–వీణ విడివడలేక ఎలా బాధపడుతున్నారో అలా కృష్ణా జలాల అంశంలో దక్షిణ తెలంగాణ, రాయలసీమ వాసుల పరిస్థితి ఉంది. జల జగడాలకు సంబంధించి ఇరువురు ముఖ్యమంత్రులు ముందుగా ఒక అంశం పరిగణనలోకి తీసుకోవాలి. దక్షిణ తెలంగాణ ప్రాంతంలోనూ, రాయలసీమలోనూ పెండింగ్ ప్రాజెక్టులు గాని కొత్త ప్రాజెక్టులు గాని పట్టాలెక్కాలంటే ట్రిబ్యునల్ తీర్పులతో ఇప్పట్లో సాధ్యం కాదు, ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో రాజీపడి వ్యవహరిస్తేనే సాధ్యమవుతుంది. వాస్తవంలో నీటి లభ్యత ఎంత? అనేది ముందుగా అంచనాకు రావాలి. నీటి లభ్యత ఎక్కువగా ఉన్నపుడు లేక తక్కువగా ఉన్నపుడు ఆ మేరకు ఇరు రాష్ట్రాలు భరించే సానుకూల విధానం చేపట్టాలి.

గత పదేళ్లుగా కేసీఆర్ అమలు జరిపిన భావోద్వేగ విధానాల ఫలితంగా జరిగిన నష్టం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనంలోకి తీసుకోవాలి. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు విచారణ చేపట్టిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పదేళ్లు గడచిపోయినా ఇంతవరకు బయటికి రాలేదు. తిరిగి మరో ట్రిబ్యునల్ ఏర్పడింది. ఇది ఎంత కాలం తీసుకొంటుందో ఎవరూ చెప్పలేరు. అప్పటి వరకు సోదరులైన తెలుగు ప్రజలతో ఉన్న రెండు రాష్ట్రాల మధ్య జలజగడాలు కొనసాగవలసిందేనా? ఈ పదేళ్ల కాలంలో అటు దక్షిణ తెలంగాణలోనూ, ఇటు రాయలసీమలోనూ నెర్రెలు బారిన పొలాలకు ఉపయోగపడే ఎంతో విలువైన కృష్ణా జలాలను కేసీఆర్.. శ్రీశైలం నుంచి సముద్రం పాలు చేశారు. శ్రీశైలం కింద భాగంలో అవసరం లేకున్నా విద్యుదుత్పత్తి పేరు చెప్పి వృథా చేశారు. 2023 మే నెలతో ఆఖరైన నీటి సంవత్సరంలో శ్రీశైలం జలాశయానికి 2040 టియంసిల జలాలు వస్తే, 1330 టియంసిల నీళ్లు సముద్రం పాలయ్యాయి. రెండు రాష్ట్రాలు సఖ్యతగా ఉండివుంటే బచావత్ ట్రిబ్యునల్ తీర్పు మేరకు నికర జలాలు 811 టియంసిలు పోగా, క్యారీ ఓవర్ కింద అనుమతించిన 150 టియంసిలు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిల్వ చేసుకొని ఉండవచ్చు. అదే జరిగివుంటే 2024 వేసవిలో హైదరాబాద్ జంటనగరాల తాగునీటి కోసం సాగర్ నుండి ఎత్తిపోతలు తప్పేవి కదా? ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు ఈ సంక్షోభం కొనసాగకుండా తెరదించవలసిన కర్తవ్యం ముఖ్యమంత్రులుగా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మీద ఉంది. రాజకీయ ప్రయోజనాలు విస్మరించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చర్చలు జరిపితే ఏదో ఒక తాత్కాలిక ఏర్పాటు కనుగొనవచ్చు.

బచావత్ ట్రిబ్యునల్ తీర్పుతో తెలంగాణకు అన్యాయం జరిగిందనే వాదన ఉంది. అయితే ఈ అన్యాయం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటి వాటాలు పంచినపుడు జరిగిందనే అంశం విస్మరించ కూడదు. దక్షిణ తెలంగాణ వాసులులాగే అవశేష ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాయలసీమ వాసులు తమకూ అన్యాయం జరిగిందనే భావనతో ఉన్న విషయం అందరికీ తెలుసు. బచావత్ ట్రిబ్యునల్ కూడా 1969కి నిర్మింపబడిన లేక నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాతిపదికగా తీసుకొని కృష్ణా జలాలను బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. తదుపరి 2004లో వచ్చిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ పంపిణీ చేసి, వినియోగంలో ఉన్న నీటి కేటాయింపుల జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎలాంటి తీర్పు ఇస్తుందో పక్కన పెడితే, తాజాగా రెండు రాష్ట్రాలు కలసి 2099 టియంసిలు తమకు కేటాయించాలని ట్రిబ్యునల్ ముందు స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ దాఖలు చేశాయి. తెలంగాణ 954.9 టియంసిలు కోరితే ఆంధ్రప్రదేశ్ 1,144 టియంసిలకు టెండర్ పెట్టింది. బేసిన్ మొత్తం మీద 2130 టియంసిలు లభ్యమవుతాయని బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసి పంపకం చేస్తే, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ మరొక 448 టియంసిల నికర మిగులు జలాలు బేసిన్ మొత్తం మీద ఉంటాయని అంచనా వేసింది. మరి రెండు తెలుగు రాష్ట్రాలకే 2099 టియంసిల నీళ్లు ట్రిబ్యునల్ ఎక్కడ నుండి తెచ్చి పంపకం చేస్తుంది? ఇంత కథనం ఎందుకంటే కేసీఆర్ నీళ్ల రాజకీయ వ్యూహం ఏ కడకు దారి తీసిందో, సాగునీటిరంగ నిపుణులు ముందు నవ్వుల పాలు చేసిందో తెలియజెప్పడానికి మాత్రమే. నేల విడిచి సాము చేసే ఈ పెడధోరణుల నుండి ఇరువురు ముఖ్యమంత్రులు బయటపడవలసి ఉంది.

ఉభయ తెలుగు రాష్ట్రాల ముందు మరో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోజు కాకున్నా రేపైనా సుప్రీంకోర్టు స్టేతో ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలుకు రావచ్చు. అదే జరిగితే కృష్ణలో మరొక 285 టియంసిల నీళ్లను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటకకు ఏకంగా 170 టియంసిలు కేటాయించింది. పైగా ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెంచుకొనే వెసులుబాటు కల్పించింది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నికరంగా దక్కేది కేవలం 38 టియంసిలు మాత్రమే. కాగా విద్యుదుత్పత్తి పేర మహారాష్ట్ర పశ్చిమ కనుమల నుండి ఎంత నీరు సముద్రం పాలు చేస్తోందో గణాంకాలు లేవు. ఈ పదేళ్ల కాలంలో కేసీఆర్ ఎప్పుడూ ఎగువ రాష్ట్రాల జల దోపిడీ గురించి మాట మాత్రంగా ప్రస్తావన తేలేదు. ప్రతి క్షణం ఆంధ్రోళ్ల దోపిడీ అంటూ భావోద్వేగాలు పండించుకొనేందుకు విఫలయత్నాలు చేశారు. ఇప్పటికైనా ఇరువురు ముఖ్యమంత్రులు మున్ముందు రానున్న ప్రమాదం గురించి ఆలోచన చేయాలి. తమ మధ్య ఉన్న సమస్యలు రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలుగకుండా పరిష్కారం చేసుకొంటూ, ఎగువ రాష్ట్రాల జల దోపిడీకి వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి.

> **తెలుగు రాష్ట్రాల ముందు మరో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోజు కాకున్నా రేపైనా సుప్రీంకోర్టు స్టేతో ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలుకు రావచ్చు. అదే జరిగితే కృష్ణలో మరొక 285 టియంసిల నీళ్లను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. ఇరువురు ముఖ్యమంత్రులు తమ మధ్య ఉన్న సమస్యలు రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలుగకుండా పరిష్కారం చేసుకొంటూ, ఎగువ రాష్ట్రాల జల దోపిడీకి వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి.**

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

హరిత ధరిత్రే మనిషి ఆరోగ్య భాగ్యం



■ సునీతా నారాయణ్

మట్టివాసన

శీతోష్ణస్థితిలో మార్పు దైనందిన వాతావరణాన్ని (ఒక ప్రదేశంలో ఒకే సమయంలో ఉన్న వేడి, చలి, తడి, పొడి మొదలైన పరిస్థితులు) ప్రభావితం చేస్తోంది. ఈ ప్రభావ ప్రాబల్యం అశేష ప్రజల జీవితాలు, వారి జీవితాధారాలను సమస్యలపాలు చేస్తోంది. అయితే వాతావరణంలో తీవ్ర వైపరీత్యాలు మానవ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయన్న విషయమై మనం చర్చించడం లేదు. ఉష్ణోగ్రతలు అదుపు తప్పుతున్న ఈ నిరామయ కాలంలో, వడగాడ్పులు అనేక మంది ప్రజలను, ముఖ్యంగా పేదలను ఎలా చంపుతున్నాయో మనకు తెలిసివస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రత – రాత్రి పూట వేడి– మనుషుల మరణాలకు ఎలా కారణమవుతుందో కూడా మనం తెలుసుకుంటున్నాం. మారుతోన్న వాతావరణంతో సుదూర భవిష్యత్తులో సంభవించనున్న విపత్తు, మన ఆరోగ్యానికి ఎలా, హానికరం కానున్నదో కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఈ ఏడాది ప్రపంచ ప్రజలు 'పగళ్లన్నీ పగిలిపోయి/ నిశీథాలూ విశీర్ణిల్లిన' ఎండాకాలాన్ని చవి చూశారు. అవును, ఈ ప్రచండ వేసవిలో (జూన్ మాసాంతంలో ఈ వ్యాసం రాస్తున్న సమయానికి) న్యూ ఢిల్లీలో 270 మంది వడదెబ్బకు చనిపోయారని అధికారిక వర్గాలు అంచనా వేశాయి. అయితే ఈ మృతుల సంఖ్యను అంగీకరించేందుకు సందేహిస్తున్నాను. నిజంగా ఎంత మంది చనిపోయిందీ మనకు తెలియదు. ఎందుకంటే హృద్రోగాలు, మూత్రపిండాల సంబంధిత జబ్బులు మొదలైన ఆరోగ్య సమస్యలను వేసవి వేడి మరింతగా ప్రకోపింప చేస్తుంది. కనుక ఈ వేసవిలో ఇంకా ఎంతో మంది ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పోయి తుది శ్వాస విడిచి వుంటారు. అయితే డాక్టర్లు ఆ మరణాలకు దారితీసిన యథార్థ కారణాలను అలక్ష్యం చేస్తున్నారు. నిరుపేదలు (నిర్మాణ కార్మికులు, సన్నకారు రైతులు తదితరులు) తమ శ్రమ జీవన పరిసరాలు, పరిస్థితుల కారణంగా ఎండల తీవ్రతకు అతిగా లోనవుతారు. మూడు పూటలా తిండికే నోచుకోని అభాగ్యులకు విద్యుత్ వసతులు అంతగా ఉండవు, అసలు లేకపోనూవచ్చు. మరి అటువంటి దుస్థితిలో కునారిల్లుతున్నవారు పని అనంతరం సేదదీరేందుకు అవసరమైన అత్యాధునిక సదుపాయాలు కలిగి ఉండరనడంలో సందేహం లేదు. ఇటువంటి నిర్భాగ్యుల మరణాలు ఎండ తీవ్రతకు సంభవించినవిగా రికార్డు కావడం లేదు. ఆ మృతులలో అత్యధికులు పేదలు లేదా వృద్ధులు అయివుంటారు. 'అజ్ఞాత కారణాల' వల్ల వారు ఈ లోకం నుంచి వెళ్ళిపోయిన వారుగా నమోదవుతున్నారు భారత ప్రభుత్వ నోటిఫైడ్ డిసీజెస్ (డాక్టర్లు రోగ నిదానం చేసినపుడు ఏ జబ్బులనయితే ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రజారోగ్య అధికారులకు విధిగా వాటి గురించి తెలియజేయవలసి ఉంటుందో ఆ వ్యాధులు)లో వడగాడ్పు మరణాలు లేవు. ఈ కారణంగా వాటిని రికార్డు చేయవలసిన, లేదా వాటి గురించి అధికారులకు సమాచారమివ్వాల్సిన అవసరం ఉండదు. ఇందువల్లే ఈ వేసవిలో తీవ్ర గాడ్పుల మూలంగా ప్రజల ఆరోగ్యానికి వాటిల్లిన హాని, సంభవించిన మరణాల గురించి మనకు కచ్చితంగా తెలిసింది తక్కువ అని గుర్తించవలసి ఉంది.

అయితే ఇప్పుడు వివిధ పరిశోధనలు ప్రాణాంతక వడగాడ్పుల తీవ్రతను స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతల పెరుగుదల గరిష్ఠ మరణాలకు కారణంగా ఉన్నదనేది తొట్ట తొలుత మనం అర్థం చేసుకోవల్సిన వాస్తవం. 'రాత్రిపూట ఉష్ణోగ్రత అధికంగా ఉన్న రోజుల్లో వడగాడ్పుల మరణాలు, రాత్రి పూట ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న రోజుల్లో కంటే 50 శాతం అధికంగా ఉంటున్నట్టు' బ్రిటిష్ మెడికల్ జర్నల్ 'ది లాన్సెట్'లో రెండేళ్ల క్రితమే (2022లో) ప్రచురితమైన ఒక పరిశోధనా పత్రం వెల్లడించింది. కారణమేమిటి? అధిక ఉష్ణోగ్రత నిద్రను ప్రభావితం చేస్తుంది. తత్కారణంగా, శ్రమతో అలసిన దేహం తనకు తానుగా ఉపశమనం పొందలేదు. దీని మూలంగా వేడి తీవ్రతకు శరీరం ఎక్కువగా లోనవుతుందని ఆ పరిశోధకుడు పేర్కొన్నాడు.

హెచ్చు ఉష్ణోగ్రతల మూలంగా సంభవిస్తున్న మరణాలు పట్టణాలు, నగరాలలో పెరుగుతున్నాయి. ఆ ఉష్ణోగ్రతలు మానవ శరీరాలు భరించే శక్తికి మించి ఉంటున్నాయి. 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'లో నా సహచరులు ఇటీవల రూపొందించిన ఒక నివేదిక ప్రధాన భారతీయ నగరాలలో వేడి పెరుగుదల తీరుతెన్నులు ఎలా ఉన్నాయో వివరించింది. నగర పరిసరాలలో వ్యాపించి ఉన్న ఉష్ణోగ్రతలు దేశ సగటు ఉష్ణోగ్రత కంటే ఎక్కువగా పెరుగుతున్నాయని వెల్లడయింది. 2001–2010 దశకంతో పోలిస్తే 2014–2024 దశకంలోని వేసవి కాలాలలో తేమ 5 నుంచి 10 శాతం మేరకు పెరిగినట్టు ఆ నివేదిక వెల్లడించింది. ఒక్క బెంగళూరులో మాత్రమే తేమ పెరుగుదల సంభవించలేదు. ఇందుకు కారణాలేమిటో శోధించవలసి ఉన్నది. దేశ వ్యాప్తంగా అన్ని వాతావరణ మండలాలలోను రాత్రిపూట నగరాలలో వాతావరణం చల్లబడడం లేదని కూడా ఆ నివేదిక వెల్లడించింది. 2001–10 దశకం వేసవి కాలాలలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పగటి పూట గరిష్ఠత కంటే 6.2 శాతం తగ్గి 13.2 శాతంగా ఉన్నాయి. అయితే గత పది వేసవి కాలాలలో పగలు, రాత్రి పూట ఉష్ణోగ్రతలలో తేడా అంటే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం తగ్గుముఖం పట్టింది. ఈ తగ్గుదల హైదరాబాద్‌లో 13 శాతంగా ఉన్నది. ఢిల్లీలో 9 శాతం, బెంగళూరులో 15 శాతం మేరకు ఆ తగ్గుదల ఉన్నది. కోల్‌కతాలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉన్నది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడమే అందుకు కారణం.

మన ధరిత్రి అంతకంతకూ వేడెక్కుతోంది. ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతలు గత గరిష్ఠ రికార్డులను బద్దలు కొట్టాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే వర్షపాతం క్రమరహితంగా ఉంటోంది. కొద్ది రోజులు అతివృష్టి. సుదీర్ఘంగా అనావృష్టి. ఉష్ణోగ్రతలూ నిలకడగా ఉండడం లేదు. మొత్తం మీద వాతావరణ వైపరీత్యాలు అంతకంతకూ మరింత హానికరమవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయు విన్యాసాలలో మార్పులు సంభవిస్తున్నాయి. ఇవన్నీ వేసవి తాపాన్ని విపరీతంగా పెంచుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఆ పెరుగుదల ప్రాణాంతకంగా ఉంటోంది. మరో వైపు మన నగరాలలో సూక్ష్మ శీతోష్ణస్థితి (మైక్రో క్లైమేట్– మిక్కిలి చిన్న ప్రదేశంలో ఉండే శీతోష్ణస్థితి)లో ఆకస్మిక మార్పులు సంభవిస్తున్నాయి. హీట్ ఐలెండ్ ఎఫెక్ట్ అనబడే ఈ పరిణామం మరింతగా తీవ్రమవుతోంది. నగరాలు కాంక్రీట్ భవనాలమయం కావడమే ఇందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు. రోడ్లపై వాహనాల రద్దీ, ఇంధన వినియోగం, ఎయిర్ కండిషనర్ల వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో కర్బన ఉద్గారాలు పెరిగి వాతావరణంలో వేడి అధికమవుతోంది.

వేడి తీవ్రతకు సంబంధించి ఈ వేసవి మనకు కొత్త పాఠాలను నేర్పింది. వాస్తవమేమిటంటే వాతావరణ మార్పు అనేక ఆశ్చర్యకర పరిణామాలకు దారితీస్తోంది. మానవ ఆరోగ్యంపై వాటి ప్రభావం విషమపూరితంగా ఉంటోంది. ఇప్పటికీ ఈ మార్పులను సమగ్రంగా అర్థం చేసుకోవడం జరగలేదు. వాతావరణ మార్పు మన ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపనున్నది ఇంకా విపులంగా అర్థం చేసుకోవల్సి ఉన్నది. మానవ తప్పిదాల కారణంగా పదే పదే ప్రాకృతిక విపత్తులు సంభవిస్తున్నాయి. మన సమున్నత, అధునాతన నాగరికతలకు ఆలంబన అయిన ప్రాకృతిక వనరులు వేగంగా క్షీణించి పోతున్నాయి. జీవ వైవిధ్యం హరించుకుపోతోంది. ఇటువంటి విపత్కర పరిస్థితులు ధరిత్రి ఆరోగ్యాన్ని సమస్థితిలో ఉంచుతాయా? ధరిత్రి ఆరోగ్యం (ప్లానేటరీ హెల్త్) సమస్థితిలో ఉన్నప్పుడే మానవాళి ఆరోగ్యం భద్రంగా ఉంటుంది మానవ ఆరోగ్యం గురించిన సంప్రదాయక అవగాహనలో మౌలిక మార్పు తెచ్చిన భావనే ప్లానేటరీ హెల్త్. ప్రాకృతిక వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే ఈ భావన ప్రజారోగ్య భావన కంటే విశాలమైనది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మానవ జీవన విధానాలు, వాటికి ఆధారమైన ప్రాకృతిక వ్యవస్థల ఆరోగ్యమే ప్లానేటరీ హెల్త్. మరి ధరిత్రి ఆరోగ్యం భద్రంగా ఉండాలంటే మనం పర్యావరణ సమతౌల్యతను కాపాడుకున్నప్పుడే ధరిత్రికి శ్రేయస్సు, మానవాళికి ఆరోగ్య సంక్షేమం సమకూరుతాయి. వాతావరణ మార్పు అనేది మన అస్తిత్వ సంక్షోభమే అన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవల్సిన సమయమాసన్నమయింది. ఈ విషయంలో ఇంకెటువంటి జాప్యం కూడదు. అది వ్యక్తులు, సమాజాలు, యావత్ మానవాళికి ఒక జీవన్మరణ సమస్య అని చెప్పడంలో ఎటువంటి అతి శయోక్తి లేదు.



> **మానవ ఆరోగ్యం గురించిన సంప్రదాయక అవగాహనలో మౌలిక మార్పు తెచ్చిన భావనే ప్లానేటరీ హెల్త్. ప్రాకృతిక వ్యవస్థల భద్రతకు ప్రాధాన్యమిచ్చే ఈ భావన ప్రజారోగ్య భావన కంటే విశాలమైనది. పర్యావరణ సమతౌల్యతను కాపాడుకున్నప్పుడే ధరిత్రికి శ్రేయస్సు, మానవాళికి ఆరోగ్య సంక్షేమం సమకూరుతాయి.**

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

'రైతు భరోసా' ఎవరికి?

రాష్ట్రంలో పట్టా భూములు కలిగిన రైతులు/భూస్వాములలో అరవై శాతానికి పైగా వ్యవసాయం చేయడం లేదు. వ్యవసాయంపై ఆధారపడిన వారు పట్టా భూములు గల రైతులు/భూస్వాముల వద్ద కౌలు పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. వ్యవసాయం పెట్టుబడిలో రైతులు సగం, కౌలుదార్లు సగం భరించి పంటలను చెరి సగం పంపిణీ చేసుకునే పద్ధతి లోగడ అమలులో ఉండేది. కాలక్రమేణా ఈ పద్ధతి మారి వ్యవసాయ యోగ్యమైన భూమిని ఎకరానికి కొంత మొత్తం ఇచ్చే విధంగా కౌలుదార్లయిన రైతులకు ఒప్పందంతో అప్పగిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కౌలుదార్లయిన రైతులే పెట్టుబడి పెట్టాలి. ప్రకృతి వైపరీత్యాలతో భూస్వామికి సంబంధం లేదు. కౌలుదార్లకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయవు, కారణం వారు పట్టాదారులైన రైతులు కాదు గనుక.

2018–19 నుంచి గత ప్రభుత్వం రాష్ట్రంలో సాగుయోగ్యమైన భూమిని అంచనా వేయకుండా ఎకరానికి ఇంత అని రెండు పంటలకు 'రైతుబంధు' పథకం కింద రైతులు/భూస్వాముల బ్యాంకు ఖాతాలోకి నగదు బదిలీ చేసింది. దీని తర్వాత కేంద్ర ప్రభుత్వం ఐదెకరాల లోపు పట్టాలున్న రైతులకు/భూస్వాములకు వారి బ్యాంకు ఖాతాల్లోకి రెండు పంటలకూ నగదు బదిలీ చేసింది. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద జూన్ 2019 నుంచి రైతుకు రూ. ఆరువేలు సహాయం అందజేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల చూపిన 'ఉచితాల' వల్ల కౌలురైతులు ఎలాంటి లబ్ధి పొందలేదు. రైతుబంధుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో తొందరపాటు చర్య– పంటలు పండించని భూములకు, ఉద్యోగస్తులైన వారికి కూడా ఈ పథకం అందించడం.

కౌలుదార్లు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంటలు పండించినా వారికి గిట్టుబాటు ధర ఓ సమస్య. అది లభించక కౌలురైతులు నష్టపోయి కూలీనాలి పనుల కోసం దగ్గర్లోని పట్టణాలకు పోతున్నారు. కౌలుదార్లు వ్యవసాయం మానేస్తే పంటలు పండించేదెవరు? పట్టా భూములున్న రైతులకు మాత్రమే రైతుబంధు వర్తింపజేయడంలో గత ప్రభుత్వ ఉద్దేశమేమిటి? రైతులను ఆదుకుంటున్నదనే భావన కలగటానికా? వాస్తవంగా వ్యవసాయం ఎవరు చేస్తున్నారు? పడావు భూములా? కౌలుదార్లు వ్యవసాయం చేస్తున్నారా అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని, వ్యవసాయ శాఖ ద్వారా సమాచారం తెప్పించుకుని 'రైతుబంధు'ను అమలు చేసి ఉండాల్సింది. కష్టపడేదొకరు! లాభపడేదొకరు అన్న చందంగా భూస్వాములకు ప్రయోజనం చేకూరగా, కౌలురైతులకు ప్రయోజనం దక్కలేదు.

ప్రస్తుత ప్రభుత్వమైనా 'రైతు భరోసా' పథకాన్ని సమగ్ర సమాచార సేకరణ అనంతరం చేపట్టాలి. గత ప్రభుత్వం చేపట్టిన పథకంలో లోటుపాట్లను సరిచేసి, కౌలుదార్లకు సైతం పెట్టుబడి ద్వారానో, ఎరువులు–విత్తనాల ద్వారానో సహాయం అందించాలి. అప్పుడే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది.

– ఎం. నిజాముద్దీన్

నిరుద్యోగులకు భరోసాగా జాబ్ క్యాలెండర్

బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు చేసిన అన్యాయం అంతా ఇంత కాదు. నియామకాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో నియామకాలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కేసీఆర్ పాలనలో ఎన్నో పోరాటాల మూలంగా లోపాలతో కూడిన అరకొర ఉద్యోగ ప్రకటనలు వచ్చేవి. అవి కోర్టు మెట్లు ఎక్కి తీర్పులు వచ్చేసరికి ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం జరిగేది. ఈ విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీలో అనేక వైఫల్యాల మూలంగా ఒక తరం నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు తగిలిన గాయాలు మాన్పటానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. అందులో భాగంగానే ముందుగా టీజీపీఎస్సీని సంస్కరించింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ పోటీ పరీక్ష నిర్వహించినా పారదర్శకంగా పటిష్ఠంగా నిర్వహించి నిరుద్యోగులకి భరోసా కల్పించాలనే లక్ష్యంగా రేవంత్ సర్కారు అడుగులేస్తోంది. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ఎటువంటి లోపాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించి ఎంతోమంది ప్రశంసలు పొందింది. నిరుద్యోగులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పరీక్షల నిర్వహణలో గతంలో జరిగిన తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇంటర్, పదో తరగతి వంటి పరీక్షల్ని కూడా పకడ్బందీగా నిర్వహించింది. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా కేసీఆర్ ప్రభుత్వంలో మూసివేయబడిన 4 వేల పాఠశాలల్లో పాఠశాలకు ముగ్గురు చొప్పున 12 వేల ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉంది. పేద పిల్లలు చదువుకునే బడులకు రూ. 2,000కోట్లు కేటాయించి ప్రభుత్వ బళ్లను తీర్చిదిద్దుతా అని ముఖ్యమంత్రి ప్రకటించారు. అడక్కుండానే ఉపాధ్యాయ ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సడలించారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వంలో రెండు లక్షల 32 వేల ఉద్యోగాలు మంజూరైతే కేవలం అనేక అటంకాలతో భర్తీ చేసింది ఒక లక్ష 60 వేల ఉద్యోగాలు మాత్రమే. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయటానికి ఉద్యోగాల క్యాలెండర్ ద్వారా కసరత్తు చేస్తోంది. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఆలోచన చేయలేదు. ఉపాధ్యాయ పదోన్నతుల విషయంలో ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులు సైతం బుట్టదాఖలు చేసింది. అలాంటిది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడక్కుండానే శరవేగంగా 18 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. సక్రమంగా ఉపాధ్యాయుల బదిలీలు చేసింది. తద్వారా ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను మరో నోటిఫికేషన్ ద్వారా భర్తీకి సిద్ధమవుతుంది. నిరుద్యోగులకు ఏ పరీక్ష ఎప్పుడు ఉంటుందో అనేటటువంటి గందరగోళ పరిస్థితి నుండి బయటపడేయటానికి మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం టీజీపీఎస్సీ ఉద్యోగాల క్యాలెండర్‌ను కూడా జూలైలో విడుదల చేయబోతుంది. నిరుద్యోగిత నిర్మూలన అంశంలో విమర్శించడానికి ప్రతిపక్షాలకు అవకాశాలు లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఇలాంటి తరుణంలో గ్రూప్–2 పోస్టులు పెంచాలని పరీక్షను డిసెంబర్‌లో నిర్వహించాలని, గ్రూప్–3 పోస్టులు పెంచాలని, ఈ విధంగా డీఎస్సీ పోస్టులు పెంచి డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఆయా పరీక్షల ఆశావహ అభ్యర్థుల సహజ సిద్ధమైన డిమాండును ఆసరాగా చేసుకుని నిరుద్యోగులకు ఎప్పుడు న్యాయం చేయని; బోడ సునీల్ నాయక్, ముత్యాల సాగర్, ప్రవళిక మృతులకు కారణమైన హరీశ్ రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ లబ్ధికోసం, నిరుద్యోగులు చేసే పోరాటంలో జొరబడి కుట్రలు చేస్తున్నారు. వీరి వ్యవహారం చూస్తుంటే 100 ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుంది. ఇంతకాలం నిరుద్యోగులను చంపిన హంతకులే సంతాప సభ పెట్టి సంతాపం తెలిపినట్టుంది. కొంతమంది కోచింగ్ సెంటర్ యజమానులు శ్రుతి మించి తమ స్వార్థ రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం నిరుద్యోగులు చేసే పోరాటంలో దూరి తమ పబ్బం గడుపుకుంటున్నారు. తమ కోచింగ్ సెంటర్లో చేరిన నిరుద్యోగులను పోగేసి కృత్రిమ నిరుద్యోగ సమస్యను సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. కోచింగ్ సెంటర్ యాజమాన్యు తాము లీడర్లు కావడం కోసం పరీక్ష వాయిదా పడితే ఒక బ్యాచ్‌కి లక్షల చొప్పున ఆదాయం పొందవచ్చు, అదేవిధంగా నిరుద్యోగులను రెచ్చగొడుతూ యూట్యూబ్‌లో మాట్లాడితే చూసే వారి సంఖ్య పెరిగి ఆ రకంగా కూడా ఆదాయం పొందవచ్చనే స్వార్థ బుద్ధితో వ్యవహరిస్తూ నిజమైన నిరుద్యోగుల్ని మోసం చేస్తూ కృత్రిమ ఉద్యమకారులుగా చలామణి అవుతూ లాభపడుతున్నారు.

> **సమస్త నిరుద్యోగ సమస్యలకు పరిష్కార వేదికగా ఉద్యోగాల క్యాలెండర్‌ను వేగవంతంగా రూపొందించే దిశలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగులకు మేలు చేయాలనే సంకల్పంతో, టీజీపీఎస్సీ ఉద్యోగాల క్యాలెండర్‌ను జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్నది.**



సమస్త నిరుద్యోగ సమస్యలకు పరిష్కార వేదికగా ఉద్యోగాల క్యాలెండర్‌ను వేగవంతంగా రూపొందించే దిశలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఒకవేళ డీఎస్సీ పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలకు ఉపాధ్యాయుల కొరత ఏర్పడి తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉంది. అట్లాగే గ్రూప్–2 వాయిదా వేస్తే ఒకవేళ పోస్టులు పెంచినా తయారు చేసే ఉద్యోగాల క్యాలెండర్ అంతరాయం ఏర్పడి ఉద్యోగాల క్యాలెండర్ రూపకల్పనకు తీవ్రమైన జాప్యం జరిగే అవకాశం ఉంటుంది. డీఎస్సీ, గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయొద్దు, వాయిదా వెయ్యాలి భిన్న వాదనలు ఉన్నాయి. ఈ రెండు వాదాలను కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ నిపుణులతో పరిశీలించి సముచిత నిర్ణయం తీసుకునే వరకు నిరుద్యోగులు ఓపిక పట్టాలి. గ్రూప్–1లో 1:100 ప్రవేశ పెడితే న్యాయపరమైన చిక్కులు వచ్చి గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దయి మొదటికే మోసం వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఇట్లాంటి పరిస్థితుల్లో నిరుద్యోగులు సంయమనం పాటించాలి. రెండు లక్షల ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగులకు మేలు చేయాలనే సంకల్పంతో, నిరుద్యోగుల చిరకాల వాంఛ అయిన టీజీపీఎస్సీ ఉద్యోగాల క్యాలెండర్‌ను జూలై నెలలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేయనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, నిరుద్యోగులు అండగా నిలవాలి.

● కోటూరి మానవతారాయ్
తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 కనిష్ఠం 25.2

మానసిక ఒత్తిడితో

వైద్యురాలి ఆత్మహత్య

కొత్తపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడితో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడింది. నాగోలు ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మధుసూదన్‌రావు విశ్రాంత ఉద్యోగి. ఆయన, భార్య నిరుపమారావు బండ్లగూడ రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్స్ 8వ అంతస్తులో ఉంటున్నారు. వారి కుమార్తె డాక్టర్ నిహారికారావు(29) ఏఎస్ రావునగర్‌లో ఉండేది. అక్కడే ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తుండేది. పీజీ ఎంట్రెన్స్ పరీక్షకు ప్రిపేరయ్యేది. ఆమె భర్త మనోహర్ ఢిల్లీలో ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్నారు. ఇటీవలే ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. కరోనా రోజుల నుంచీ ఆమె తరచూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతోంది. ఇదివరకే ఆమె రెండు మార్లు ఆత్మహత్యకు యత్నించింది. తల్లిదండ్రులు వైద్య నిపుణులకు చూపించారు. గురువారం ఉదయం 10.30కు తండ్రి మధుసూదన్‌రావు పనిమీద బయటకు వెళ్లారు. ఇంట్లో తల్లి నిరుపమారావు పనిలో నిమగ్నమై ఉన్నారు. 11 గంటలకు నిహారికరావు తాముంటున్న 8వ అంతస్తుపై నుంచి కిందకు దూకేసి ఆత్మహత్య చేసుకుంది. శబ్దం రావడంతో తల్లి బయటకు వచ్చి చూడగా కుమార్తె రక్తపు మడుగులో కనిపించింది. గ్రౌండ్‌ఫ్లోర్‌కు వెళ్లి చూసేసరికి ఆమె మృతి చెందింది. అప్పుడే బయట నుంచి వచ్చిన మధుసూదన్‌రావు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్కగానొక్క కూతురు మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడడం ఆ వృద్ధ దంపతులను కలచివేసింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆడుకోవద్దని అమ్మ మందలించిందని..

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటికి దూరంగా వెళ్లి ఆడుకోవద్దని తల్లి మందలించినందుకు మనోవేదనకు గురైన బాలిక ఆత్మహత్య చేసుకుంది. గాంధీనగర్ ఎస్‌ఐ నాగరాజు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబోయిగూడలో నివాసం ఉండే అబ్దుల్‌రజాక్‌కు నలుగురు కుమార్తెలు, ఇద్దరు అబ్బాయిలు. చిన్న కుమార్తె జియా ఫాతిమా (13) మదర్సాలో చదువుకుంటోంది. మూడురోజుల క్రితం బన్సీలాల్‌పేటకు వెళ్లి స్నేహితులతో ఆడుకొని ఇంటికి వచ్చింది. అంత దూరం వెళ్లినందుకు ఫాతిమాను తల్లి

మిగతా 6వ పేజీలో..

మహా నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. గత నెల 30 రోజుల వ్యవధిలోనే 20కి పైగా హత్యలు జరిగాయి. అందులో ఒక్కరోజే మూడు హత్యలు వెలుగులోకి వచ్చాయి. ఈక్రమంలో అసలు ఈ నగరంలో ఏం జరుగుతోంది? శాంతి భద్రతల పరిస్థితేంటి? అనే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వరుస హత్యల్లో సింహభాగం ఉమ్మడి సౌత్‌జోన్‌లోనే జరుగుతుండటంతో పోలీసులకు శాంతి భద్రతల సమస్య పెనుసవాల్‌గా మారింది.



30 రోజులు.. 20 హత్యలు!

- మహానగరంలో కలవరపెడుతున్న ఘటనలు
- వివాహేతర సంబంధాలతోనే అధికం
- ఉమ్మడి సౌత్ జోన్‌లో రెచ్చిపోతున్న రౌడీమూకలు
- సమీక్షలకే పరిమితమవుతున్న అధికారులు

హైదరాబాద్ సిటీ/చార్మినార్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాలు, పాత కక్షలు, ప్రేమ, ఆర్థిక వ్యవహారాలతో హత్యలు పెరుగుతున్నాయి. ప్రధానంగా ఉమ్మడి సౌత్‌జోన్ పరిధిలో గల పాతబస్తీలోని ఫలక్‌నుమా, శాలిబండ, ఛత్రినాక, ఆసిఫ్‌నగర్, భవానీనగర్, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హత్య కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

ఒక్కరోజే మూడు హత్యలు..

జూన్ 29న నగరంలో ఒకేరోజు మూడు హత్యలు జరిగాయి. వాటిలో ఒక హత్య ఆధిపత్యపోరు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జరగగా, సైబరాబాద్ పరిధిలో జరిగిన రెండు హత్యల్లో ఒకటి వివాహేతర సంబంధం, మరొకటి ప్రేమ వ్యవహారం కారణంగా తెలుస్తోంది. అంతకు ముందు 10 మంది మైనర్లు కలిసి తమ స్నేహితున్ని దారుణంగా హత్య చేశారు. తాను ప్రేమిస్తున్న అమ్మాయితో చనువుగా ఉంటున్నాడనే కక్ష పెంచుకొని, మరో పది మంది స్నేహితులతో కలిసి

మిగతా 6వ పేజీలో..

నెల వ్యవధిలో జరిగిన హత్యల్లో కొన్ని..

- జూన్ 25న శాలిబండ పరిధిలో మద్యం మత్తులో ఫెరోజ్ (28), స్నేహితుడితో గొడవ పడ్డాడు. కత్తితో ఫెరోజ్‌పై స్నేహితుడు విచక్షణ రహితంగా దాడి చేసి హతమార్చాడు.
- పాతకక్షల కారణంగా అన్వర్, అసద్ అనే పాత నేరస్థులు వాజిద్ అనే వ్యక్తిని మాట్లాడుదామని జూన్ 18న అర్ధరాత్రి పిలిచారు. వాజిద్ వెంట అతని సోదరులు సాజిద్, ఖదీర్, రఫిక్ సిమ్రాన్ వెళ్లారు. వీరి మధ్య మాటా మాటా పెరగడంతో అన్వర్, అసద్‌లు కత్తులతో దాడికి తెగబడ్డారు. ఇందులో రఫిక్ అక్కడికక్కడే మృతిచెందాడు.
- సికింద్రాబాద్ అడ్డగుట్టలో భార్య రోజాను భర్త అతి దారుణంగా హత్య చేశాడు.
- జూన్ 20న ఆసిఫ్‌నగర్‌లో షేక్ అలీం దారుణ హత్యకు గురయ్యాడు.
- కాచిగూడలో జూన్ 26నశంషుద్దీన్‌ను చంపేశారు.
- సనత్‌నగర్ పరిధిలో చోరీ పంపకాల్లో తేడా రావడంతో పాతనేరస్తుడిని దుండగులు దారుణంగా హతమార్చారు.
- బాలాపూర్‌లో జూన్ 13న ముబారక్ సిబార్ అనే వ్యక్తిని అతికిరాతంగా హత్య చేశారు. గుర్రం చెరువు వద్ద బాబానగర్‌కు చెందిన యువకులు మాట్లాడుకుందామని పిలిచి యువకునికి కత్తులతో దాడి చేసి చంపేశారు.
- బేగంపేటలో జూన్ 25న ఓ యువకుడిని స్నేహితుడే కత్తులతో పొడిచి హత్య చేశాడు. తన మరదలిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే కోపంతో స్నేహితుడిని కత్తితో పొడిచి చంపేశాడు.

వివాహేతర సంబంధాలతో..

- ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్ హసన్‌నగర్‌కు చెందిన జకీర్ అలీ (29) గత నెల 23న హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం, అసభ్య ప్రవర్తనే ఈ హత్యకు కారణంగా పోలీసులు తేల్చారు.
- నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుబాయ్‌కు వెళ్లాల్సిన ఇంజనీర్ హత్యకు గురయ్యాడు.
- జగద్గిరిగుట్టలో జూన్ 29న జరిగిన అనిల్‌కుమార్ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.
- కోర్టులో విడాకుల కేసు పెండింగ్‌లో ఉండగానే తాను రెండో పెళ్లి చేసుకుంటానని ఛత్రినాకకు చెందిన వ్యక్తి స్నేహితురాలు (22)ను వేధించసాగాడు. విడాకులయ్యాక ఆలోచిస్తా అన్న స్నేహితురాలిపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె ఇంటికి వెళ్లి స్క్రూడ్రైవర్‌తో ముఖంపై దాడి చేశాడు. అనంతరం గొంతునులిమి హత్యాయత్నానికి పాల్పడ్డాడు.
- ఈ నెల ఒకటో తేదీన రామంతపూర్ వివేక్‌నగర్‌లో ఉంటున్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న చంద్రమౌళి.. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఉప్పల్ భగాయత్‌లో మాట్లాడుకుందామని పిలిచి, ఆమెను కారుతో ఢీ కొట్టి చంపేశాడు. ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు దొరికిపోయాడు.



వాళ్లున్నారా?

- వానలొస్తున్నా పత్తాలేని ఎమర్జెన్సీ టీమ్‌లు
- క్షేత్రస్థాయిలో చురుగ్గా లేని బృందాలు
- వరద పోటెత్తుతున్నా స్పందన కరవు
- ఫలితంగా నిత్యం తప్పని వరద తిప్పలు
- ఉన్నతస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు, స్థానిక ప్రజలే దిక్కు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో వర్షం వచ్చిందంటే నరకమే. చిన్న వానకే రోడ్లన్నీ జలమయమవుతాయి. ఎక్కడ గుంత ఉందో, ఏ మ్యాన్‌హోల్ తెరిచి ఉంటుందో తెలియని దుస్థితి. ఒక్కోసారి 8 -10 సెం.మీ. వాన కురుస్తోంది. దీంతో నీరంతా రోడ్లపైకి చేరడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటిని తొలగించేందుకు జీహెచ్ఎంసీ, ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన మాన్‌సూన్ బృందాలు

మిగతా 6వ పేజీలో..

ఇదీ లెక్క

నీరు నిలిచే ప్రాంతాలు	200
ఇందులో భారీగా నిలిచేవి	140
గ్రేటర్‌లో మాన్‌సూన్ టీమ్‌లు	534
ఏటా వెచ్చించే వ్యయం	50-60 కోట్లు



ఈ నెల ఏడో తేదీ నుంచి బోనాల పండుగ మొదలుకానుంది. ఈనేపథ్యంలో అమ్మవారికి సమర్పించే తొట్టెలు సిద్ధమవుతున్నాయి. చార్మినార్ వద్ద తొట్టెల తయారీలో నిమగ్నమైన మహిళ, చిన్నారిని చిత్రంలో చూడొచ్చు.

దొడ్డి కొమురయ్య కీర్తి సజీవం



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులుబాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం దొడ్డి కొమురయ్య కీర్తి సజీవంగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఉద్యమాలను, ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం, బీసీ

మిగతా 6వ పేజీలో..



హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్ చేస్తున్న సెయిలర్స్

గాలితో సెయిలింగ్..

- ఆసక్తి ఉన్న పేదవారికి అండగా నిలుస్తున్న ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్


అల్వాల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని గాలి, నీరు, భూమి.. ఈ మూడు అంశాలపై ఆధారపడి ఉండే ఏకైక క్రీడ సెయిలింగ్. దీనికి శారీరక బలం ఎంతో అవసరం. పైగా ఖర్చుతో కూడుకున్నది. కానీ ట్యాంక్‌బండ్ వద్ద గల ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ క్లబ్ పేదలకు కూడా సెయిలింగ్‌లో శిక్షణ అందిస్తోంది. పోటీలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. ఒక సెయిల్ బోట్ ధర రూ.10 లక్షల నుంచి రూ. 12లక్షల వరకు ఉంటుంది. ప్రొఫెషనల్ సెయిలింగ్ నేర్చుకోవడానికి కోచింగ్ ఫీజు సెషన్ కు రూ.10 వేలు ఉంటుంది. ప్రాచీనకాలంలో ధనవంతుల ఆనందం కోసం ఈ సెయిలింగ్ కొనసాగేది. సాయుధ దళాలు 1960 నుంచి సెయిలింగ్ పోటీలపై ఆసక్తిని ప్రదర్శించాయి. అప్పటి నుంచి కొత్త సెయిలర్స్‌ను బయటకు తీసుకురావడానికి ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ క్లబ్ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. విదేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో కూడా సెయిలింగ్‌లో అద్భుతంగా రాణించే వారు చాలామంది ఉన్నారని ఈఎంఈ సభ్యులు చెబుతున్నారు.

ఆర్మీ అధికారుల సెయిలింగ్ చూసి..



ఆర్మీలో ఉన్న సమయంలో నేను చాల మంది అధికారులు సెయిలింగ్ చేసేటప్పుడు చూశాను. వారి సూచనలను గ్రహించేవాడిని. నేనూ సెయిలింగ్ చేయడం ప్రారంభించాను. దీంతో క్రీడపై మక్కువ పెరగడంతో పాటు నైపుణ్యం కూడా పెరిగింది. ఉన్నత అధికారులు గుర్తించి సెయిలింగ్‌లో శిక్షణ అందించారు. ఇండోనేషియాలో 2022లో నిర్వహించిన ఆసియన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాను. 2016,2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023లో నిర్వహించిన జాతీయ చాంపియన్‌షిప్‌లో గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలను సాధించాను.

- సీహెచ్. సుధాకర్‌రెడ్డి, ఈఎంఈ సెయిలింగ్ కోచ్




పీడీఎస్‌యూ సభల పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపేట: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభల పోస్టర్‌ను రాష్ట్ర నాయకుడు రియాజ్ గురువారం భరత్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద ఆవిష్కరించారు.







● విప్లవరచయితల సంఘం సదస్సులో వక్తలు

ప్రత్యామ్నాయ ప్రణాళికతోనే హిందూత్వను ఓడించగలం



విరసం ఆవిర్భావ దినం సదస్సును ప్రారంభిస్తున్న వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి. చిత్రంలో పలువురు కవులు, కళాకారులు

హైదరాబాద్ సిటీ, జూలై4(ఆంధ్రజ్యోతి): విప్లవ రయితల సంఘం(విరసం) సభ్యులు నిర్భీతి, నిబద్ధతలకు ప్రతిరూపాలని ప్రసిద్ధ కవి కె. శివారెడ్డి ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారు అనేక సవాళ్లు, సమస్యలు, నిర్బంధాలను ఎదుర్కొని మరీ పనిచేస్తున్నారని, అది అసాధారణమైన విషయమని కొనియాడారు. తనను తీర్చిదిద్దింది విరసమేనని తెలిపారు. విరసం 54వ ఆవిర్భావ దినం సందర్భంగా గురువారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'వికసిత భారత్ @ 2024 - కార్పొరేట్ హిందూ రాష్ట్ర' అంశంపై సదస్సు జరిగింది. అంతకుముందుగా విరసం వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి, రచయిత్రి తాయమ్మ కరుణతో పాటు మరికొందరు కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు కలిసి అమరవీరుల స్మారక చిహ్నానికి నివాళులు అర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ప్రారంభోపన్యాసం చేశారు. అప్రజాస్వామికమైన మూడు నేరచట్టాలను అమల్లోకి తేవడం ద్వారా ఇక పోలీసులదే రాజ్యం అని ప్రకటించారని కేంద్రాన్ని విమర్శించారు. మావోయిస్టులంటూ ఆపరేషన్ కగార్ పేరుతో ఏకపక్షంగా కాల్పులు జరిపి, 140మంది ఆదివాసీలను కాల్చిచంపారని ఆరోపించారు. ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ఆదివాసీలను ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టన పెట్టుకుంటున్నారని విరసం సభ్యులు విమర్శించారు. కమ్యూనిస్టులను, ముస్లింలను, క్రిస్టియన్లను ప్రధాన శత్రువులుగా సంఘ్‌పరివార్ ప్రకటిస్తూ, భావజాల దాడి చేస్తున్నారని విరసం నాయకురాలు వరలక్ష్మి దుయ్యబట్టారు. దీన్ని ఎదుర్కోవడానికి ఫాసిస్టు వ్యతిరేక భావజాలాన్ని, సామాన్యుల జీవితాలను ప్రభావితం చేసేలా ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమ ప్రణాళిక అవసరమని ఆమె నొక్కిచెప్పారు. ఆ దిశగా రచనలు రావాలని ఆకాంక్షించారు. చైతన్యంతోనే హిందూత్వ భావజాలాన్ని ఓడించగలమని రచయిత పాణి పేర్కొన్నారు. ఒడిశా రచయిత హేమంత్ దళపతి మాట్లాడుతూ.. నియమగిరి ప్రాంతంలోని బాక్సైట్ తవ్వకాలను స్థానిక గిరిజన, ఆదివాసీలు ప్రతిఘటించిన విషయాన్ని వివరించారు. 'కార్పొరేట్ హిందూ రాష్ట్ర స్థాపనలో భాగంగా లౌకిక విలువలను కాలరాస్తున్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు. రాజ్యాంగ ఆదర్శాలను మట్టుబెడుతున్నారు. విప్లవ చైతన్యాన్ని తుడిచేసేందుకు యత్నిస్తున్నారు' అంటూ మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ విరసం రచయితలు, కవులు ఆరోపించారు. ప్రముఖ కవులు కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి విరసం ఆవిర్భావ దినం సభలో పాల్గొన్నారు. పాలస్తీనా సంఘీభావ కవిత్వాన్ని ఆవిష్కరించిన సిధారెడ్డి మాట్లాడుతూ.. యుద్ధ వ్యతిరేక కవిత్వం తీసుకురావడంలో యువకుల ప్రయత్నాన్ని అభినందించారు. కార్యక్రమంలో శివరాత్రి సుధాకర్, రాంకీ, సాగర్, రాము, రివేరా, ఎన్.వేణుగోపాల్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు.

అలా నటించడం నేరమా.?

సదస్సులో భాగంగా ఆదివాసీ సమస్యలపై 'అడవి మాదే' నాటకాన్ని విరసం కళాబృందం ప్రదర్శించింది. ఆపరేషన్ కగార్ పేరుతో అడవిబిడ్డలపై సాగుతున్న దురాగతాలను కళ్లకు కడుతూ రూపొందించిన ఆ నాటకంలో ఒకరిద్దరు చిన్నారులు కూడా నటించారు. సన్నివేశంలో భాగంగా ఆదివాసీల హక్కులను కాపాడాలి అంటూ ఆ పిల్లలు సైతం ప్లకార్డులు చేతబట్టి నినదించారు. దీన్ని సాకుగా చూపి, పసిమనసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకతను రేకెత్తిస్తున్నారని ఆరోపిస్తూ నాటకంలో నటించిన ఇద్దరు పిల్లల్ని, వారి తల్లిదండ్రులను బాలల సంరక్షణ అధికారులు బలవంతంగా హైదరాబాద్ జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ సంఘటనను నిరసిస్తూ విరసం సభ్యులు ర్యాలీ తీశారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఇలాంటి నిర్బంధాలేమిటి అని వారంతా నిలదీశారు. పిల్లలను భయాందోళనలకు లోనుచేసి ఇలా బలవంతంగా వ్యాను ఎక్కించి తీసుకెళ్లడం బాలల హక్కుల ఉల్లంఘన కాదా అని అధికారులను పాణి ప్రశ్నించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు కౌన్సెలింగ్ పేరుతో పిల్లల్ని ఇబ్బందిపెట్టడం సరికాదని విరసం నాయకులు అన్నారు. మహిషాసురమర్దిని, భక్త ప్రహ్లాద తదితర నాటకాల్లో నటించడానికి లేని అభ్యంతరం ఆదివాసీ కష్టాలను లోకానికి తెలిపే నాటకానికి ఎందుకని హైకోర్టు న్యాయవాది సురేష్ సీడబ్ల్యూసీ అధికారులను ప్రశ్నించారు. పసి హృదయాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను రేకెత్తిస్తున్నారన్న ఆరోపణ సరికాదని వాదించారు. దాంతో సంబంధిత అధికారులు పిల్లల్ని, వారి తల్లిదండ్రులను విడుదల చేశారు.

పోటాపోటీగా బీజేవైఎం, యూత్ కాంగ్రెస్ ఆందోళనలు

- బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు
- ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

గోషామహల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో బీజేవైఎం, యూత్ కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేవైఎం నాయకులు ఆందోళనకు దిగగా.. అందుకు ప్రతిగా రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నారని కమలదళం నేతల వైఖరిని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. ఈ రెండు పార్టీల ఆందోళనలను పోలీసులు సమర్థవంతంగా అడ్డుకుని పరిస్థితిని అదుపులో ఉంచారు. వివరాలిలా ఉన్నాయి.

కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంటు నిండు సభలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, గోల్కొండ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు నితిన్‌నందకర్, యోగిసింగ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌ను ముట్టడించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు బీజేవైఎం నాయకులకు అనుమతి లేదంటూ వారిని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్దే అడ్డుకున్నారు. ఎలాగైనా కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి నిరసన తెలపాలన్న పట్టుదలతో బీజేవైఎం కార్యకర్తలు పోలీసులను నెట్టేసి పరుగులు తీయడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేసి వారిని చెదరగొట్టారు. దీంతో ఒక్కసారిగా బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులను అరెస్ట్ చేసి అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గాంధీభవన్ వద్ద యూత్ కాంగ్రెస్ నేతలను..

బీజేవైఎం, బీజేపీ నాయకులు గత రెండు రోజులుగా తమ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడం, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు చేసిన ఆందోళన అనంతరం యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మోతే రోహిత్ ఆధ్వర్యంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమయ్యారు. దీంతో బేగంబజార్ పోలీసులు గాంధీభవన్‌లోనే వారిని అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు బయటికి రాకుండా ఉండేందుకు పోలీసులు గాంధీభవన్ ప్రవేశ ద్వారం వద్ద బారికేడ్లు వేసి వారిని నిరోధించారు. దీంతో యూత్ కాంగ్రెస్ నాయకులు నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో కాంగ్రెస్ కార్యకర్తలు బారికేడ్లు ఎక్కి బయటికి దూకేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

గ్రీష్మకు ఎమర్జింగ్ ఉమన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో ఎమర్జింగ్ ఉమన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును బాతాల గ్రీష్మ అందుకున్నారు. లండన్‌లో బుధవారం ఆసియన్ యూకే బిజినెస్ మీట్-2024 జరిగింది. ఇందులో భాగంగా అవార్డులకు ప్రపంచవ్యాప్తంగా 2,500పైగా నామినేషన్లు రాగా.. అందులో 250మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఎంపిక చేశారు. ఇందులో గ్రీష్మను అవార్డు వరించింది.

దొడ్డి కొమురయ్య కీర్తి సజీవం

(5వ పేజీ తరువాయి)

కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, కమిషనర్ బాలమాయదేవి, చంద్రశేఖర్, అలోక్‌కుమార్, మల్లయ్యభట్టుతో పాటు వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాసనసభ ప్రాంగణంలో..

శాసనసభ ప్రాంగణంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభస్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎల్పీ కార్యాలయ కార్యదర్శి శ్రీకాంత్, చీఫ్ మార్షల్ కరుణాకర్, శాసన మండలి, శాసన సభ ఉద్యోగులు పాల్గొన్నారు

30 రోజులు.. 20 హత్యలు!

(5వ పేజీ తరువాయి)

హత్య చేశారు. బీర్‌బాటిల్‌తో తలపై కొట్టి, గొంతు నులిమి హత్య చేయడమే కాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

పోలీసుల నిర్లక్ష్యమా..

నిఘా వర్గాల వైఫల్యమా..?

హైదరాబాద్ కమిషనరేట్ పరిధి ఉమ్మడి సౌత్‌జోన్‌తో పాటు.. ట్రై కమిషనరేట్ పరిధిలోనూ అల్లరిమూకలు, రౌడీగ్యాంగ్‌లు రెచ్చిపోతున్నాయి. సగటున రెండు రోజులకో హత్య జరుగుతోంది. పోలీసుల నిర్లక్ష్యం, నిఘా వైఫల్యమే ఇందుకు కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ఘరానా నేరస్థుల కదలికలపై నిఘాను అంతగా పట్టించుకోవట్లేదని తెలుస్తోంది. ఇటీవల జరిగిన కొన్ని హత్యలను, హత్యాయత్నాలను, బెదిరింపులను పరిగణనలోకి తీసుకుంటే ఈ విషయం అర్థం అవుతోంది.

అర్ధరాత్రి, తెల్లవారుజామునే..

ఉమ్మడి సౌత్‌జోన్‌లో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు ఎక్కువగా అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున జరుగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 1:30 సమయంలో చాదర్‌ఘాట్‌లో వెలుగులోకి వచ్చిన హత్య ఈ కోవకు చెందినదే. వరుస హత్యల నేపథ్యంలో పోలీసుల పనితీరుపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల సమీక్షలు, క్రైమ్ రివ్యూలు కేవలం ఉపన్యాసాలకు, ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రభావం చూపడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆడుకోవద్దని అమ్మ మందలించిందని..

(5వ పేజీ తరువాయి)

మందలించింది. అప్పటి నుంచి తల్లితో మాట్లాడకుండా, స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటోంది. గురువారం ఉదయం 11.30 సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు.. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో బద్దలుకొట్టి చూడగా ఫాతిమా వేలాడుతూ కనిపించింది. గాంధీ ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాళ్లున్నారా?

(5వ పేజీ తరువాయి)

పనితీరు అస్తవ్యస్తంగా మారుతోంది. క్షేత్రస్థాయిలో ఈ బృందాల పనితీరు సరిగ్గా ఉండడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వందల సంఖ్యలో మాన్‌సూన్ టీంలు ఏర్పాటు చేసినా.. యేటా రూ.50-60కోట్లు ఖర్చు చేస్తోన్నా.. పరిస్థితి మారడం లేదు. ఈ నేపథ్యంలో అత్యవసర బృందాలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయా..? లేదా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసిన బృందాలు అందుబాటులో లేక ట్రాఫిక్ పోలీసులు వ్యర్థాలు తొలగిస్తోన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గతంలో కాగితాల్లో మాత్రమే టీంలు ఉంటున్నాయని ఉన్నతాధికారులు గుర్తించారు. మాన్‌సూన్ టీంల పేరిట అక్రమాలు జరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. దీనికి చెక్ పెట్టేలా కార్మికుల ఆధార్ వివరాల నమోదు తప్పనిసరి చేశారు. అయినా కొన్ని చోట్ల అధికారుల పనితీరు మారలేదు.

అందుకే వరద నీరు

గ్రేటర్‌లో 200లకుపైగా వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నా.. భారీ స్థాయిలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు 140 ఉంటాయని అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు ఒక్కో టీం ఉండేలా ఏర్పాట్లు చేశామని చెబుతున్నారు. ఇదే నిజమైతే వర్షం పడిన వెంటనే అక్కడి బృందంలోని సభ్యులు క్షేత్రస్థాయిలో పని చేయాలి. క్యాచ్‌పిట్ల వద్ద చెత్తా చెదారం తొలగించాలి. అవసరాన్ని బట్టి మూతలు తొలగించి వరదనీరు వేగంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కానీ కొన్ని చోట్ల అత్యవసర బృందాలు కనిపించడం లేదు. నమోదైన వర్షపాతాన్ని బట్టి సాధారణంగా నగర రహదారులపై వరదనీరు రెండు, మూడు గంటల్లో తొలగిపోతుంది. వీలైనంత త్వరగా వర్షపునీరు వెళ్లేలా చర్యలు చేపట్టేందుకు అత్యవసర బృందాలు ఏర్పాటు చేస్తారు. మంత్రులు, ప్రముఖులు ఉండే ప్రాంతాల్లో వరద నీటి తొలగింపునకు ప్రాధాన్యం ఇస్తున్న అధికారులు.. ఇతర ప్రాంతాల్లో బృందాలున్నాయా..? లేదా..? అన్నది పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కువ సమయం రోడ్లపై వరద నీరు ఉంటోంది. ఒక్కో వాటర్‌లాగింగ్ పాయింట్‌లో ఒక్కో టీం ఉండేలా.. మేజర్ వాటర్ లాగింగ్ ఏరియాల వద్ద మోటార్ పంపులతో నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో వర్షం కురిసినప్పుడు ఉన్నతాధికారులతోపాటు జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో మాన్‌సూన్ టీంలున్నాయా..? లేదా..? అన్నది పరిశీలించేవారు. ఇటీవలి కాలంలో అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు తగ్గాయి. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి లేదా కమిషనర్, ఈవీడీఎం డైరెక్టర్ వస్తే తప్ప.. అధికారులు రహదారులపై కనిపించడం లేదు. జీహెచ్ఎంసీతోపాటు డీఆర్ఎఫ్, వాటర్‌బోర్డు, పోలీసులు, విద్యుత్ విభాగాలు మాన్‌సూన్ బృందాలు ఏర్పాటు చేశాయి. అన్ని విభాగాలు కలిపి 534 బృందాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మద్యం తాగి ఆటోనడిపిన డ్రైవర్‌కు 15 రోజుల జైలు

మదీన, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాన్ని నడిపిన ఓ ఆటో డ్రైవర్‌కు 15రోజుల జైలుశిక్ష, రూ.3300 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్‌మోయిన్(59) మద్యం తాగి ఆటో నడిపిస్తున్నట్లుగా తేలింది. అతనిపై కేసునమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన నాంపల్లి 9వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఆటోడ్రైవర్‌కు 15 రోజుల జైలుశిక్ష, రూ.3,300 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నాలుగోసారి పట్టుబడడం గమనార్హం.

నిశ్చితార్థ యువకుడు మాట మార్చాడని యువతి ఆత్మహత్య

మదీన, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం జరిగిన తర్వాత యువకుడు పెళ్లి చేసుకోనని మాటమార్చడంతో మనస్థాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం...ఫూల్‌బాగ్‌కు చెందిన సయ్యద్ ఆబేద్ హుసేన్ కుమార్తె అస్మాబేగం(22) నిశ్చితార్థం జనవరిలో షానవాజ్ అనే యువకుడితో జరిగింది. ఈ నెలలో పెళ్లిజరగాల్సి ఉంది. యువకుడు సదరు యువతితో పెళ్లిచేసుకోనని అకస్మాత్తుగా మాటమార్చాడు. దీంతో మనస్థాపానికి గురైన యువతి బుధవారం బాత్రూం కడిగే యాసిడ్ తాగింది. అస్వస్థతకు గురైన యువతిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మేనేజర్ కార్యాలయం గోడకు వినతిపత్రం అంటిస్తున్న కాలనీవాసులు

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

చాంద్రాయణగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తమ బస్తీలోని డ్రైనేజీ, మురుగునీటి సమస్యను పరిష్కరించాలని హనుమాన్ నగర్ ఫేజ్-3 వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై డీఆర్‌డీఎల్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి బస్తీవాసులు వెళ్లగా మేనేజర్ అందుబాటులో లేడు. దీంతో కార్యాలయం ముందు గోడకు వినతిపత్రాన్ని అంటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, హనుమాన్‌నగర్ ఫేజ్-3లో గత 15-20 సంవత్సరాలుగా చత్రినాక, పై బస్తీలలో నుంచి వర్షపు నీరు, మురుగునీరు తమ బస్తీలోకి వస్తుందన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని గుర్తుచేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిలిచిపోతోందన్నారు. కావున అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు నర్సింగ్, హనుమంత, అనిత, ప్రమోద్, శివచంద్రగిరి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అఖిల

పహాడిషరీఫ్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ తిరిగిరాలేదు. పహాడిషరీఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. శ్రీరామ్‌కాలనీకి చెందిన జరుపుల మన్నెన్, అఖిల భార్యాభర్తలు. అఖిల తరచూ ఫోన్ మాట్లాడుతోంది. ఈనెల రెండున ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అఖిల ఇంటికి రాలేదు. ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో భర్త బస్తీలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం భర్త పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి..



జైనుద్దీన్

చార్మినార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి తప్పిపోయాడు. ఈ సంఘటన రెయిన్ బజార్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నస్రీన్ బేగం తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర కు చెందిన జైనుద్దీన్ (46)ఈ నెల రెండున రెయిన్ బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని రహ్మానియా మాదర్సా వద్ద ఉండే కుమారుని ఇంటికి వచ్చింది. కొద్దీ సేపటి తర్వాత బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బస్తీ పరిసరాలలో బంధువుల ఇంటి వద్ద వేతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు గురువారం రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు,

లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దు

చార్మినార్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చలాన్ లు విధిస్తామని భవాని నగర్ ఇన్‌స్పెక్టర్ అన్నారు, గురువారం తలాబ్ కట్ట లో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతూ లైసెన్స్ లేకుండ వాహనాలు నడపారాదన్నారు, మైనర్ లకు వాహనాలు ఇవ్వరాదన్నారు, వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండ వాహనాలు బయటకు తీయవద్దనిట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు, ఈ కార్యక్రమం లో ఆటో డ్రైవర్లు స్థానికులు పాల్గొన్నారు,



చౌటి ఆనంద రఘునందన్‌ను సత్కరిస్తున్న కళాకారులు

సాంస్కృతిక శాఖ ఏడీకి ఘన సత్కారం

రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక శాఖలో ముప్పై ఏళ్లుగా పనిచేస్తూ స్వయనా గాయకుడు, ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) చైటి ఆనంద రఘునందన్‌కు ఘన సన్మానం జరిగింది. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మహతి రాజన్న నాదప్రియ ఆధ్వర్యంలో భూలే బిస్రే గీత్ - పాటల తోటలో శీర్షిక సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖసిబ్బంది శ్రీనివాస్, హేమలత, శ్రీనివాస్, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనిస్‌గౌడ్, లింగయ్యలతో పాటు డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రఘునందన్‌ను ఘనంగా సన్మానించారు. అధికారిగా, గాయకుడిగా సాంస్కృతిక సేవలో నిమగ్నమయ్యారని అభివర్ణించారు.

శరత్‌కుమార్‌కు 'గరిమెళ్ల' పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రంగస్థల, టీవీ, సినిమా నటుడు నిట్టల శరత్‌కుమార్‌కు గరిమెళ్ల రామమూర్తి రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. గురువారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో గరిమెళ్ళ రామమూర్తి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి పురస్కారగ్రహీత నిట్టల శరత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ నాటక రంగానికి గరిమెళ్ళ రామమూర్తి ఎనలేని సేవ చేశారని గుర్తుచేసుకున్నారు. ప్రముఖ నటుడు నిట్టల శరత్‌కుమార్‌కు గరిమెళ్ల పురస్కారం ప్రదానం చేయడం సముచితమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సోమేశ్వరరావు, జి.ఎం.రెడ్డి, సుబ్బారాయశర్మ తదితరులు పాల్గొన్నారు. సభానంతరం మైత్రీ కళానియలం విజయవాడ వారిచే బంధం నాటికను ప్రదర్శించారు. మాడగుల రామకృష్ణ రచించిన ఈ నాటకానికి టి.వి.పురుషోత్తం దర్శకత్వం వహించారు. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.



నిట్టల శరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

క్లీనింగ్ చేయరు..! లిఫ్ట్ పనిచేయదు..!!

- అధ్వానంగా కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్‌జూబ్లీ బిల్డింగ్
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు
- వాటర్‌క్యాన్లు పైకి రాక.. తాగునీటికీ అవస్థలు
- గ్రౌండ్ ఫ్లోర్, మెట్లపై దుమ్ము, పావురాల వ్యర్థాలు



అధ్వానంగా ఉన్న పరిసరాలు

హైదరాబాద్‌సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదరాబాద్ కలెక్టరేట్ అధ్వానంగా మారింది. నిర్వహణలోపంతో పలు విభాగాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ప్రధానంగా పరిపాలన విభాగం అధికారులు.. కలెక్టరేట్‌లోని ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పట్టించుకోకపోవడంతో దుర్గంధభరితమవుతున్నాయి. దీంతో కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతరశాఖల అధికారులు, ఉద్యోగులు ఇక్కడి పరిస్థితిని చూస్తూ అసహనానికి లోనవుతున్నారు. కొంతమంది ఒకసారి వస్తే.. మరోసారి వచ్చేందుకు వెనకంజ వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను కొంగరకలాన్‌లో నిర్మించిన నూతన భవనానికి తరలించిన తరుణంలో హైదరాబాద్ కలెక్టరేట్‌ను ఏడాదిన్నర క్రితం లక్డీకపూల్‌లోని పాత రంగారెడ్డి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. గతంలో నాంపల్లిలో హైదరాబాద్ కలెక్టరేట్ ఉండడంతో అధికారులు, ఉద్యోగులు, పౌరులు.. రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. అయితే లక్డీకపూల్‌కు కలెక్టరేట్‌ను తరలించడంతో అందరికీ అనుకూలంగా మారింది. కాగా, ఇక్కడ విశాలమైన భవనాలతో పాటు అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక గదులు ఉండడంతో సాఫీగా పని చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు ఉండడంతో వారికి ప్రయాణ ఇబ్బందులు తప్పాయి. అయితే ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కలెక్టరేట్‌లోని ప్రాంగణం, వివిధ విభాగాల పరిశుభ్రతను గాలికి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నారు.

స్నేహ సిల్వర్‌జూబ్లీ భవనం నిర్వహణ అధ్వానం

కలెక్టరేట్‌లోని మెయిన్ బిల్డింగ్ నిర్వహణ కాస్తా మెరుగ్గా ఉన్నప్పటికీ పక్కనే ఉన్న స్నేహ సిల్వర్ జూబ్లీ భవనం నిర్వహణ దయనీయంగా మారింది. ఈ భవనంలో ఐదు అంతస్తులున్నాయి. ఇందులో స్త్రీ, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, ల్యాండ్ రికార్డ్స్, జిల్లా ప్రజాసంబంధాలు, తదితర శాఖలు పనిచేస్తున్నాయి. ఆయా ఆఫీసుల్లో కలిపి దాదాపు 60 నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే కలెక్టరేట్ మెయిన్ బిల్డింగ్‌కు అనుసంధానంగా కొనసాగుతున్న ఈ భవనం నిర్వహణను పట్టించుకపోవడంతో ఉద్యోగులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదలుకుని 5వ అంతస్తు వరకు ఉన్న మెట్లపై దుమ్ము, ధూళి పేరుకుపోతోంది. పావురాల వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడే ఉండడంతో దుర్వాసన వస్తోంది. దీంతో వారు ముక్కు మూసుకుని తమ ఆఫీసులకు వెళ్తూ పనిచేస్తున్నారు.

నెలలో రెండు, మూడుసార్లు పాడైపోతున్న లిఫ్ట్..

స్నేహ సిల్వర్ జూబ్లీ భవనంలో ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం రెండు లిఫ్టులను ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఒకటి చాలాకాలం నుంచి పనిచేయడం లేదని, మరో లిఫ్టు నెలలో రెండు, మూడుసార్లు పాడైపోతోంది. లిఫ్ట్ పనిచేయకపోవడంతో తాము పనిచేసే అంతస్తులోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఉద్యోగులు, సీనియర్ సిటీజన్లు చెబుతున్నారు. లిఫ్టు సమస్యపై సంబంధిత అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని వారు పేర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి లిఫ్ట్ వినియోగంలో లేకపోవడంతో ఉద్యోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టర్ గారూ.. పట్టించుకోరూ..!

కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ బిల్డింగ్ నిర్వహణను కలెక్టర్ పట్టించుకోవాలని ఉద్యోగులు, సీనియర్ సిటీజన్లు, సాధారణ ప్రజలు కోరుతున్నారు. భవనం పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. తరచూ లిఫ్ట్ పాడైపోతుండడంతో మెట్లు ఎక్కి వెళ్లలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, స్నేహ సిల్వర్ జూబ్లీ బిల్డింగ్‌లోని లిఫ్టుతోపాటు మెయిన్ బిల్డింగ్‌లోని లిఫ్టు పరిస్థితి కూడా భయానంగా మారింది. ఈ బిల్డింగ్‌లో కూడా 5 అంతస్తులుండగా.. దాదాపు 130 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులోని లిఫ్టు కూడా పైకి వెళ్తున్న క్రమంలో అటు ఇటు శబ్దం చేస్తూ ఊగుతోంది. దీంతో ఎక్కడ ఆగిపోతుందో.. ఎక్కడ కింద పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది., లిఫ్టు పరిస్థితిని తెలుసుకున్న కొందరు ఉద్యోగులు మెట్లపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో అందులో ఎక్కి భయం భయంగా వెళ్తున్నారు. భవనాల నిర్వహణపై కలెక్టర్ ప్రత్యేకదృష్టి సారించి, తమను ఆదుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మురుగుకూపంగా 'జల్‌పల్లి'

- మున్సిపల్ అధికారుల అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు



పేరుకుపోయిన చెత్తను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పహాడిషరీఫ్ జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్ శివారులో ఉన్న జలపల్లి మున్సిపాలిటీ మురికి కూపంగా మారిపోయిందని జలపల్లి మునిసిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్, మొహమ్మద్ హుస్సేన్ అన్నారు. గురువారం మున్సిపాలిటీపరిధిలోని వాదీ ఏ ముస్తఫా, వాదీ ఏ హదిస్, ఎర్రకుంట, కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బక్రీద్, వర్షాకాలం సమస్యలపై సర్వసభ్య సమావేశం జరిగింది. నాలాల్లో మట్టి తొలగింపు ఎక్కడ జరిగిందో తెలపాలన్నారు. లేనిచో మున్సిపాలిటీ అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. రోడ్లపై మురుగునీరు పారుతోందని, , ప్రధాన రహదారులపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. మురుగు కాలువల్లో మట్టి పేరుకుపోయిందని, చిన్నపాటి వర్షానికి కాలువలు పొంగిపొర్లుతున్నాయాని అన్నారు. జలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వరకు శ్రీశైలం ప్రధాన రహదారిపై ఎక్కడ చూసినా మురుగు, చెత్తాచెదారం కనిపిస్తోందన్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా జలపల్లి మున్సిపల్ కమిషనర్ గానీ, సంబంధిత అధికారులు గానీ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు.

రూ.8.75 లక్షలు లూటీ చేసిన సైబర్ నేరగాళ్లు

- క్రెడిట్ కార్డు లేదన్నా వినని కేటుగాళ్లు
- కేసులు పెడతామంటూ.. మహిళ ఖాతా నుంచి 7.5 లక్షలు మాయం
- ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు పేరుతో వృద్ధుడి నుంచి 1.25 లక్షలు..

హిమాయత్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు నగరానికి చెందిన ఓ మహిళను, మరో వృద్ధుడిని బెదరగొట్టి రూ.8.75లక్షలు కాజేశారు. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'మేము హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి ఫోన్‌చేస్తున్నాం. మీరు మా బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి కొనుగోళ్లు చేశారు. ఆ డబ్బుల చెల్లింపు గడువు తీరిపోయింది. వెంటనే డబ్బులు చెల్లించాలి' అని డిమాండ్ చేశారు. నాకు బ్యాంకు క్రెడిట్ కార్డే లేదని మహిళ బదులిచ్చింది. అయితే అవేమి పట్టించుకోని ఆగంతకుడు 'మీరు డబ్బులు కట్టకపోతే మీ బ్యాంకు అకౌంట్ నుంచి నేరుగా కట్ చేసుకుంటాం' అని హెచ్చరించాడు. దీంతో కాస్త ఆందోళనకు గురైన మహిళ తనకు ఎలాంటి కార్డు కూడా లేదని మళ్లీ చెప్పింది. అయితే క్రెడిట్‌కార్డు ముంబై నుంచి మీకు పంపించాం. కాబట్టి ముంబై క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేయాలని, వాళ్లకు ఫోన్ కనెక్ట్ చేస్తానని ఆగంతకుడు నమ్మించాడు. ఆ తర్వాత వేరే వ్యక్తి ఫోన్‌లైన్‌లోకి వచ్చి తాము క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని, వీడియో ద్వారా మీ వివరణ కావాలని వీడియో కాల్ చేశారు. అందులో కేటుగాళ్లు పోలీసుల వేషధారణలో కనిపిస్తూ..'మీ ఆధార్ కార్డు నెంబర్ కావాలి' అని అడిగి తీసుకుని, చెక్ చేస్తున్నట్లుగా నటించారు. ఆధార్ లింక్ ఉన్న బ్యాంకు ఖాతా నుంచి దాదాపు రూ.30 లక్షల వరకు మనీల్యాండరింగ్ లావాదేవీలు నడిచాయన్నారు. 'మేము చెప్పినట్లుగా మీ బ్యాంకు అకౌంట్‌లో ఉన్న మొత్తం డబ్బును మా బ్యాంకు అకౌంట్‌కు పంపించాలి. పరిశీలించి వారంలో మళ్లీ మీకు తిరిగి పంపిస్తాం. మా మాట వినని పక్షంలో వెంటనే మీపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తాం' అని బెదరగొట్టారు. దీంతో తీవ్రఆందోళనకు గురైన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.ఏడున్నర లక్షలను వారు సూచించిన బ్యాంకు ఖాతాకు ఆర్‌టీజీఎస్ ద్వారా పంపించింది. తర్వాత ఈ విషయాన్ని తన ఆఫీస్‌లో పనిచేసే సహచరులతో చెప్పింది. అయితే ఇదంతా మోసమని వారు చెప్పడంతో గురువారం బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేసింది.

●వృద్ధుడిని ట్రాప్ చేసి...

నగరానికి చెందిన 63 ఏళ్ల వ్యాపారిని బురిడీ కొట్టించిన కేటుగాడు లక్షన్నర దాకా కాజేశాడు. రెండు రోజుల క్రితం ఓ ఆగంతకుడు వృద్ధుడికి కాల్ చేసి తాను ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నా. 'మీ ఆధార్, పాన్ కార్డు లింక్ చేయాల్సి ఉంది. మీ మొబైల్‌కు ఒక మెసేజ్ వస్తుంది. దాన్ని క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి' అని చెప్పాడు. దీంతో లింక్‌ను వృద్ధుడు క్లిక్ చేశాడు. ఆ వెంటనే అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.125లక్షలు డెబిట్ అయ్యాయి. ఆగంతకుడి నెంబర్‌కు కాల్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని బాధితుడు సిటీసైబర్ క్రైమ్స్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా కొనియాడారు. గురువారం నిజాం కళాశాలలో బీసీ సెల్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, బీసీ సెల్ కో- ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఈవోసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ధీకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హైదర్షాకోట్‌లో క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి



మృతి చెందిన శ్రీనివాస్ (ఫైల్)

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ బస్‌స్టాప్ వద్ద కారులో అనుమానస్పదస్థితిలో వ్యక్తిమృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్(34) హైదర్షాకోట్ వెస్టెన్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు రోజుల నుంచి ఇంటికి రాలేదు. గురువారం మధ్యాహ్నం శాంతినగర్ బస్‌స్టాప్ సమీపంలోని పార్కింగ్ ఏరియాలోని కారులో నుంచి దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. కారులో శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పీరంచెరువులో నివాసముండే మోహన్ కుమారుడు సందీప్(21) మొయినాబాద్ లోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు ఇంట్లో మొదటి అంతస్తులో ఉండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇతను ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన తండ్రి సందీప్‌ను కిందికి దించి, లంగర్‌హౌస్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సందీప్ ఆత్మహత్యకు కారణం ఆర్థిక సమస్యలని ప్రాథమికంగా తెలిసింది. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీరుసీసాలో గుర్తుతెలియని పదార్థం

చాంద్రాయణగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బారులో బీరు తాగుతున్న వ్యక్తికి బీరు సీసాలో వింతపదార్థం కనిపించడంతో ఖంగుతిన్నాడు. పాతబస్తీ ఫలకనుమలోని కోహినూర్‌బార్‌లో మద్యం కొనుగోలుచేసిన వ్యక్తికి బీర్‌లో గుర్తు తెలియని పదార్థాలు తేలుతూకనిపించడంతో అవాక్కయ్యారు. వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఇది వెంటనే వైరల్‌అయింది. కోహినూర్ బార్ లో కల్తీబీర్ విక్రయిస్తున్నారని వీడియోలు వైరల్ అయ్యాయి. స్పందించిన చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, ఎస్సై శ్వేత కుమారి, హెడ్ కానిస్టేబుల్ ఉమాశంకర్‌లను బార్ వద్దకు పంపారు. ఎక్సైజ్ పోలీసులు బీరు బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీరు బాటిల్‌లోని పదార్థాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

సామాజిక సేవకుడికి సత్కారం

గోషామహల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు పేదజంటలకు సామూహిక వివాహాలను జరిపిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న బొర్ర శ్రీనివాస్‌గౌడ్ సేవలు మరువలేనివని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశమ్యోని శ్యాంరావు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సామాజికవేత్తలు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనను ఘనంగా సత్కరించారు.

రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయండి

అఫ్జల్‌గంజ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జాంబాగ్ డివిజన్‌లోని హనుమాన్ టెకిడిలోని పలు బస్తీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయని.. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని యుద్ధప్రాతిపదికన పాడైపోయిన రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జాంబాగ్ డివిజన్ బీసీసెల్ అధ్యక్షులు జె.అశోక్ కుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం జలమండలి జీఎం షరీఫ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన జీఎం ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.నీలేష్ కుమార్, రాజేందర్‌యాదవ్, సంతోష్ యాదవ్, సీహెచ్.సునిల్, సి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి

అఫ్జల్‌గంజ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో త్వరలో జరగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా పలు అమ్మవారి ఆలయాల వద్ద పాడైపోయిన రోడ్లు, వెలగని వీధి దీపాలు, పేరుకుపోయిన మట్టిదిబ్బల వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి ఎక్కడెక్కడ సమస్యలున్నాయో వాటిపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతానన్నారు.

పేద విద్యార్థుల ఉచిత విద్యకు కృషి

గోషామహల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులను ఫౌండేషన్ ద్వారా చెల్లిస్తూ వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ముందుకెళుతున్నామని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం గౌలిగూడలోని ఫౌండేషన్ కార్యాలయంలో పలువురు పేద విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలను అందజేశారు.

ఎన్‌టీఏను రద్దు చేయాలి

మంగళ్‌హట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో జరిగిన స్కామ్‌లపై న్యాయ విచారణజరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని... ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమైన విషయమని ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు జె.మల్లేష్ రాజ్, హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నితిన్‌లు ఆరోపించారు. నీట్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

వైన్‌షాపు వద్ద గొడవ కేసులో బాధితుడి మృతి

మదీన, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవ కేసులో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ సంఘటన కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పురానాపూల్‌కు చెందిన మహమూద్‌అలీఖాన్(60) 15 రోజుల క్రితం మరోవ్యక్తితో కలిసి దుర్గా వైన్‌షాపుకు మద్యం తాగడానికి వెళ్లాడు. తాగిన అనంతరం అక్కడే ఉన్న మరో ఇద్దరితో గొడవ జరిగింది. అనంతరం అక్కడి నుంచి తిరిగి వెళ్తున్న మహమూద్ అలీఖాన్ తలపై వెనుక నుంచి బీరు సీసాతో కొట్టారు. గాయాలపాలైన అలీఖాన్‌ను చికిత్స నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గురువారం అలీఖాన్ మృతిచెందాడు. ఇన్‌స్పెక్టర్ వై.కమల్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. మృతికి ఆరోజు తలకు తగిలిన గాయమేనా.. అనారోగ్య సమస్యలేమైనా ఉన్నాయా విచారిస్తున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

టీజేఎస్‌లో చేరిన డాక్టర్ శ్రీనివాస్ ముదిరాజ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ జనసమితి (టీజేఎస్)లో సభ్యత్వం స్వీకరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కండువా కప్పి శ్రీనివాస్ ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో ముదిరాజ్ రిజర్వేషన్ల సమస్య పరిష్కృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో 'నార్కొటిక్ వింగ్' దాడులు

- 155 కిలోల గంజాయి స్వాధీనం
- 8 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులతో కలిసి నగరంలో పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్‌న్యూ) పోలీసులు దాడులు చేసి ఎనిమిది మంది గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. మూడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 155 కిలోల గంజాయి, స్కార్పియో కారు, పాసింజర్ ఆటో, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా మల్కాన్‌గిరికి చెందిన మంజిత్ థాలి అలియాస్ జీతు గంజాయి స్మగ్లర్. ఇతడు గతంలో పలు కేసుల్లో అరెస్టయ్యాడు. ఇతడు ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన అనిల్ ధానాజీ ఘూంటే, శుశాంత్ మిత్రీ, సుమంత్ మండల్‌లతో కలిసి గంజాయి దందా చేస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఆసిఫ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న జి దేవరాజ్ సింగ్‌ను అరెస్ట్ చేశారు.

రౌడీషీటర్ గంజాయి దందా: మంగళ్‌హాట్‌కు చెందిన ఎస్. లఖన్‌సింగ్ అలియాస్ లఖన్ అలియాస్ గోరుపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రౌడీషీటర్ నమోదై ఉంది. హత్య, హత్యాయత్నం, బెదిరింపులు వంటి కేసుల్లో నిందితుడిగా ఉన్న లఖన్‌సింగ్ గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. అతడిపై మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉండటంతో పీడీయాక్ట్ కూడా నమోదు చేశారు. జైలు నుంచి విడుదలైన అతడు గంజాయి దందా చేస్తున్నాడు. లఖన్‌సింగ్ ఈస్ట్‌గోదావరి ప్రాంతానికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. హెచ్‌న్యూ పోలీసులు లఖన్‌సింగ్, రాథోడ్ గోవింద్‌ను కూడా అరెస్ట్ చేశారు.

నేడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు 3 గంటలు ఆలస్యం

హైదరాబాద్‌సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. గురువారం రాత్రికి న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ రావాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తుండడమే ఇందుకు కారణమని రైల్వే అధికారులు తెలిపారు. సిర్పూర్-కాగజ్‌నగర్ సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నందున పలు రైళ్లు రద్దయ్యాయని, ముఖ్యమైన రైళ్లు సైతం గంటల కొలదీ ఆలస్యంగా నడుస్తున్నాయని చెబుతున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hzMHz6Z లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/ set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


సంగీత విద్వాంసులు హరిప్రియ, షణ్ముఖప్రియలను సత్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

గొప్ప రాజనీతిజ్ఞుడు కొణిజేటి రోశయ్య

● మంత్రి శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన గొప్ప రాజనీతిజ్ఞుడు కొణిజేటి రోశయ్య అని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీవాసవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు హరిప్రియ, షణ్ముఖ ప్రియలకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు హాజరై పురస్కారగ్రహీతలు ప్రియా సిస్టర్స్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబద్ధతగల రాజకీయం చేసిన ఘనత రోశయ్యదని గుర్తుచేశారు. రోశయ్య పాలనాపరమైన సమయస్ఫూర్తి అద్భుతమని, శాసనసభలో పెద్దపెద్ద లీడర్లకు పలోక్తులతో ఆయన సమాధానం చెప్పేవారన్నారు. ఈ తరం యువ శాసనసభ్యులకు రోశయ్య రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉన్నతమైన నాయకులెందరో రోశయ్యను ఆదర్శంగా తీసుకొని రాజకీయంలోకి వచ్చారని అన్నారు. రోశయ్య జీవితాన్ని పుస్తకరూపంలో రావాల్సిన అవసరముందని మంత్రి అన్నారు.

తెలుగు రాష్ట్రాలను నిలబెట్టారు: కేవీపీ

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య తన ఆర్థిక క్రమశిక్షణతో తెలుగు రాష్ట్రాలను నిలబెట్టారని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అన్నారు. ఉభయ రాష్ట్రాలు ఆర్థికంగా నిలబడి నెలనెలా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నాయంటే. అది ఆర్థిక శాఖ మంత్రిగా రోశయ్య చేసిన చలవేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎముకలేని చెయి అని, అయితే రోశయ్య సొంత ఇంటిని చూసుకున్నట్టే రాష్ట్రాన్ని చూసుకున్నారన్నారు. ప్రజల డబ్బుకి జవాబుదారీతనంగా ఉండేవారని ఆయన సేవలను గుర్తుచేశారు. సభకు ముందు ప్రియ సిస్టర్స్ ప్రదర్శించిన సంగీత కచేరీ శ్రోతల్ని మంత్రముగ్ధులను చేసింది. పలు సంకీర్తనలను ఆలపించిన గాయనీమణులు ఆహూతుల్ని ఓలలాడించారు. కార్యక్రమంలో కోటేటి దామోదరగుప్తా, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి కోటి, అమరవాది లక్ష్మీనారాయణ, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.


మౌలాలిలో వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని అడ్డుకున్న స్థానికులు

అప్పుడు రాకుండా.. ఇప్పుడెందుకు వచ్చావ్!

● ఎమ్మెల్యేను నిలదీసిన స్థానికులు.. ఆర్టీసీ కాలనీలో స్వల్ప ఉద్రిక్తత
● గతంలోనే తాను ఈ పనులపై ధర్నా చేశా: ఎమ్మెల్యే మర్రి

మౌలాలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై భైఠాయించి ధర్నా చేస్తున్న సమయంలో రాకుండా.. ఇప్పుడెందుకు వచ్చావ్.. అని కాలనీవాసులు ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ సంఘటన గురువారం మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ కాలనీలో చేపడుతున్న ప్రధాన రహదారి మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఇంజనీరింగ్ డీఈ మహేష్, ఏఈ మధుసింగ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానికులతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో ఎనిమిది నెలలుగా రోడ్డు పనులు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నప్పుడు, ఈ మార్గంలో పలువురు గాయలపాలైనప్పుడు రాకుండా, ఏమార్గం పట్టించుకోకుండా ఉన్నారు. ఇప్పుడు పనులు జరుగుతున్నప్పుడు రావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఓ యువకుడు ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనపైకి దూసుకువచ్చాడు. దీంతో ఇటు ఎమ్మెల్యే అనుచరులు, అటు కాంగ్రెస్ నాయకుల మధ్య చిన్నపాటి తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, స్థానికులు జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఈ పనులపై గతంలోనే తాను జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం ఇచ్చానని, మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ధర్నా కూడా చేశానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న డీఈ మహేష్‌ను ఎమ్మెల్యే తన వద్దకు రప్పించారు. ఆర్టీసీ కాలనీ రోడ్డు పనులు పూర్తి చేయాలని తాను గతంలో కోరానా లేదా అని ఆయనను ప్రశ్నించగా.. డీఈ అవును అని సమాధానం ఇవ్వడంతో స్థానికులు శాంతించారు. ప్రజా సమస్యలపై తాను నిరంతరం పోరాడతానని, తనకు అండగా నిలవాలని ఎమ్మెల్యే స్థానికులను కోరారు. అయితే దీనిపై కొంతమంది స్థానికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతోనే ఆర్టీసీ కాలనీ ప్రధాన రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, ఉస్మాన్, భాగ్యనందరావు, సత్తయ్య శ్రీనివాస్, ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు విక్టర్‌యాదవ్, ఫైజల్, నర్సింహ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అన్ని పార్టీలతో ముస్లిం పర్సనల్ లా బోర్డు చర్చిస్తుంది : ఒవైసీ

పహడిషరీఫ్ జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ముస్లిం పర్సనల్ లా బోర్డు త్వరలో దేశంలోని అన్ని పార్టీల ప్రతినిధులతో చర్చించనున్నదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఖిజా కాలనీలో మదర్సా మహేదుల్ ఆలియాత్ ముస్లిం పర్సనల్ లా బోర్డు జాతీయ అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రెహ్మానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసదుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన చట్టాల వల్ల ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే అంశంపై న్యాయ నిపుణులతో చర్చించి, అనంతరం ముస్లిం పర్సనల్ లా బోర్డు నిర్ణయం తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు జాతీయ అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రెహ్మానీ, మజ్లిస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, మజ్లిస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ ఇన్‌చార్జి అహ్మద్ సాది, మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు హసన్ గాలిబ్, బార్కస్ కార్పొరేటర్ హబీబ్ పటేల్, జల్‌పల్లి మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ హసన్ గాలిబ్, బాలాపూర్ మాజీ ఉప సర్పంచ్ హమదీన్ అబ్దుల్ అజీజ్‌తో పాటు ఉలేమాలు తదితరులు పాల్గొన్నారు.

'40శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పలు ఉద్యోగ సంఘాల నుంచి సేకరించిన నివేదిక ఆధారంగా వెంటనే 40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 317 జీవో బాధితులకు న్యాయం చేసి వారి స్థానికతను కోల్పోకుండా సొంత జిల్లాకు వారిని పంపించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. బషీర్‌బాగ్‌లోని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో గురువారం అసోసియేషన్ అత్యవసర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సాధారణ బదిలీలు నిలిపివేసి, అంశాలు ఎత్తివేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చైర్మన్ బిలగాని సంపత్ కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, మీడియా సెక్రెటరీ ఎం.రామచంద్రం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎంకే రాజు, మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ జానకీబాయి, సిటీ జనరల్ సెక్రెటరీ వెంకట్, మెడికల్ మెడికల్ ఫోరం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అవినాష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మరింత ఆదాయంపై ఆర్టీసీ దృష్టి


ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన షాపులు

● కార్గోసేవలను విస్తరించేందుకు చర్యలు
● ఖాళీ స్థలాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు టెండర్లు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎంజీబీఎస్, జూబ్లీబస్టాండ్ నుంచి ఆర్టీసీ షాపుల అద్దెలు, పార్కింగ్ టెండర్లు, ప్రకటనల రూపంలో ప్రతినెలా రూ. 14 కోట్ల వరకు వస్తోంది. మహాత్మాగాంధీ బస్టేషన్ నుంచి రూ. కోటి, జేబీఎస్ నుంచి రూ.40లక్షల వరకు ఆదాయం వస్తుండగా దీన్ని మొత్తంగా రూ. 2 కోట్ల వరకు పెంచుకునే మార్గాలను అన్వేషిస్తోంది. బస్టాండ్లలో షాపులను అదనిక్షేకరించడంతో పాటు వాటిని ఎక్కువ నెలలు ఖాళీగా ఉంచకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలతో బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ప్రధానంగా సెలవు రోజుల్లో జిల్లాల నుంచి నగరానికి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకల సంఖ్య రెట్టింపవడంతో బస్టాండ్లు ఉదయం 5గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రయాణికులతో కిక్కిరిపోతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్లలో ఖాళీస్థలాలను గుర్తించి ఫుడ్‌స్టాల్స్ ఇతర దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. బస్టాండ్లలో పార్కింగ్ వ్యవస్థను ఆధునీకరించేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నారు.

కార్గో సేవల విస్తరణ..

గ్రేటర్‌లో కార్గో సేవలు విస్తరిస్తూ ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. కార్గోసేవలతో టీజీఎస్ఆర్టీసీకి నెలకు రూ. 12-13 కోట్ల ఆదాయం వస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు వందల సంఖ్యలో ప్రతి రోజు పార్సిల్స్ వెళ్తుండడంతో వాటిని ఆర్టీసీ కార్గో వైపు మళ్లించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని బేగంబజార్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల నుంచి ప్రధాన నగరాలకు కార్గోసేవలు విస్తరిస్తోంది. కార్గోసేవలవిస్తరణపై అవగాహన కల్పిస్తూ హాకీపాటలో నిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రయాణికులకు రవాణా సేవలందిస్తూనే కార్గోసేవల విస్తరణతో ఆదాయం రెట్టింపు చేసుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది.

ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకుంటే

బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో లోన్లు తెచ్చుకునే అవకాశాలు కూడా మెరుగుపడుతాయని ఆర్టీసీ భావిస్తోంది. గ్రేటర్‌జోన్ పరిధిలో 25 బస్‌డిపోల్లో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించింది. ఆర్టీసీ బస్సులతో పాటు డిపో ఆవరణలో ప్రైవేట్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశాలను ఆర్టీసీ పరిశీలిస్తోంది. పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం నేపథ్యంలో భవిష్యత్‌లో ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ఫుల్ డిమాండ్ ఉంటుందని దానికి అనుగుణంగా ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుతో ఆదాయం పెంచుకోవచ్చని భావిస్తోంది.

ధ్రువీకరణ పత్రాలపై కలెక్టర్ ఫోకస్

● నెలరోజుల్లో 14,195 దరఖాస్తుల్లో 8,111 మందికి జారీ
● పెండింగ్‌లో ఉంచొద్దని తహసీల్దార్లకు ఆదేశాలు
● స్వీకరణ, పరిష్కార తేదీలను ఆన్‌లైన్ చేయాలని సూచన

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన ఆదాయం, కుల, నివాసం, ఈబీసీ, ఓబీసీ సర్టిఫికెట్ల జారీపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టి సారించారు. తమ వద్దకు వస్తున్న దరఖాస్తులను విచారణ పేరుతో రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచొద్దని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో పలు మండలాల్లో ధ్రువీకరణ పత్రాల జారీ వేగంగా జరుగుతోంది. గత జూన్ 4 నుంచి జూలై 4 (గురువారం) వరకు జిల్లాలోని 16 మండలాల పరిధిలో కులం, ఆదాయం, నివాస, ఈబీసీ, ఓబీసీ, ఇతర పత్రాల కోసం మీసేవలో 14,195 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 8,111 మందికి జారీ చేయడం ఇందుకు నిదర్శనం. కాగా, నాయబ్ తహసీల్దార్లకు 19,299 వచ్చిన అర్జీల్లో 16,665 పరిష్కరించారు. ఇదిలా ఉండగా, ప్రజల నుంచి వచ్చిన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తులను ఇన్‌వార్డు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రతి దర ఖాస్తుకు సంబంధించిన స్వీకరించిన తేదీ, పరిష్కారమైన తేదీలను నమోదు చేయాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించడంతో తప్పకుండా పాటిస్తున్నారు.

రెవెన్యూశాఖ ఇమేజ్ పెంచాలి: కలెక్టర్

జిల్లాలో పౌరులకు సమర్థవంతమైన సేవలందించి రెవెన్యూశాఖ ఇమేజ్‌ను పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ విభాగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి, ప్రజాపాలనలోని దరఖాస్తులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ల్యాండ్ బ్యాంక్ యాప్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ఏ ప్రాంతంలో ఎక్కడ ఎంత ప్రభుత్వ భూమి ఉందనే వివరాలను ల్యాండ్ బ్యాంక్ రిజిస్టర్లలో నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన భవనాలు వినియోగంలో లేకుంటే, ప్రభుత్వ భూముల్లో నిర్మాణ పనులు చేపట్టకపోయినా, వాటిని గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాల నిర్వహణ, సకాలంలో ధ్రువపత్రాల జారీకి తహసీల్దార్ కార్యాలయాలను ప్రతి వారం తనిఖీ చేసి నివేదిక అందించేందుకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి, నష్టం జరగకుండా ఉండేందుకు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కదిరవన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను నెరవేర్చాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను నెరవేర్చాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, జిల్లా బీసీ, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆశన్న, యాదయ్య, డీటీఓడీ కలీం, సీపీఓ డాక్టర్ సురేందర్, బీసీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

కమిటీలు కాలయాపనకా?

● పారిశుధ్యం, ప్రకటనల విభాగంపై అడ్‌హాక్ కమిటీలు
● ఐదు నెలల క్రితం ఏర్పాటు
● రేపు కౌన్సిల్ అనగా ఆగమేఘాలపై సభ్యుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): మెరుగైన పారిశుధ్య నిర్వహణ.. ప్రకటనల విభాగం ఆదాయం పెంపునకు సూచనల కోసం నియమించిన అడ్‌హాక్ కమిటీలు కాలయాపన కమిటీలుగా మారాయి. ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చైర్‌పర్సన్‌గా ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లతో కమిటీలు వేశారు. ఇప్పటికే నిర్మాణాత్మక సూచనలు రాలేదు. రేపు కౌన్సిల్ మీటింగ్ జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆగమేఘాలపై సభ్యుల సమావేశమయ్యారు. అడ్‌హాక్ కమిటీలు ఏం చేశాయని కౌన్సిల్‌లో సభ్యులు ప్రశ్నించే అవకాశముందని భావించి ఉన్నపళంగా సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. దీంతో ముందుగా నిర్ణయం చుకున్న వివిధ పనులతో బిజీగా ఉన్న కొందరు సభ్యులు గైర్హాజరయ్యారు. ఫిబ్రవరి 19న కౌన్సిల్ సమావేశంలో ప్రకటనలు, పారిశుధ్య విభాగంపై అడ్‌హాక్ కమిటీలు వేశారు. మీటింగ్ జరిగిన దాదాపు నెల అనంతరం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ లోపు కమిటీల సమావేశం జరుగలేదు. జూన్ 6న కోడ్ ఎత్తివేసిన కూడా నెల కావస్తోంది. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న కమిటీ సభ్యులు.. రెండు రోజుల్లో కౌన్సిల్ మీటింగ్ ఉండగా సమావేశమై తూతూమంత్రంగా చర్చించడం గమనార్హం.

పారిశుధ్యంపై...

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన వేర్వేరుగా కమిటీ సమావేశాలు జరిగాయి. పారిశుధ్య నిర్వహణపై సభ్యులు పలు సూచనలు చేశారు. స్వచ్ఛ ట్రాలీలు ఇంటింటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, చెత్త సేకరణ, తొలగింపులో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, యంత్రాలతో రహదారుల స్వీపింగ్ చేయాలని బీజేపీ సభ్యుడు శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. రోడ్ల పక్కన వేస్తోన్న చెత్తను క్రమం తప్పకుండా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంఐఎం సభ్యుడు సయ్యద్ సోహెల్ ఖాద్రీ అన్నారు.

ప్రకటనల విభాగంపై...

ప్రకటనల విభాగం ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. యాడ్ ఏజెన్సీల నుంచి ఆదాయం పొందుతోన్న ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ జీహెచ్ఎంసీకి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి సూచించారు. టెండర్ నిబంధనలు సవరిస్తూ కొత్త ఏజెన్సీలకు అవకాశమివ్వాలని కోరారు. సంచార వాహనాలపై ప్రకటనలకు అనుమతి ఉందా? అని ఎంఐఎం సభ్యుడు మినాజుద్దీన్ అధికారులను అడిగారు.

కేసు విచారణలో నిర్లక్ష్యం చూపిన

ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్

● ఆదేశాలు జారీ చేసిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాంగోపాల్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మహంకాళి ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఇద్దరు ఎస్సైలపై సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వేటు వేశారు. మహంకాళి పోలీస్‌స్టేషన్‌కు 2023లో కావేటి శ్రీనివాసులు ఇన్‌స్పెక్టర్‌గా, రాకేష్, భాస్కర్ ఎస్సైలుగా పనిచేశారు. ఈ సందర్భంలో చంద్రశేఖర్ కాంప్లెక్స్‌లో ఓ దుకాణం వివాదంలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ కేసులో ఇన్‌స్పెక్టర్‌తోపాటు, ఎస్సైలు ఓ పక్షం వైపు ఉండి సరిగా దర్యాప్తు చేయలేదని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపించారు. విచారణలో పోలీసు అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. దాంతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సైలు రాకేష్, భాస్కర్‌లను సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కావేటి శ్రీనివాసులు ఈస్ట్‌జోన్ ఎస్‌బీ విభాగంలో, ఎస్సై భాస్కర్ చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా, మరో ఎస్సై రాకేష్ చాలా కాలంగా సిక్ లీవ్‌లో ఉన్నారు.

కిడ్నాప్ అయిన చిన్నారి చైల్డ్‌హోంకు

● కాపాడిన పోలీసులు
● నిందితులకు రిమాండ్


దుర్గ

రెజిమెంటల్‌బజార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భిక్షాటనకు వెళ్లి అదృశ్యమైన మూడేళ్ల చిన్నారిని కాపాడిన పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రామచందర్ తెలిపిన వివరాల ప్రకారం. మహారాష్ట్రకు చెందిన నంద ఉత్తమ్‌పవార్ భర్త మృతిచెందడంతో నలుగురు పిల్లలను తీసుకుని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. రోజు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో యాచించి రైల్వేస్టేషన్ పుట్‌పాత్‌పై నిదిరిస్తుంటారు. జూన్ 26న రోజు మాదిరిగానే ముగ్గురు పిల్లలను భిక్షాటనకు పంపిన తల్లి చిన్న పాపను తన దగ్గర ఉంచుకుంది. భిక్షాటనకు వెళ్లిన ముగ్గురిలో ఇద్దరు తిరిగి రాగా, మూడు సంవత్సరాల దుర్గ రాకపోవడంతో తల్లి మార్కెట్ పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై మమత మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మార్కెట్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పాప కిడ్నాప్‌నకు గురైనట్టు గుర్తించారు. కిడ్నాప్ చేసిన వల్లాపు జిల్లా దాచపల్లికి చెందిన మల్ల గంగమ్మ ఆమె కూతురు అడ్డగుట్టలో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న పాపను చైల్డ్‌హోంకు తరలించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

హాష్ ఆయిల్‌ను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

● 1.275 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ, ఒడిషా నుంచి నగరానికి గంజాయి, హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సౌత్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బేగంబజార్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ఒడిషా కోరాపూర్ జిల్లా పొట్టంగి గ్రామానికి చెందిన చందన్‌కుమార్ చౌదరి అలియాస్ దినేష్ అలియాస్ అనిల్(34) దమ్మాయిగూడలో ఉంటున్నాడు. ఇతను ఒడిషా నుంచి హాష్ ఆయిల్ కొనుగోలు చేసి ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అంతారుగూడకు చెందిన కొర్రా బాబు అలియాస్ డేవిడ్(30), విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన యద్దనపూడి వనరాజ్(27)లకు సరఫరా చేస్తున్నాడు. వీరు ముగ్గురు కలిసి నగరంలో ఉన్న వినియోగదారులకు హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు. వీరు ముగ్గురు ఒడిషా నుంచి 1.27 కిలోల హాష్ ఆయిల్ కొనుగోలు చేసి, బైక్‌పై నగరంలోని నాంపల్లి గాంధీభవన్ ప్రాంతంలో విక్రయించేందుకు వెళ్తుండగా సమాచారమందుకున్న సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బేగంబజార్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 7.65 లక్షల విలువైన 1.27 కిలోల హాష్ ఆయిల్, బైక్, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.


నగరంలో రెండు రోజులు యూరాలజీ సదస్సు

● మూత్రనాళ పునర్నిర్మాణాలపై లైవ్ సర్జరీలు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యూరాలజీ సమస్యలు, ఆధునిక వైద్య ప్రక్రియలపై నగరంలో రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించనున్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు రెండో ఎడిషన్ శని, ఆదివారాల్లో జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జెఆర్‌సీ కన్వెన్షన్ అండ్ ట్రేడ్ ఫెయిర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు యూకే, మెక్సికో, గల్ఫ్ దేశాలు, ఆఫ్రికా, నేపాల్, బంగ్లాదేశ్, ఆగ్నేయాసియా దేశాలతో సహా.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ సదస్సులో 24 లైవ్ సర్జరీలు ప్రదర్శిస్తారు. మూత్రనాళ పునర్నిర్మాణంలో కొత్త టెక్నిక్‌లు ఇక్కడ నేర్చుకోవచ్చని, మూత్రాశయ సమస్యల వివిధ పిల్లలు, పురుషులు, మహిళల్లో ఎలా చేయాలనే విధానాలను చూపిస్తారని సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్టు, ఆండ్రాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్‌గంటి తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించడం సదస్సు ప్రధాన లక్ష్యమని వివరించారు.

బ్రాండెడ్ పేరుతో నకిలీ మందుల తయారీ

● స్థావరంపై పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడి
● రూ. 50లక్షల ముడిసరుకు, పరికరాల స్వాధీనం
● నిందితుల్లో ఇద్దరి అరెస్ట్ పరారీలో ఒకరు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అబాట్ కంపెనీ బ్రాండ్ పేరుతో నకిలీ మందులు తయారు చేస్తున్న గోదాంపై డ్రగ్స్ కంట్రోల్, మేడ్చల్ ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి రూ.50లక్షల విలువ చేసే సామగ్రి, మందులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా ఒకరు పరారయ్యారు. గురువారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. ములుగు జిల్లా, వెంకటాపురం మండలం, పరకలపల్లి గ్రామానికి చెందిన గన్నినేని గోపాల్(42) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి మధురానగర్, సాయిబాలాజీ హైట్స్‌లో నివాసం ఉంటున్నాడు. 2001లో కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్ పారిశ్రామికవాడలో హరిణి ప్లాస్టిక్ మౌల్డింగ్ పరిశ్రమను స్థాపించాడు. కొవిడ్ సమయంలో నష్టం వచ్చింది. ఈ సమయంలోనే ఢిల్లీకి చెందిన నిహార్ పరిచయమయ్యాడు. ఢిల్లీ నుంచి గ్రాన్యులేటెడ్ ట్యాబ్లెట్స్, ప్యాకింగ్ మెటీరియల్స్, లేబుల్స్ తదితర వస్తు సామగ్రిని పంపిస్తానని, తనకు ప్యాకింగ్ చేసి ఇవ్వాలని తెలిపాడు. అందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తానని తెలిపాడు. అంగీకరించిన గోపాల్ జగద్గిరిగుట్టలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, అంబాజీపేట్, ఫ్లెక్సీకూర ప్రాంతానికి చెందిన బొక్కా రామకృష్ణ(40)ను బిజినెస్ పార్టనర్‌గా చేర్చుకున్నాడు. దూలపల్లి గ్రామంలోని సెయింట్‌మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని నిర్మానుష్య స్థలంలో ఉన్న గోదాంను అద్దెకు తీసుకున్నారు. అందులో ఢిల్లీ నుంచి నిహార్ బ్రాండెడ్ అబాట్ కంపెనీ పేరుతో పంపుతున్న ఎపిలెప్సీ వ్యాధి నివారణకు ఉపయోగించే 'ఎపిటాయిన్ ట్యాబ్లెట్లు', నార్‌ఫ్లోక్సాసిన్ ట్యాబ్లెట్లు పంపుతుండటంతో పాటు, వాటి తయారీ కోసం వాడే పరికరాలను ప్రైవేట్ రవాణా ద్వారా దూలపల్లికి తరలించి చేసుకున్నారు. పథకం ప్రకారం.. గత ఆరు నెలలుగా ట్యాబ్లెట్స్ కోడింగ్‌తో పాటు నకిలీ ఔషధాలను తయారు చేసి, తిరిగి ఢిల్లీలోని నిహార్‌కు తరలిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు...

దూలపల్లిలో కొనసాగుతున్న నకిలీ మందుల గోదాంపై విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి, డ్రగ్ కంట్రోల్ జనరల్ డైరెక్టర్ కమలహాసన్ ఆదేశాల మేరకు సోదాలు చేశారు. నకిలీ మందులు తయారీకి ఉపయోగిస్తున్న ముడిసరుకుతో పాటు, మిషనరీని, తయారు చేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఔషధాలను ల్యాబ్‌కు తరలించారు. రూ.25 లక్షల విలువ చేసే ముడిసరుకు, రూ. 25 లక్షల విలువచేసే పరికరాలను సీజ్ చేసి, నిందితులపై నూతన చట్టం ప్రకారం సెక్షన్ 338, 336, 318, 340, 277, 278, రెడ్‌విత్ 49 డీఎన్ఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు నిహార్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీలు శోభన్ కుమార్, నర్సింహారెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఎస్‌ఓటీ సీఐ శ్యామ్ సుందర్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హేమలత, ఎస్సైలు దుర్గేష్, రోహిత్, సిబ్బంది ఉన్నారు.

నేడు మనం దర్శిస్తున్న జగన్నాథ, బలదేవ, సుభద్రా రూపాలు... వారివారి మహాభావ ప్రకాశ తత్త్వానికి ప్రతిరూపాలు. దేవశిల్పి అయిన విశ్వకర్మ... వారి రూపాలను ఇలా ప్రత్యేకమైన ఆకృతిలో మలచడం కూడా ఆ జగన్నాథుడి సంకల్పమే. దీనికి కారణాలు 'స్కాంద పురాణం'లోని 'ఉత్కళకాండ'లో ఉన్నాయి.





అమ్మ అభయం కోసం...



7 నుంచి బోనాల ఉత్సవాలు

ఘనమైన గ్రామీణ, సాంస్కృతిక వారసత్వం కలిగిన తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలూ ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే వేడుక బోనాల పండుగ. దీన్ని 'ఆషాఢ జాతర' అని కూడా అంటారు. ఆషాఢమాసంలోని మొదటి ఆదివారం లేదా గురువారం బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వర్షాలు మొదలై, పంటలు వేసే కాలంలో... ఎలాంటి విపత్తులూ ఎదురుకాకుండా చూడాలనీ, సమృద్ధిగా పాడి ఇంటికి చేరాలనీ అమ్మవార్లను రైతులు ప్రార్థిస్తారు. వర్షాకాలం కాబట్టి వ్యాధులు ప్రబలకుండా కాపాడాలని ప్రజలు గ్రామ దేవతలకు మొక్కుకుంటారు. ఏటా ఆషాఢ మాసంలో గ్రామదేవతలు తమ పుట్టిళ్ళకు వస్తారని ప్రజల విశ్వాసం. వారిని ఆహ్వానించి, నివేదనలు సమర్పించి, కోరికలు కోరుకొని, మొక్కులు చెల్లించుకొనే సందర్భమే... నెల రోజుల బోనాలు పండుగ. కాకతీయ రాజులు కాకతీమాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారనీ, అవే క్రమంగా బోనాలు వేడుకలుగా రూపుదిద్దుకున్నాయనీ అంటారు. నూట యాభై ఏళ్ళ కిందట ప్లేగు వ్యాధి హైదరాబాద్ నగరాన్ని కల్లోలపరచినప్పుడు... తమను ఆ మహమ్మారి బారి నుంచి కాపాడాలని వేడుకుంటూ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారని తెలుస్తోంది. నాటి నుంచీ బోనాల సంబరాలకు హైదరాబాద్ చిరునామాగా మారింది.

వేడుక

ఎప్పుడంటే...

జూలై 7న: గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం

జూలై 21న: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు

జూలై 22న: రంగం, భవిష్యవాణి

జూలై 28న: పాతబస్తీ (లాల్ దర్వాజా) బోనాలు

జూలై 29న: ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు

కుతుబ్‌షాహీ పాలకుడు తానీషాకు మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నలు గోల్కొండ కోటలో నిర్మించిన జగదాంబిక ఆలయంలో బోనాల ఉత్సవాలకు ప్రతి సంవత్సరం అంకురార్పణ చేయడం ఆనవాయితీ. రథోత్సవంతో, తొట్టెల ఊరేగింపుతో అమ్మవారి విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చి, తొలి పూజ చేస్తారు. దీనితో ఉత్సవాలు మొదలవుతాయి. బోనాల సమర్పణ మరో ప్రధానమైన వేడుక. బోనం అంటే అమ్మవారికి నివేదించే అన్నం. చిత్రాన్నం, బెల్లం పొంగలి లాంటి రకరకాల వివిధ పదార్థాలను మహిళలు తయారు చేస్తారు. వాటిని పాత్రల్లో ఉంచి, చుట్టూ వేపమండలు కట్టి, ఆ పాత్రపైన మూతలో దీపం వెలిగిస్తారు. ఆ పాత్రలను తలపై ధరించి, ఆలయాలకు చేరుకుంటారు. అమ్మవారిని ప్రార్థించి, బోనాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నుంచి కాపాడాలంటూ అమ్మవారికి వేప కొమ్మలను సమర్పిస్తారు. అలాగే తమ ఇళ్ళ నుంచి తెచ్చిన పదార్థాలను భక్తులు బండిపై ఉంచి, ఆలయానికి తీసుకువస్తారు. దీన్ని 'ఫలహారపు బండి' అంటారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాక, ఆ పదార్థాలను అమ్మవారికి నివేదిస్తారు. బోనాల ఉత్సవాల్లో మరో ఆకర్షణ పోతురాజు. పోతురాజును అమ్మవారి సోదరుడిగా భావిస్తారు. ఆలయ ఆవరణల్లో, వీధుల్లో పోతురాజు వేషధారులు చేతిలో కొరడాతో వీరంగం వేస్తారు. బోనాల సమర్పణ పూర్తయిన మరునాడు ఆలయం ఎదుట జరిగే రంగం సందర్భంగా... అవివాహిత అయిన మహిళ పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపిస్తారు. రాబోయే రోజుల్లో సంభవించే పరిణామాలను అమ్మవారే ఆ మహిళ ద్వారా ప్రకటిస్తారని భక్తులు నమ్ముతారు. రంగం ముగిసిన తరువాత బలిహరణం పేరిట అమ్మవారికి నివేదన ఉంటుంది. అనంతరం కలశాలనూ, అమ్మవారి చిత్రపటాలనూ అంబారీపై ఊరేగించి, ఘటాల నిమజ్జనతో అమ్మవారికి వీడ్కోలు చెప్పడంతో ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ ఏడాది జూలై ఏడవతేదీ ఆదివారం నాడు గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో బోనాలు ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఆ తరువాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలను నిర్వహిస్తారు.



అహంకారం... వివిధ కోణాలు

గీతాసారం

అహంకారం ('నేనే కర్తను' అనే భావన) అర్జునుణ్ణి ఆవహించిందనీ, అదే అతని విషాదానికి కారణమనీ శ్రీకృష్ణుడు గమనించాడు. అర్జునుడి అహంకారాన్ని విచ్ఛిన్నం చేయడానికీ, అంతరాత్మదాకా చేరుకోవడానికీ సమగ్ర బుద్ధిని ఉపయోగించాలని సలహా ఇచ్చాడు. అహంకారానికి అనేక రూపాలు ఉన్నాయి. గర్వం అహంకారంలో ఒక చిన్న భాగం. ఎవరైనా విజయం/గెలుపు/లాభం అనే ధ్రువాలలోంచీ వెళుతున్నప్పుడు.... ఆ అహంకారాన్ని అభిమానం అంటారు. ఎవరైనా నష్టం/వైఫల్యం/ఓటమి అనే బాధాకరమైన ధ్రువాలలోంచీ వెళుతున్నప్పుడు... ఆ అహంకారాన్ని నిరాశ/దుఃఖం/క్రోధం అంటారు. ఇతరులు 'సుఖం' అనే ధ్రువంలోంచి వెళుతున్నప్పుడు... మనలోని అహంకారం అసూయగా మారుతుంది. ఎవరైనా 'దుఃఖం' అనే ధ్రువంలో ఉంటే.. అప్పుడది మనలో సానుభూతిని కలిగిస్తుంది. మనం భౌతిక ఆస్తులను కూడబెడుతున్నప్పుడు, వాటిని పోగొట్టుకున్నప్పుడు కూడా ఇది ఉంటుంది. ఇది లోకంలో కర్మ చెయ్యడానికీ లేదా సన్యాసం స్వీకరించడానికీ ప్రేరేపిస్తుంది. సృష్టితో పాటు వినాశనానికి కూడా ఇదే కారణం. ఇది జ్ఞానంలోనూ ఉంది, అజ్ఞానంలోనూ ఉంది.



ప్రశంసలు అహంకారాన్ని పెంచుతాయి. విమర్శలు బాధ పెడతాయి. ఈ రెండు దశలూ మన భావాల్ని ఇతరులు తారుమారు చేయడానికి అనుకూలంగా మారుస్తాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే... ప్రతి భావోద్వేగం వెనుకా ఏదో రూపంలో అహంకారం ఉంటుంది. ఈ భావోద్వేగాలు మన బాహ్య ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అహంకారం మనల్ని విజయం వైపు, శ్రేయస్సు వైపు నడిపిస్తున్నట్టు కనిపించవచ్చు. కానీ అది తాత్కాలిక తృప్తి కోసం మాదక ద్రవ్యాలను తీసుకోవడం లాంటిది. 'నేను', 'నాది', 'నన్ను', 'నాకు' అనేవి అహంకారానికి కాళ్ళ లాంటివి. రోజువారీ సంభాషణలు, ఆలోచనల్లో ఈ పదాలను ఉపయోగించకుండా ఉండడం ద్వారా... అహంకారాన్ని చాలావరకూ బలహీనపరచవచ్చు. మనల్ని మనం ఒక ధ్రువ లక్షణంతో లేదా మరోదానితో గుర్తించాలని కోరుకున్నప్పుడు... అహంకారం పుడుతుంది. అందుకే అహంకారానికి చోటివ్వని నిర్వికల్ప స్థితిలో... సమత్వ భావాన్ని కలిగి ఉండాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు సూచించాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

హరేకృష్ణ

జగన్నాథ రథోత్సవం

జగదానందపర్వం...



7న శ్రీ జగన్నాథ రథోత్సవం

జగన్నాథుడు, సుభద్ర, బలదేవుడు తమతమ రథాల్లో ఆసీనులై... భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఊరేగింపుగా కదలివచ్చే మహోత్సవం శ్రీ జగన్నాథ రథయాత్ర. ఒడిశా రాష్ట్రంలోని అత్యంత పురాతనమైన శ్రీజగన్నాథుడి దివ్యధామం... జగన్నాథపురి (పూరీ) క్షేత్రంలో ప్రతి యేటా కన్నుల పండుగగా జరిగే వేడుక ఇది. పూరీ ప్రధాన ఆలయం నుంచి గుండీచా ఆలయం వరకూ కొనసాగే ఈ రథయాత్రలో... జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర... నందిఘోష, తాళధ్వజ, దేవదళన అనే తమతమ రథాలను అధిరోహిస్తారు. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు... జగన్నాథ రథయాత్రను యావత్ ప్రపంచానికీ పరిచయం చేశారు. ఆయన ప్రచార ప్రభావం వల్ల అనేక ఖండాల్లోని భక్తులు ఈ విశిష్టమైన రథయాత్రను ఏటా నిర్వహిస్తున్నారు.

భక్తుల కోసం కదలివచ్చే స్వామి...

జగన్నాథుడంటే... నంద మహారాజు పుత్రుడై అవతరించిన, సాక్షాత్తూ దేవదేవుడైన శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణుని నిత్య లీలల్లో పాలు పంచుకొనేందుకు వివిధ పాత్రల్లో అవతరించే ఆయన పరివ్యాప్త స్వరూపం... ఆయన సోదరుడైన బలదేవుడు, బలరాముడు లేదా బలభద్రుడు. సుభద్రమ్మ శ్రీకృష్ణుని సోదరి. జగన్నాథుడంటే సమస్త జగత్తుకూ నాథుడు. 'జగత్' అంటే 'కదిలేది' అని అర్థం. అది ఈ విశ్వాన్ని సూచిస్తుంది. అందుకే జగన్నాథుడంటే విశ్వానికంతటికీ ప్రభువు. వివిధ కారణాల వల్ల స్వామి కృపను పొందేందుకు ఆలయానికి రాలేకపోయిన వారిని సైతం కరుణించడం కోసం... ఏడాదికి ఒకసారి ఆ స్వామే స్వయంగా బయటకు వస్తాడు. ఈ విధంగా ఆయనను సేవించే గొప్ప అవకాశం ప్రతి ఒక్కరికీ లభిస్తుంది. భక్తియుత భావనతో చేసే ఈ సేవ... మోక్షదాయకమై... భగవద్ధామానికి చేరుస్తుంది. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'... అంటే "రథాన్ని అధిరోహించిన జగన్నాథుణ్ణి ఎవరైతే దర్శిస్తారో వారు పునర్జన్మ నుండి విముక్తిని పొందుతారు" అనే శాస్త్రవచనాన్ని.. లండన్ రథయాత్ర సందర్భంగా శ్రీల ప్రభుపాదుల వారు భక్తులందరికీ తెలియజేశారు. జగన్నాథుణ్ణి కీర్తిస్తూ ఆదిశంకరాచార్యులు ఎనిమిది శ్లోకాలతో రచించిన 'శ్రీజగన్నాథాష్టకం' సుప్రసిద్ధమైనది. "జగన్నాథుడు తన రథంపై వెళుతున్నప్పుడు... అడుగడుగునా ప్రార్థనలు, కీర్తనలు బిగ్గరగా వినిపిస్తాయి. వారి స్తోత్రాలను వింటూ అత్యంత ప్రసన్నుడైన ఆ జగన్నాథుడు... దయాసముద్రుడు, సమస్త లోకాలకూ నిజమైన స్నేహితుడు. అమృతోద్భవ సమయాన జన్మించిన ఆ లక్ష్మీదేవీ పతి అయిన జగన్నాథుడు నా కన్నుల ప్రయాణంలో ఎల్లప్పుడూ ఎదురుగా ఉండుగాక" అని ఆదిశంకరులు ప్రస్తుతించారు.

ఆ రూపాలు దైవ సంకల్పమే...

నేడు మనం దర్శిస్తున్న జగన్నాథ, బలదేవ, సుభద్రా రూపాలు... వారివారి మహాభావ ప్రకాశ తత్త్వానికి ప్రతిరూపాలు. దేవశిల్పి అయిన విశ్వకర్మ... వారి రూపాలను ఇలా ప్రత్యేకమైన ఆకృతిలో మలచడం కూడా ఆ జగన్నాథుడి సంకల్పమే. దీనికి కారణాలు 'స్కాంద పురాణం'లోని 'ఉత్కళ కాండ'లో ఉన్నాయి. ఒక రోజు సూర్యగ్రహణం సంభవించినవేళ... శ్రీకృష్ణుడు, బలరాముడు తమ సోదరి సుభద్రతోనూ... కుటుంబ, సపరివార సమేతంగానూ కురుక్షేత్రంలో పుణ్యస్నానాలు చేయడానికి ద్వారకనుంచి బయలుదేరి వెళ్ళారు. ఆ సమయంలో... బృందావనం నుంచి వచ్చిన నంద యశోదలు, రాధారాణి మొదలైన వ్రజవాసులందరినీ అక్కడ కలుసుకున్నారు. యాత్రికులందరూ తమతమ కుటీరాలను అక్కడ ఏర్పాటు చేసుకున్నారు. బలరాముని తల్లి అయిన రోహిణి తన కుటీరంలో... శ్రీకృష్ణుడి భార్యలకు శ్రీకృష్ణ, బలరాముల బృందావన బాల్య లీలలను వివరించడం మొదలుపెట్టింది. అటువైపు ఎవరూ రాకుండా చూడాలని సుభద్రను కాపలాగా ఉంచింది. ఇంతలో శ్రీకృష్ణుడు, బలరాముడు అక్కడికి వచ్చారు. లోపల జరుగుతున్నది వారికి సుభద్ర చెప్పింది. ముగ్గురూ ద్వారం దగ్గరే నిలబడి, రోహిణి చెబుతున్న విషయాలను వినసాగారు. గోపికలు, వ్రజవాసులతో కూడిన తమ బాల్య మధుర ఘట్టాలను విని బలరామకృష్ణులు పరవశించారు. వారి నేత్రాలు విశాలమయ్యాయి, శిరస్సు విస్తరించింది, కరచరణాలు లోపలికి చొచ్చుకుపోయాయి. వారిలోని అంతర్గతమైన మాధుర్య భావనలు... బాహ్యంగానూ వ్యక్తమై వారి శరీరాకృతులను మార్చేశాయి. వారిరువురినీ చూసిన సుభద్ర... అదే రీతిలో పారవశ్యానికి లోనయింది. ఆ దివ్యరూపాలను దర్శించిన నారదముని,... అదే రూపాల్లో ఈ లోకంలో కొలువు తీరాలని కోరగా... శ్రీకృష్ణుడు సమ్మతించాడు. ద్వారకాపురవాసులు శ్రీకృష్ణుణ్ణి ఐశ్వర్య భావనతో సేవిస్తే... బృందావన వ్రజవాసులు మాత్రం మాధుర్య ప్రేమ భావనలతో ఆరాధించారు. వారు చూసిన ఆ మధురప్రేమకు ప్రతిరూపాలై వెలిశారు జగన్నాథ, బలదేవ, సుభద్రలు. శ్రీకృష్ణుడి జన్మతిథి శ్రావణ బహుళాష్టమి అయినప్పటికీ... ఆనాడు కురుక్షేత్రంలో మహాభావ ప్రకాశ తత్త్వాన్ని వ్యక్తపరుస్తూ జగన్నాథుడిగా ఆయన ఆవిర్భవించిన... జ్యేష్ఠ పౌర్ణమినే... జగన్నాథుడి జన్మతిథిగా పరిగణించడం మరో విశేషం.



జగన్నాథ రథయాత్రలో ఎలా పాల్గొనాలి?

జగన్నాథుడి రథోత్సవం భగవంతుణ్ణి సేవించే సదవకాశాన్ని భక్తకోటికి అందిస్తుంది. రథంపై ఆసీనుడైన స్వామిని కనులారా దర్శించుకోవచ్చు. తాడును పట్టుకొని రథాన్ని లాగవచ్చు. వివిధ ధూప దీప హారతుల మధ్య దేదీప్యమానంగా వెలుగొందే స్వామిని వీక్షించవచ్చు. స్వామికి అమితానందం కలిగించే విధంగా నృత్య సంకీర్తనలు చేయవచ్చు.

రథం వెళ్ళే మార్గాన్ని శుభ్రపరచి, రంగురంగుల ముగ్గులతో అలంకరించవచ్చు. వివిధ రకాల పుష్పాలు, ఫలాలు, కొబ్బరికాయలు, రుచికరమైన మధుర పదార్థాలను స్వామికి నివేదించవచ్చు. భక్తిపూర్వకంగా చేసే సేవ ఏపాటిదైనా... అది మనల్ని ఆధ్యాత్మికంగా మరింత పురోగమింపజేస్తుంది. అటువంటి సేవాభాగ్యాన్ని ఏ విధమైన తారతమ్యాలూ లేకుండా ప్రతి ఒక్కరికీ అనుగ్రహిస్తున్న జగన్నాథుడు... పతితపావన సార్థక నామధేయుడు.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



మౌనంతో మేలుకొలుపు



10న అవతార్ మెహెర్‌బాబా 99వ మౌన వార్షికోత్సవం

మౌనంతోనే లోకానికి అద్భుతమైన సందేశాన్ని ఇచ్చిన కారణజన్ముడు అవతార్ మెహెర్‌బాబా. మానవరూపంలో వచ్చిన దేవదేవునిగా, తమ ఇంటి ఇలవేల్పుగా మన దేశంతోపాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎందరో ఆయనను ఆరాధిస్తున్నారు. వారిలో తెలుగువారు కూడా అసంఖ్యాకంగా ఉన్నారు. "నేను బోధించడానికి రాలేదు, మానవాళిని మేలుకొలపడానికే వచ్చాను. ఏదో ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని ఆశించికాదు, విశ్వమానవ కళ్యాణం కోసమే మౌనాన్ని పాటిస్తున్నాను. మౌనంగా ఉన్నప్పటికీ... ప్రతి ఒక్కరి హృదయంతో నిరంతరం... నేరుగా మాట్లాడుతూనే ఉన్నాను" అని ఆయన ప్రకటించారు. "నేను ప్రత్యేకంగా ఎలాంటి మతాన్నీ స్థాపించడానికి రాలేదు. అన్ని మతాలూ ఒక్కటేనని చాటి చెప్పడమే నా లక్ష్యం. ప్రేమే నా మతం. ప్రతి ఒక్కరిలోనూ భగవంతుడు ఉన్నాడు. కాబట్టి ఎవరినీ నొప్పించేలా మాట్లాడవద్దు" అని చెప్పారు. "కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవ. 'నేను, నాది, నాకు' అనే భావనకు దూరంగా ఉంటూ, నిస్వార్థంగా చేసే సేవ ద్వారా మాత్రమే భగవంతుడికి ఎవరైనా చేరువవుతారు. అన్నిటిలోనూ క్షమాగుణమే ఉదాత్తమైనది" అని స్పష్టం చేశారు. ఆయన మాటలు ఆచరణకు కష్టంగా అనిపించవచ్చు. కానీ అసాధ్యం కాదని ఆయన అనుయాయులు రుజువు చేశారు. 1925 జూలై 10వ తేదీ నుంచి... 1969 జనవరి 31న శరీర త్యాగం చేసేవరకూ... అంటే నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన మౌనంలోనే ఉన్నారు. మెహెర్‌బాబా మౌన దీక్ష ప్రారంభించేనాటికి... ఆయన వయసు కేవలం 30 సంవత్సరాలే.

మౌనం, ఉపవాసం, ఏకాంతవాసం...

తన అనుయాయులను కూడా... తాను మౌనదీక్షను ప్రారంభించిన రోజున (జూలై 10న)... మౌనం పాటించాల్సిందిగా మెహెర్‌బాబా ఆదేశించారు. ఇది తన ఆధ్యాత్మిక ప్రణాళికలో వారిని భాగస్వాములను చేయడం కోసమేనని చెప్పారు. "మౌనంగా ఉన్న సమయంలో మనస్సును కట్టడి చేయండి. నోరు మాట్లాడకుండా ఉన్నా... మనస్సు అనేక ఆలోచనలతో గగ్గోలు పెడుతూనే ఉంటుంది. మనస్సులో వచ్చే ఆలోచనలను అదుపు చేయడం కష్టమే. కనీసం... నిరంతరాయంగా వచ్చే ఆలోచనలను పట్టించుకోకుండా... మౌనంగా ఉంటూ భగవన్నామస్మరణ చేయండి. మీ నోటినుంచి వచ్చే మాటల కన్నా... హృదయం నుంచి వెలువడే భాషనే భగవంతుడు ఆలకిస్తాడు" అని తెలిపారు. ఆయన తన జీవితంలో మౌనంతో పాటు... ఎక్కువ రోజులు ఉపవాసాన్నీ, ఏకాంతవాసాన్నీ పాటించారు. ముఖ్యంగా... తన జీవితకాలంలోని చివరి నాలుగు సంవత్సరాలు అత్యంత కఠినమైన ఏకాంతవాసం గడిపారు. అప్పటికే బాబా శరీరంలో కుడి, ఎడమ భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరోగ్యం బాగా క్షీణించింది. "ఆయన కనీసం గాలి కూడా ప్రవేశించడానికి వీలు లేకుండా... తన గదిలో తలుపులు, కిటికీలు అన్నీ మూసుకొనేవారు. మేము ఆ గదికి తాళం వేసేవాళ్ళం. ఏకాంతవాస సమయంలో యావత్ ప్రపంచం తనకు దగ్గరగా ఉంటుందని బాబా స్వయంగా చెప్పారు" అని ఆయనకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ వెల్లడించారు. "మెహెర్‌బాబా స్వీయ ఆచరణ ద్వారా నిత్య జీవన సరళిని మాకు తెలియజేశారు. జీవన సత్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకొనేలా చేశారు. 'అందరిలో పరమాత్మ ఒక్కడే' అనే విషయాన్ని ఎన్నో సందర్భాలలో అనేక విధాలుగా అర్థమయ్యేలా చేశారు. ఇదే విధంగా చేయాలని బాబా మమ్మల్ని ఎన్నడూ నియంత్రించలేదు. మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ప్రతిదీ దైవానుగ్రహం వల్లనే జరుగుతోందనే చింతనతోనే ఏ కార్యాన్నయినా చెయ్యాలని ప్రబోధించారు" అంటూ బాబాతో తనకున్న అనుభవాలను ఒక అమెరికన్ భక్తుడు తెలియజేశారు.

మహిమలు చెయ్యనన్నారు కానీ...

"నేను ఎన్నడూ మహిమల్ని చెయ్యను" అని మెహెర్‌బాబా పలుమార్లు ప్రకటించారు. అయితే బాబా ప్రతిక్షణం తమకు ఊపిరికన్నా దగ్గరగా ఉంటారనీ, కంటికి రెప్పలా ఆదుకుంటారనీ పలువురు భక్తులు చెబుతారు. అలాంటి ఒక వాస్తవ సంఘటన... ఇది అరవయ్యేళ్ళ నాటి సంగతి. హైదరాబాద్‌కు చెందిన ముత్తనపల్లి శ్రీనివాస తేజస్వికి... పుట్టిన పదినెలలకే తీవ్రమైన జ్వరం వచ్చింది. పోలియో సోకి... రెండు చేతులూ, కాళ్ళూ చచ్చుబడిపోయాయి. అతని తండ్రి హైకోర్టులో పెద్ద పేరున్న వకీలు. ఆయన స్థితిమంతుడు కావడంతో... కుమారుణ్ణి ప్రముఖ వైద్యులందరికీ చూపించారు. హోమియో వైద్యంతో నయమవుతుందంటే జర్మనీ కూడా వెళ్ళారు. ప్రతి దేవుడికీ మొక్కారు. కానీ ఫలితం లేకపోవడంతో... తమ కుమారుడికి నయమవుతుందనే ఆశ వదులుకున్నారు. ఆ సమయంలోనే మెహెర్‌బాబా గురించి తెలిసింది. ఆఖరు ప్రయత్నంగా... పుణేలో బాబాను దర్శించుకున్నారు. అప్పటికి మూడేళ్ళున్న ఆ పిల్లవాణ్ణి బాబా తన చేతుల్లోకి తీసుకున్నారు. అతను బాబా గుండెలమీద కొన్ని క్షణాలు ఆడుకున్నాడు. తరువాత హుషారుగా... ఆరోగ్యవంతుడిలా నడుస్తూ వెళ్తాంటే... అతని తల్లితండ్రులు తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. "బాబా మహిమలు చెయ్యనని చెప్పారు. కానీ 'అన్యథా శరణం నాస్తి' అనే స్థితిలో... నన్ను ఆదుకున్నారు" అని అరవై రెండేళ్ళ తేజస్వి చెబుతారు. "నాకు చిన్నప్పుడు పోలియో ఉండేదని వైద్యులకు చెబితే... "మీ శరీరంలో దానికి సంబంధించిన గుర్తులేవీ లేవ"ని ఆశ్చర్యపడుతూ ఉంటారు" అని ఆయన అంటారు.

బాబా సమాధి...

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు అయిదు కిలోమీటర్ల దూరంలో మెహెర్‌బాబా సమాధి ఉంది. 1938 నాటికే... బాబా స్వీయ పర్యవేక్షణలో అది పూర్తయింది. ఆ సమాధి ప్రాంగణం నిరాడంబరతకు నిర్వచనంలా ఉంటుంది. అర్చక స్వాములు కానీ, పూజలు, హారతులు, కర్మకాండల్లాంటివేవీ అక్కడ ఉండవు. దర్శనం టిక్కెట్లు, విరాళాల కోసం హుండీలు కనిపించవు. అది అరుదైన ప్రశాంతత కలిగి నిశ్శబ్ద ప్రార్థనా ప్రాంగణం. సమాధికి సుమారు అర కిలోమీటరు దూరం నుంచి మౌనం రాజ్యమేలుతూ ఉంటుంది. మెహెర్‌బాబాను భౌతికంగా దర్శించుకొనే సందర్భంలో... సందర్శకుల మనసు ఆర్ద్రమయ్యేదనీ, దుస్తులు తడిసిపోయేలా కన్నీరు చెక్కిళ్ళపై కారుతూ ఉండేదనీ భక్తులు గుర్తు చేసుకుంటూ ఉంటారు. సమాధిని దర్శించుకొనే చాలామంది కూడా అదే అనుభూతిని అనుభవిస్తున్నామని చెబుతారు. ఏడాది పొడుగునా... రోజూ ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది వరకూ బాబా సమాధిని దర్శించుకోవచ్చు.


• మల్లాది కృష్ణానంద్, 99595 53218

ధర్మపథం

ప్రపంచం ఒక మాయాజాలం

మన రాష్ట్రంలో జన్మించిన ఆచార్య నాగార్జునుడు తన నిశితమైన తార్కిక మేధస్సుతో పదునైన దార్శనిక, సైద్ధాంతిక వ్యూహాలను సృష్టించాడు. "ఈ ప్రపంచమంతా ఒక మాయాజాలం" అని ఆయన అన్నాడు. కలలలో కనిపించే వస్తువుల ఉనికి మాదిరిగా... ఈ ప్రపంచంలోని అన్ని వస్తువుల ఉనికి ఊహాజనితమే. మనం మేలుకొని ఉన్నప్పుడు కూడా కలలు కంటాం. అలాగే ఈ ప్రపంచాన్ని విశ్లేషిస్తే... అందులో ఏమీ లేదని తెలుస్తుంది. ప్రపంచం నిత్యం పరివర్తన చెందుతూ ఉంటుంది. ఇది ఏమాత్రం శాశ్వతం కాదు... ఇవీ ఆయన ప్రతిపాదనలు. "మరి కనిపించే ప్రపంచం మాట ఏమిటి? యదార్థమైన ఈ ప్రపంచంలో ఉంటూ, దాన్ని అనుభవిస్తూ, దాని అస్తిత్వాన్నే ఒప్పుకోకపోవడం సముచితమా?" అని కొందరు ప్రశ్నించవచ్చు. ప్రపంచం ఉన్నదనే మాట సత్యమే. కానీ అది పారమార్థికంగా లేదు. అందుకే ఆచార్య నాగార్జునుడి సిద్ధాంతానుసారం సత్యం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి: సంవృతి సత్యం... అంటే ఉపరితల సత్యం. రెండోది: పరమార్థ సత్యం... అంటే అంతిమ సత్యం. పారమార్థికంగా చూస్తే 'ఈ ప్రపంచమంతా ఒక మాయాజాలం' అని తెలుస్తుంది. ఇంతకుముందు చెప్పినట్టు... కలలో కనిపించే వస్తువుల్లా... ఈ ప్రపంచం ఊహాజనితం. ఈ ద్వివిధ సత్య సిద్ధాంత ప్రతిపాదనలో నాగార్జునుడు కీలక పాత్రను పోషించాడు. ఆ తరువాత మిగిలిన అద్వైతాది తాత్త్వికులు ఈ సిద్ధాంతంపై తమ జగన్మిథ్యావాదాన్ని నిర్మించారు.

ఈ ప్రపంచం ఏమిటి? ఇది కేవలం అసంపూర్ణ సంబంధాల సమాహారం. పదార్థాలకు వాటి గుణాలు తప్ప స్వతంత్రమైన ఉనికి లేనట్టే... ఈ ప్రపంచం కూడా కేవలం సంస్కారాల కలయిక మాత్రమే. ఈ లోకంలో సుఖం, దుఃఖం, బంధం, మోక్షం, ఉత్పత్తి, వినాశం, చలనం, విశ్రాంతి, అంతరిక్షం, సమయం లాంటివి మన భావనలు మాత్రమే. మానవులు తమ అశాశ్వత సౌధాన్ని నిర్మించడం కోసం సృష్టించిన నిరాధారమైన ఊహ ఈ ప్రపంచం. ప్రపంచం బయటకు శాశ్వతంగా కనిపిస్తున్నా తార్కికంగా విశ్లేషించినప్పుడు అబద్ధమని తేలుతుంది. ప్రపంచంలోని ఈ సంబంధ బాంధవ్యాలు ఏదో ఒకనాడు ఇసుకలాగా రాలిపోతాయి. అయితే సమాజంలో సత్ప్రవర్తన చాలా అవసరం. ఆ సత్ప్రవర్తనే మోక్షాన్ని ప్రసాదిస్తుంది. దాని



కోసం సమాజాన్ని మనం నిలబెట్టాలి. ఈ విషయాలను 'మాధ్యమిక కారిక' గ్రంథంలో ఆచార్య నాగార్జునుడు చాలా స్పష్టంగా వివరించాడు. జగత్తు శక్తిని పరీక్ష చేసి, ఆ శక్తి ఉనికిని విశ్లేషించిన తరువాత... అది శూన్యరూపంలో ఉంటుందనే నిర్ధారణకు మాధ్యమికులు వచ్చారు. సృష్టి ఆవిర్భావాన్ని సరైన విచక్షణతో విశ్లేషిస్తే... దాని ఉనికిని నిరాకరించడం కుదరదు. కానీ 'అంతా ఉంది' అనుకోవడం ఒక తీవ్రత. 'అన్నీ లేవు' అనుకోవడం మరో తీవ్రత. ఈ రెండు తీవ్రతలనూ విడిచిపెట్టి... మధ్యమ మార్గంలో తన ధర్మాన్ని తథాగతుడు బోధించాడు.



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు,
న్యూఢిల్లీ.
91 98189 69756

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 5 జులై 2024
cinema@andhrajyothy.com



జీబ్రా లుక్

టాలీవుడ్ హీరో సత్యదేవ్, కన్నడ కథానాయకుడు డాలీ ధనంజయ నటిస్తున్న మల్టీస్టారర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఎస్.ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేశ్ సుందరం నిర్మిస్తున్నారు. గురువారం సత్యదేవ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'జీబ్రా' నుంచి ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. పోస్టర్‌లో సత్యదేవ్ సూట్‌లో, భుజంపై బ్యాగ్, చేతిలో పెన్నుతో స్టైలిష్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. నిర్మాతలు త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్స్. సునీల్, సత్యరాజ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సత్య పొన్మార్. ఎడిటర్: అనిల్ క్రిష్

ప్రభాస్ చేతుల మీదుగా...



సుహాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకోగా.. గురువారం ప్రభాస్ చేతుల మీదుగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు' అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ, సంగీత్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: సాయిశ్రీరామ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అకుల్.

నటిగా మారుతున్న కంటెంట్ క్రియేటర్



యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్.. నటిగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే చిత్రంలో ఆమె నటిస్తున్నారు. గురువారం ఆమె పుట్టినరోజు సందర్భంగా గీతా ఆర్ట్స్ సంస్థ నిహారికకు విషెస్ తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని ప్రకటించింది. 'అందాల తార నిహారిక ఎన్.ఎమ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రేమతో మిమ్మల్ని టాలీవుడ్‌లోకి ఆహ్వానిస్తున్నాం. తెరపై మీ నటనను చూడడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నాము" అని పేర్కొన్నారు. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు మిలియన్లలో ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా



తెలుగు రియాలిటీ షోలలో కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేసిన తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 3 ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ షోలో రాబోయే ఎపిసోడ్‌కు టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ప్రోమోను మేకర్స్ సోషల్ మీడియాలో విడుదల చేయగా వైరల్ అయింది. మన తెలుగు కంటెస్టెంట్స్‌కు మద్దతు ఇవ్వాలి, మీ జర్నీలో ఉండాలని ఈ షోకు వచ్చాను అని విజయ్ చెప్పారు.



డబ్బింగ్ పనుల్లో విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ

గురువారం వస్తున్న శనివారం

నాని విభిన్న రకాల షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్‌జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29 గురువారం నాడు పాన్ ఇండియా లెవెల్లో విడుదలవుతోంది. ఇప్పటికీ విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్ అందరినీ ఆకట్టుకున్నాయి. గురువారం ఈ సినిమా నుంచి నాని పోషిస్తున్న క్యారెక్టర్ నుంచి మరో లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది వరకు రిలీజైన పోస్టర్స్‌లో యాంగ్రీ లుక్‌లో కనపడిన నాని.. ఈ పోస్టర్‌లో మాత్రం బైక్ నడుపుతూ చాలా కూల్ లుక్‌లో పక్కింటి అబ్బాయి తరహా పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, డీఓపీ: మురళి.జి





మన జీవితాల్లో సినిమాలు ఒక అంతర్భాగం. సినిమాలను.. వాటిలో నటించే నటీనటులను.. తీసే దర్శకులను విమర్శిస్తూ ఉంటాం. ప్రశంసిస్తూ ఉంటాం. మన ఇంట్లో మనుషులుగా చూసుకుంటూనే ఉంటాం. అలాంటి సినీ పరిశ్రమ పదేళ్లగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంది. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులదే! వీరిద్దరూ శుక్రవారం సమావేశమవుతున్న నేపథ్యంలో- దీర్ఘకాలంగా సినిమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో ఒకసారి పరిశీలిద్దాం.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమీటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలిసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్ని సార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా , ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.

చిన్న సినిమాలూ బతకాలి!

ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.


తెలుగు చలనచిత్ర పరిశ్రమ

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు రూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్ సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.




'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యముంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వీ.రామారావు, సినీ చరిత్రకారుడు

యాక్షన్ సీక్వెన్స్ చేశా

మాళ్వీ మల్హోత్రా

'తిరగబడరా సామి' లాంటి మంచి ఎంటర్‌టైనర్‌తో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాలో కథానాయికగా ప్రాధాన్యం ఉన్నపాత్ర చేశాను' అని మాళ్వీ మల్హోత్రా చెప్పారు. రాజ్ తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. మల్కాపురం శివకుమార్ నిర్మాత. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మాళ్వీ మల్హోత్రా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- మాది హిమాచల్ ప్రదేశ్. బుల్లితెరపై నా కెరీర్ మొదలైంది. హిందీ, మలయాళ, తమిళ చిత్రాల్లో నటించాను. 'తిరగబడరా సామి' నా తొలి తెలుగు చిత్రం. ఇందులో కథ నా పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అలాగే నాకో యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉంది. ఇలాంటి అవకాశం కెరీర్ ఆరంభంలోనే నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలు చూస్తుంటాను. ఇందులో నా పాత్ర కూడా ఆయనలా ఉన్నది ఉన్నట్లు మాట్లాడేస్తుంది.
- యాక్షన్, డ్రామా, రొమాన్స్, ఫన్... ఇలా చాలా ఎలిమెంట్స్ ఉన్నాయి. రాజ్ తరుణ్ పాత్ర ఆసక్తికరంగా ఉంటుంది. సైలెంట్‌గా మొదలై వైలెంట్‌గా మారుతుంది.
- రవికుమార్ గారు చాలా మంచి విజన్ ఉన్న డైరెక్టర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ నిర్మాత శివ గారు సెట్‌లో అందరినీ సొంత మనుషుల్లా చూసుకున్నారు.
- మణిరత్నం, రాజమౌళి సినిమాల్లో నటించాలనేది నా లక్ష్యం. మహేశ్‌బాబు, అడివిశేష్ అంటే ఇష్టం. నాని కళ్లతోనే అద్భుతమైన భావోద్వేగాలను పండిస్తారు.

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహా పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాణి, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్‌కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేశ్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు









ఒలింపిక్స్‌కు 28 మంది
భారత అథ్లెట్లు

న్యూఢిల్లీ: ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ప్లేయర్ల జాబితాను వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) విడుదల చేసింది. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్, ర్యాంక్‌ల ఆధారంగా రూపొందించిన లిస్ట్‌లో 28 మంది భారత అథ్లెట్లకు చోటు దక్కింది. కాగా, పారిస్ బెర్త్ పట్టేసిన 11 మంది మహిళల్లో తెలుగు ప్లేయర్లు జ్యోతి యర్రాజి, జ్యోతిక శ్రీ దండి కూడా ఉండడం విశేషం. లాంగ్ జంపర్ జస్విన్ ఆల్డ్రిన్‌కు కూడా కొంత ఆలస్యంగా ఈ జాబితాలో చేరే అవకాశం ఉంది. ఒలింపిక్ అర్హత మార్క్‌ను అందుకొన్న లాంగ్ జంపర్ శ్రీశంకర్ గాయపడడంతో.. అతడి స్థానంలో జస్విన్‌కు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అవకాశం కల్పించనుంది. 100 మీటర్ల హర్డిల్స్‌లో అర్హత సాధించిన తొలి భారత స్ప్రింటర్‌గా జ్యోతి ఘనత సాధించింది. మహిళల 4×400 రిలే జట్టులో జ్యోతికకు చోటు దక్కింది. జావెలిన్ త్రో వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా, కిశోర్ జనా నేరుగా అర్హత సాధించారు.

అథ్లెట్లతో మోదీ భేటీ: పారిస్ విశ్వ క్రీడల్లో తలపడే షూటర్లు, ఆర్చర్లు, ట్రాక్, ఫీల్డ్ అథ్లెట్లు, సహాయ సిబ్బందితో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం భేటీ అయ్యారు. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య, క్రీడా శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, పారిస్ బరిలో దిగుతున్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, రెండుసార్లు విశ్వక్రీడల పతక విజేత పీవీ సింధుతో మోదీ వర్చువల్‌గా సంభాషించారు.







వాంఖడేలో చిందులు

విశ్వ విజేత విజయయాత్ర

జనసంద్రంగా మారిన మెరైన్ డ్రైవ్
రోహిత్ సేనకు ఘనస్వాగతం
రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ బహూకరణ

వచ్చేశారు.. 13 ఏళ్ల విరామం తర్వాత దక్కిన వరల్డ్‌కప్‌తో సగర్వంగా టీమిండియా ఆటగాళ్లు భారత గడ్డపై అడుగుపెట్టారు.. ఇక క్రికెట్‌నే మతంగా భావించే క్రీడాభిమానులు ప్రశాంతంగా ఎలా ఉండగలరు? వయస్సుతో సంబంధం లేదు.. చిన్నా, పెద్దా తేడా లేదు.. ఓ అత్యద్భుత విజయంతో తమ హృదయాలను ఉప్పొంగించిన క్రికెట్ హీరోలకు అదే రీతిలో గ్రాండ్ వెల్కమ్ పలికారు. ముందుగా న్యూఢిల్లీ, ఆ తర్వాత ముంబై ఇలా ఎక్కడికి వెళ్లినా అపూర్వ స్వాగతంలో వారిని మైమరిపించారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలో రోహిత్ సేన ప్రధానిని కలిశాక.. విక్టరీ పరేడ్ కోసం సాయంత్రం ముంబైకి చేరుకుంది. అప్పటికే స్థానిక నారిమన్ పాయింట్ ఓ వైపు అరేబియా సముద్రం.. మరోవైపు అభిమాన జనసంద్రం అన్నట్టుగా మారిపోయింది. ఓపెన్ టాప్‌బస్‌లో సాగిన క్రికెటర్ల విక్టరీ పరేడ్ వాంఖడేలో ప్రేక్షకుల మధ్య భారీ నజరానా అందజేతతో ముగిసింది.



ముంబై: టీ20 ప్రపంచకప్ విజేత టీమిండియాకు భారత క్రికెట్ అభిమానులు నభూతో.. అనే రీతిలో స్వాగతం పలికారు. ఓ వైపు చిరుజల్లులు కురిసినా.. షెడ్యూల్ ప్రకారం ముంబైకి ఆటగాళ్ల రాక ఆలస్యమైనా గంటలకొద్దీ ఓపిగ్గా ఎదురుచూశారు. విక్టరీ పరేడ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు నారీమన్ పాయింట్‌లోని మెరైన్ డ్రైవ్ మధ్యాహ్నం నుంచే వేలాది మందితో కిక్కిరిసిపోయింది. వారిని చూసి చాంపియన్స్ జెర్సీ ధరించిన ఆటగాళ్లు సైతం తమ బడలికను మర్చిపోయి పులకించిపోయారు. సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా గురువారం రోజంతా టీమిండియా ఆటగాళ్లు ఊపిరి సలపని బిజీ షెడ్యూల్‌తో ఎలా గడిపారో ఓసారి పరిశీలిద్దాం..

రోహిత్, సూర్య బల్లె.. బల్లే

బార్బడోస్ నుంచి 16 గంటల నాన్‌స్టాప్ ప్రయాణం తర్వాత ఉదయం 6 గంటలకు జట్టు న్యూఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. అప్పటికే రాత్రి నుంచే వందలాది మంది అభిమానులు వారికోసం నిరీక్షిస్తూ కనిపించారు. ట్రోఫీతో కెప్టెన్ రోహిత్ విమానం నుంచి బయటికి రాగా బోర్డు కార్యదర్శి జైషా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికాడు. అక్కడే కేకును కట్ చేసి రెండు బస్సుల్లో ఆటగాళ్లంతా దారిపొడవునా అభిమానులకు అభివాదం తెలుపుతూ స్థానిక ఐటీసీ మౌర్య హోటల్‌కు చేరారు. ఈ క్రమంలో అక్కడ భాంగ్రా కళాకారులతో రోహిత్ కూడా సరదాగా నృత్యం చేస్తూ ఉత్సాహంగా కనిపించాడు. అతడితో పాటు సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, పంత్ కూడా జత కలిశారు.

వడాపావ్.. చోలే బటూరే

హోటల్ సిబ్బంది ఆటగాళ్ల కోసం ప్రత్యేక అల్పాహారాన్ని సిద్ధం చేశారు. ముంబైకర్ రోహిత్‌కు ఎంతో ఇష్టమైన వడా పావ్.. విరాట్‌కు నచ్చే అమృత్‌సర్ స్టయిల్ చోలే బటూరేని అల్పాహారంగా అందించారు. అలాగే ప్లేయర్ల గదులను అలంకరించడంతో పాటు చాక్లెట్‌తో బాల్స్, బ్యాట్, పిచ్‌ను తయారుచేశారు.

ప్రధానితో భేటీ

ప్రధాని మోదీతో సమావేశమయ్యేందుకు ఆటగాళ్లంతా ప్రత్యేక బస్సులో ఉదయం 11 గంటలకు 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌కు చేరుకున్నారు. దాదాపు 2 గంటల పాటు వీరి భేటీ సాగింది. అనంతరం హోటల్ నుంచి మధ్యాహ్నం ముంబైకి వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరారు.

ముంబై ఎయిర్‌పోర్ట్‌లో గార్డ్ ఆఫ్ ఆనర్

సాయంత్రం చిర్లు జల్లుల మధ్యే ముంబై ఛత్రపతి విమానాశ్రయంలో ఆటగాళ్లకు అపూర్వ స్వాగతం లభించింది. విస్తారా ఎయిర్‌క్రాఫ్ట్ రన్‌వేపై దిగగానే మూడు ఎస్కార్ట్ వాహనాలు గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికాయి. వీటి వెనకాల విమానం నెమ్మదిగా ముందుకు సాగింది. ఇక టెర్మినల్ దగ్గరకు రాగానే విమానానికి ఇరు వైపులా ఉన్న రెండు ఫైరింజన్లు వాటర్ సెల్యూట్ ఇచ్చాయి. ఆ తర్వాత విమానాశ్రయంలో కేక్ కట్ చేశాక రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ రోహిత్ బృందం బయటికి వచ్చింది.

జనసంద్రం

ముంబైలో ఆటగాళ్లు దిగడానికి గంటల ముందే అభిమానుల సంబరాలు ఆరంభమయ్యాయి. పరేడ్ జరిగే నారిమన్ పాయింట్ నుంచి వాంఖడే స్టేడియం వరకు కిలో మీటర్ దూరంలో ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో నిండిపోయింది. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు సైతం అక్కడ గుమిగూడి త్రివర్ణ పతాకాలను రెపరెపలాడించారు. ఇక ఉచిత ప్రవేశం కల్పించిన వాంఖడే స్టేడియం మధ్యాహ్నమే నిమిషాల వ్యవధిలో నిండిపోయింది.

ఉత్సాహంగా విక్టరీ పరేడ్

ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక బస్సులో హోటల్‌కు వెళ్లిన జట్టు కాస్త సేద తీరాక నారిమన్ పాయింట్‌లోని ఎన్‌సీపీఏ ఆఫీసుకు చేరుకుంది. షెడ్యూల్‌కన్నా రెండు గంటల ఆలస్యంగా రాత్రి 7.40కి అక్కడి నుంచి వాంఖడేకు విక్టరీ పరేడ్ ఆరంభమైంది. వేలాదిమంది అభిమానుల మధ్య గంటన్నరపాటు సాగింది. తమ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులకు అంతే ఉత్సాహంగా రోహిత్, విరాట్, హార్దిక్, సూర్యకుమార్, సిరాజ్, జడేజా ఇలా అందరూ అభివాదం చేస్తూ ఓపెన్ టాప్ బస్సులో ముందుకుసాగారు. ఇక రోహిత్, కోహ్లీ ఇద్దరూ కలిసి ఫ్యాన్స్‌కు ట్రోఫీని చూపించడంతో ఒక్కసారిగా మెరైన్ డ్రైవ్ హోరెత్తిపోయింది. అలాగే తమ అభిమాన క్రికెటర్లను సెల్‌ఫోన్లలో బంధించేందుకు వారు కూడా పోటీపడ్డారు.

వేలాదిమంది హర్షధ్వానాల మధ్య సాగిన పరేడ్ దాదాపు గంటన్నర తర్వాత వాంఖడే స్టేడియానికి చేరింది. అప్పటికే 34వేల మందితో నిండిన స్టేడియం చప్పట్లు, డీజే సాంగ్స్‌తో మార్మోగిపోయింది. ముంబై కా రాజా కౌన్?.. రోహిత్ శర్మ అంటూ నినాదాలు చేశారు. ఆ అద్భుత దృశ్యాన్ని చూసిన టీమిండియా ఆటగాళ్లు సైతం ఉప్పొంగిపోయారు. అంతే.. రెట్టించిన ఉత్సాహంతో కెప్టెన్ రోహిత్, విరాట్, హార్దిక్, సూర్య, అర్ష్‌దీప్, పంత్, జడేజా, శాంసన్, అక్షర్ తమ డ్యాన్స్‌తో ఫ్యాన్స్‌కు మరింత హుషారు తెచ్చారు.

ప్రైజ్‌మనీ

కప్ గెలవగానే భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ రూ.125 కోట్ల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. వాంఖడేలో ఇందు కోసం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్టేడియం మధ్యలో చిన్న వేదికను ఏర్పాటు చేసి మధ్యలో ఓ స్టాండ్‌పై టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీని ఉంచింది. ఆ తర్వాత బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జైషా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కలిపి రోహిత్ బృందానికి చెక్‌ను అందించారు. తర్వాత అందరూ కలిసి స్టేడియం చుట్టూ విక్టరీ ల్యాప్ తీసి భావోద్వేగాలతో అభివాదం చేస్తూ తమ సంబరాలను ముగించారు.

హార్దిక్.. హార్దిక్

వాంఖడేలో హార్దిక్ పాండ్యాకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. ఫైనల్లోనే కాకుండా టీ20 ప్రపంచకప్‌లో తను మెరుగైన ఆటతీరుతో విజయంలో కీలకమయ్యాడు. దీంతో ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో ఎక్కడైతే ఎగతాళికి గురయ్యాడో, అదే చోట హార్దిక్.. హార్దిక్ అని గర్వంగా పిలిపించుకోగలిగాడు.



చాంపియన్లతో సందడే సందడి..!

ప్రధానిని కలిసిన టీమిండియా 1అనుభవాలను గుర్తుచేసుకొన్న ప్లేయర్లు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్ చాంపియన్ టీమిండియా గురువారం ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. బార్బడోస్ నుంచి ఉదయమే ఢిల్లీ చేరుకొన్న రోహిత్ సేన.. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన 'చాంపియన్స్' జెర్సీ ధరించి ప్రధాని నివాసానికి వెళ్లారు. ఆయనతో కలసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సాధించిన భారత జట్టుకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. ఒకదశలో ఉత్కంఠకు లోనైనా.. అద్భుత పోరాటంతో విజేతలుగా నిలిచారని ప్రశంసించారు. సుమారు రెండు గంటలపాటు క్రికెటర్లతో గడిపిన మోదీ.. రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్, కోహ్లీ, రిషబ్ పంత్ ఇలా ప్రతి ఒక్క భారత ఆటగాడితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జోక్‌లకు క్రికెటర్లు పగలబడి నవ్వారు. ప్రధాని పంచ్ డైలాగ్‌లకు విరాట్ చేతులతో ముఖాన్ని దాచుకొని నవ్వుతూనే ఉన్నాడు. 'మన చాంపియన్లతో అద్భుతమైన సమావేశం. ఉదయం ఏడు గంటలకు వరల్డ్‌కప్ విన్నింగ్ టీమ్‌కు ఆతిథ్యం. టోర్నీ ఆసాంతం వారికి ఎదురైన అనుభవాల గురించి మాట్లాడుకోవడం గొప్ప జ్ఞాపకం' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. జట్టు సభ్యులతో దిగిన ఫొటోలను షేర్ చేశారు. గ్రూప్ ఫొటోలో ప్రధానికి ఇరువైపులా రోహిత్, ద్రవిడ్ నిలబడి ఉన్నారు. మిగతా ప్లేయర్లు కూడా మోదీ వ్యక్తిగతంగా తీయించుకొన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. భార్య సంజనతో ప్రధానికి కలసిన ఫొటోను బుమ్రా షేర్ చేశారు. ఈ సందర్భంగా బుమ్రా కొడుకు అంగద్‌ను మోదీ ఎత్తుకొన్నారు. తనను ఆత్మీయంగా ప్రధాని హత్తుకొన్న ఫొటోను కుల్దీప్ పోస్టు చేశాడు. ఇక, తల్లిదండ్రులతో కలసి మోదీతో దిగిన ఫొటోను అర్ష్‌దీప్ సింగ్ ఎక్స్‌లో పెట్టాడు. 'ప్రధాని మోదీని కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ గృహానికి మమ్మల్ని ఆహ్వానించినందుకు ధన్యవాదాలు' అని కోహ్లీ నెట్‌లో పోస్టు చేశాడు. ఆటగాళ్లతో మోదీ మాట్లాడుతున్న వీడియోను ప్రధాన మంత్రి కార్యాలయం షేర్ చేసింది.

మట్టి రుచి ఎలా ఉంది..

టోర్నీలో అద్భుత ప్రయాణం గురించిన అనుభవాలను పంచుకోవాలని మోదీ కోరారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ అనుభూతి ఎలా ఉందో చెప్పాలన్నారు. మ్యాచ్ నెగ్గిన తర్వాత రోహిత్.. బార్బడోస్ పిచ్ మట్టిని రుచి చూశాడు. ఆ సందర్భాన్ని ప్రస్తావిస్తూ 'మట్టి రుచి ఎలా ఉంది?' అని రోహిత్‌ను మోదీ అడిగారు. టోర్నీ ఆసాంతం పెద్దగా పరుగులు సాధించని కోహ్లీని ఫైనల్ గురించి ఎలా ఆలోచించావని ప్రశ్నించారు. ఇక, జట్టు క్లిష్టపరిస్థితిలో ఉన్నప్పుడు బ్యాటింగ్ ఆర్డర్‌లో రావడం ఎలా అనిపించిందని అక్షర్ పటేల్‌ను అడిగారు.



బహుమతిగా 'నమో' జెర్సీ

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా ప్రత్యేకంగా తయారు చేయించిన 'నమో నెం.1' జెర్సీని ప్రధానికి బహూకరించారు. రెండు వరల్డ్‌కప్‌లు సాధించాం అన్నట్టుగా రెండు స్టార్లు కూడా ముద్రించారు.

ట్రోఫీని పట్టుకోని మోదీ

ట్రోఫీతో కలసి భారత జట్టు దిగిన గ్రూప్ ఫొటోలో వరల్డ్ కప్ ట్రోఫీని ప్రధాని పట్టుకోక పోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. తనకు ఇరువైపులా ఉన్న రోహిత్, ద్రవిడ్ ట్రోఫీని పట్టుకొంటే.. మోదీ వారి చేతులను పట్టుకొన్నారు. నాదేమీ లేదు.. మీవల్లే ఈ గౌరవం, ఆనందం అని చాటి చెప్పడానికే మోదీ ఇలా చేసి ఉంటారని నెటిజన్లు అంటున్నారు.





స్వియటెక్ ముందంజ
వింబుల్డన్

లండన్ : ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్‌లో ముందంజ వేశాడు. మహిళల్లో టాప్ సీడ్ స్వియటెక్ మరో సునాయాస విజయం దక్కించుకోగా, ఐదో సీడ్ జెస్సికా పెగులా రెండో రౌండ్‌నుంచే తిరుగుముఖం పట్టింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ జొకో 6-3, 6-4, 5-7, 7-5తో స్థానిక యువ ఆటగాడు జాకబ్ ఫెర్న్‌లీపై విజయం సాధించాడు. ఇక దిమిత్రోవ్ (బల్గేరియా) 5-7, 6-7 (7), 6-4, 6-2, 6-4తో చెంగ్ (చైనా)పై గెలిచి మూడో రౌండ్ చేరాడు. అర్థర్ ఫిల్స్ (ఫ్రాన్స్)తో రెండో రౌండ్‌లో 6-7 (7), 4-6, 6-2, 6-6తో ఉన్న దశలో గాయంతో ఏడో సీడ్ హర్కాజ్ వాకోవర్ ఇచ్చాడు. మహిళల రెండో రౌండ్‌లో స్వియటెక్ 6-4, 6-3తో పెట్రా మార్టిక్‌ను వరుస సెట్లలో చిత్తు చేసింది. చైనాకు చెందిన అన్‌సీడెడ్ వాంగ్ షిన్ యూ 6-4, 6-7 (9), 6-1తో పెగులా (అమెరికా)కు షాకిచ్చింది.

యుకీ జోడీ శుభారంభం..బాలాజీ నిష్క్రమణ..

పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రి జోడీ బోణీ కొట్టింది. గురువారం జరిగిన మొదటి రౌండ్‌లో యుకీ/అల్బనో ఒలివేటి (ఫ్రాన్స్) ద్వయం 6-4, 6-4తో కజకిస్థాన్ జోడీ అలెగ్జాండర్ బబ్లిక్/అలెగ్జాండర్ షెవ్‌చెంకోను చిత్తు చేసింది. శ్రీరామ్ బాలాజీ/జాన్సన్ (బ్రిటన్) జంట 4-6, 5-7తో నాలుగో సీడ్ మార్సెలో (సాల్వడార్), పవిక్ (క్రొయేషియా) ద్వయంలో చేతిలో మొదటి రౌండ్‌లో పరాజయం చవిచూసింది.

పొట్టి సిరీస్‌నూ పట్టేయండి!
సౌతాఫ్రికాతో నేడు తొలి టీ20



రా. 7.00 నుంచి స్పోర్ట్స్ 18లో..

చెన్నై : మూడు వన్డేల సిరీస్ క్లీన్‌స్వీప్..ఆనక ఏకైక టెస్ట్‌లో పది వికెట్లతో ఘన విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ సేన జోరు అలా..ఇలా..లేదు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో చెన్నైలో జరిగే మూడు టీ20ల సిరీస్‌నూ పట్టేయాలని పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా మొదటి మ్యాచ్ శుక్రవారం జరగనుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అదరగొడుతున్న భారత్‌ను ఈ సిరీస్‌లో అడ్డుకోవడం సఫారీలకు సవాలే. మరోవైపు..పొట్టి సిరీస్‌ను దక్కించుకోవడం ద్వారా ఈనెల 19 నుంచి శ్రీలంకలో జరిగే ఆసియా కప్ టీ20 టోర్నీకి ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది. అలాగే అక్టోబరులో బంగ్లాదేశ్ వేదికగా నిర్వహించే పొట్టి ప్రపంచ కప్‌కూ ఈ సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. వైస్-కెప్టెన్ మంధాన వన్డే సిరీస్‌లో అద్భుతంగా ఆడింది. మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీతో అదరగొట్టింది. ఆఖరి వన్డేలో శతకంతో హర్మన్ కూడా ఫామ్‌లో కొచ్చింది. వన్డే సిరీస్‌లో విఫలమై ఆందోళన కలిగించిన డ్యాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మ..టెస్ట్ మ్యాచ్‌లో ఏకంగా రికార్డు డబుల్ సెంచరీతో ఊరటనిచ్చింది. జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ కూడా టెస్ట్‌లో సత్తా చాటడంతో భారత బ్యాటింగ్ తిరుగులేని స్థితిలో ఉంది. రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్‌తో పేస్, దీప్తిశర్మ, రాధా యాదవ్, ఆశా శోభనతో స్పిన్ విభాగం బలీయంగా ఉంది. మరోవైపు సౌతాఫ్రికా బ్యాటింగ్ భారాన్నంతా కెప్టెన్ లారా వోల్వార్ట్ మోస్తోంది. వన్డే, టెస్ట్‌లో ఒక్కో శతకంతో ఆమె ఆదుకోపోయి ఉంటే ఆ జట్టు పరిస్థితి దారుణంగా ఉండేది. టీ20 సిరీస్‌లో పోటీ ఇవ్వాలంటే వోల్వార్ట్ రాణించడంతోపాటు బాష్, కాప్, లుస్ తదితర బ్యాటర్లూ తలోచేయి వేయాల్సి ఉంటుంది.

భళా.. బోధన
చెస్‌లో తొమ్మిదేళ్ల చిన్నారి చరిత్ర
ఇంగ్లండ్‌కు ఆడనున్న భారత సంతతి బాలిక

లండన్ : తొమ్మిదేళ్ల బోధన శివానందన్ చెస్‌లో చరిత్ర సృష్టించనుంది. భారత సంతతికి చెందిన ఈ చిన్నారి ఇంగ్లండ్ తరఫున ఏ క్రీడలోనైనా అత్యంత పిన్నవయస్సులో అంతర్జాతీయ పోటీల బరిలో దిగనున్న ప్లేయర్‌గా రికార్డు సృష్టించనుంది. లండన్‌లోని హారోకి చెందిన బోధన వచ్చే సెప్టెంబరులో బుడాపెస్ట్‌లో జరిగే చెస్ ఒలింపియాడ్‌లో ఇంగ్లండ్ మహిళల జట్టు తరఫున ఆడనుంది. ఆ జట్టులోని ఇతర సభ్యులంతా 20, 30, 40 సంవత్సరాల వయస్సు వారు కావడం గమనార్హం. బోధన వంటి చెస్ చిచ్చర పిడుగును తానింత వరకు చూడలేదని..ఇంగ్లండ్ చెస్ జట్టు మేనేజర్ మాల్కమ్ పీన్ కితాబిచ్చాడు. కరోనా సమయంలో చెస్ పట్ల బోధన ఆకర్షితురాలైంది. కొద్దికాలంలోనే ఆటలో పట్టు సాధించిన ఆమె..గత డిసెంబరులో క్రొయేషియాలో జరిగిన యూరోపియన్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడం విశేషం.

జమ్మేకు రజావత్ షాక్
కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్

కాల్గరీ (కెనడా) : భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ సంచలనం సృష్టించాడు. కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థి రాస్మస్ జెమ్మేకు షాకిచ్చాడు. బుధవారం రాత్రి జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం. 39 రజావత్ 17-21, 21-16, 21-14తో ఎనిమిదో సీడ్ జెమ్మే (డెన్మార్క్)ను చిత్తు చేశాడు. ఇతర మొదటి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆయుష్ షెట్టి 14-21, 11-21తో వతనాబె (జపాన్) చేతిలో, ముత్తుస్వామి 16-21, 17-21తో లానీర్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ 21-11, 21-11తో రాచెల్ డరాగ్ (ఐర్లాండ్)పై నెగ్గి రెండో రౌండ్‌లో ప్రవేశించింది.



రాస్తారోకో చేస్తున్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గురుకుల విద్యార్థినులపై ప్రిన్సిపాల్ వేధింపులు!

- వసతుల గురించి అడిగితే దుర్భాషలు, దెబ్బలు
- ఎక్కువ మాట్లాడితే భోజనం పెట్టబోమని వేధింపులు
- ప్రిన్సిపాల్‌ను తొలగించాలని విద్యార్థినుల రాస్తారోకో

సూర్యాపేట రూరల్, జూలై 4: ప్రిన్సిపాల్ తమపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఓ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ విద్యార్థినులు రాస్తారోకోకు దిగారు. ఆ మహిళా ప్రిన్సిపాల్‌ను వెంటనే మార్చాలంటూ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని బాలెంలలోని డిగ్రీ కళాశాలలో జరిగింది. దాదాపు 400 మంది విద్యార్థినులు కళాశాల ఎదుటనున్న మట్టిరోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతిగృహంలో సరైన భోజనం పెట్టడం లేదని వాపోయారు. కనీస వసతులు కూడా కల్పించడం లేదని, అదేమని అడిగితే ప్రిన్సిపాల్ సరోజ తమను దుర్భాషలాడుతోందని, ఒక్కోసారి చేయి కూడా చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీకు సీట్లిచ్చి భోజనం పెడుతున్నామని, ఎక్కువ మాట్లాడితే ఆహారం కూడా పెట్టబోమని ప్రిన్సిపాల్ వేధించారని చెప్పారు. కళాశాలలో జరిగిన విషయాలు బయటికి చెబితే మీ పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డారని విద్యార్థినులు తెలిపారు. కొద్దిరోజులుగా వేధింపులను ఎక్కువవ్వడంతో విసుగెత్తి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో) అరుణకుమారి అక్కడికి చేరుకుని విద్యార్థినులతో చర్చించారు. ప్రిన్సిపాల్‌ను తాత్కాలికంగా తొలగించి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని, విచారణ కమిటీ ఏర్పాటు చేసి అధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

నేడు రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. దాదాపు 10 రోజుల పాటు ఆయన ఇక్కడే ఉండనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై అందిన అఫిడవిట్లను పరిశీలించనున్నారు. కమిషన్ నుంచి ఎవరెవరికి నోటీసులు జారీ చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈసారి జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నుంచి పూర్తిస్థాయి నివేదిక అందనుంది.

గడ్కరీతో బండి సంజయ్ భేటీ

- కరీంనగర్‌లో రోడ్ల పనులకు నిధులివ్వాలని వినతి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి గడ్కరీతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం భేటీ అయ్యారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో కొత్త జాతీయ రహదారుల నిర్మాణంపై ఆయన గడ్కరీతో చర్చించారు. పురోగతిలో ఉన్న జాతీయ రహదారుల పనుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో రహదారుల విస్తరణకు సంబంధించి సీఆర్ఐఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని సంజయ్ కోరారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు.. తొలి రోజు 56,674 మంది స్లాట్ల నమోదు

ఇంజనీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్, సీట్ల కేటాయింపు కసరత్తు పూర్తి!

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా తొలి రోజైన గురువారం 56,674 మంది అభ్యర్థులు స్లాట్లను నమోదు చేసుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు స్లాట్లను నమోదు చేసుకోవడానికి ఈ నెల 12వరకు గడువు ఉంది. ఈలోగా అభ్యర్థులు ఆన్‌లైన్ స్లాట్లను నమోదు చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత జూలై 6 నుంచి 13వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 8 నుంచి 15వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 19న సీట్లు కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 19 నుంచి 23వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌ను చేయాలి. జూలై 26వ తేదీ నుంచి రెండో దశ కౌన్సెలింగ్‌ను, ఆగస్టు 8 నుంచి చివరి దశ కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఆగస్టు 21 నుంచి 28 వరకు ఇంటర్నల్ స్లైడింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆగస్టు 28న స్పాట్ అడ్మిషన్లను చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా.. వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్, సీట్ల కేటాయింపుపై జేఎన్‌టీయూ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. గురువారం సమావేశమైన వర్సిటీ అకడమిక్ అండ్ ఆడిట్ విభాగం అధికారులు అఫిలియేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అఫిలియేషన్‌కు ఎంపికైన కళాశాలల జాబితా, వాటిలో అనుమతించిన కోర్సులు, సీట్ల సంఖ్య వంటి వివరాలు సిద్ధం చేశారు. వీటిని శుక్రవారం ఉన్నత విద్యామండలి ద్వారా కౌన్సెలింగ్ క్యాంప్ అధికారులకు పంపనున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులకు డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు పెద్దఎత్తున సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి పొందాయి. తెలంగాణలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు కలిపి సుమారు 20వేలకు పైగా సీఎస్ఈ, సీఎస్ఈ అనుబంధ సీట్లను పెంచుకునేందుకు ఏఐసీటీఈ ఆమోదం తెలుపగా.. రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదని తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతేడాది ఇన్‌టేక్‌తోనే కౌన్సెలింగ్‌కు వెళ్లేలా జేఎన్‌టీయూ అధికారులు కళాశాలల జాబితా సిద్ధం చేశారు. దీంతో సీట్ల పెంపుపై కొన్ని పెద్ద కళాశాలల యాజమాన్యాల ఆశలు గల్లంతైనట్లయింది. గతేడాది జేఎన్‌టీయూ అఫిలియేషన్ పొందిన 139 ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం 90,869 సీట్లుండగా, ఇందులో ప్రైవేటు కాలేజీల సీట్లు 82,500, ప్రభుత్వ (వర్సిటీ అనుబంధ)కళాశాలల నుంచి సుమారు 8,369 సీట్లు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం కూడా సీట్ల సంఖ్యలో పెద్దగా మార్పులు ఉండే అవకాశంలేదని జేఎన్‌టీయూ వర్గాలంటున్నాయి.

హై.. హై.. 'హైడ్రా'!

జీహెచ్ఎంసీతోపాటు ఔటర్ వరకు పరిధి

- సంస్థ కమిషనర్‌కు పూర్తిస్థాయి అధికారాలు
- చెరువులు, సర్కారీ స్థలాలపైన పర్యవేక్షణ
- అక్రమ నిర్మాణాల నియంత్రణకు చర్యలు
- త్వరలో కొలిక్కిరానున్న విధి విధానాలు

హైదరాబాద్ సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు పరిధి.. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్లు.. 27 మునిసిపాలిటీలు, 33 పంచాయతీలు..! స్వయంప్రతిపత్తితో విధి నిర్వహణతో.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పేరిట మహా నగరంలో కొత్త వ్యవస్థ అందుబాటులోకి రానుంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నుంచి నిధులతో ఇది విధులు నిర్వర్తించనుంది. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట.. సర్కారీ స్థలాల పరిరక్షణ.. అక్రమ నిర్మాణాల నియంత్రణ.. ఆయా ప్రభుత్వ విభాగాల పనితీరులో జవాబుదారీతనం పెంపు.. విపత్తుల నిర్వహణను పర్యవేక్షించనుంది. ఈ మేరకు హైడ్రా ఏర్పాటుకు ప్రభుత్వం సాగిస్తున్న కసరత్తు త్వరలో కొలిక్కిరానుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్న హైడ్రాపై వారం, పది రోజుల్లో స్పష్టమైన విధివిధానాలు విడుదలవుతాయని, ఉత్తర్వులూ జారీ అవుతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి వస్తాయంటూ దాని బాధ్యతలు, విధులను ఇటీవల ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం సూత్రప్రాయంగా వివరించినట్లు సమాచారం. వివిధ విభాగాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించడంపై ఆయన ప్రత్యేక దృష్టిసారించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలోని మునిసిపాలిటీలు/కార్పొరేషన్లు, పంచాయతీలను హైడ్రా కిందకు తీసుకురానున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు వచ్చే ఆదాయంలో కొంత హైడ్రాకు ఇచ్చేలా ప్రభుత్వం నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. జీహెచ్ఎంసీలో భాగంగా ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మెనేజ్‌మెంట్‌ను పునర్ వ్యవస్థీకరిస్తూ..సరికొత్త బాధ్యతలతో హైడ్రాను తీసుకొస్తున్నారు. సంస్థ కమిషనర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) స్థాయి అధికారి ఏవీ రంగనాథ్‌ను నియమించారు. కూల్చివేతలు, అధికారులపై చర్యలు, ఇతర అంశాలకు సంబంధించి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ద్వారా ప్రభుత్వానికి కమిషనర్ రిపోర్ట్ చేస్తారు. కాగా, సంస్థ అవసరాలకు సంబంధించిన వ్యయంపై కమిషనర్ స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. 2 వేల చదరపు కిలోమీటర్ల మేర పనిచేయాల్సి ఉన్నందున హైడ్రాను సంస్థాగతంగా బలోపేతం చేయనున్నారు.

చెరువుల వద్ద సీసీ కెమెరాలతో నిఘా

- చెరువుల కబ్జాలపై వచ్చే ఫిర్యాదుల మీద హైడ్రా తక్షణమే స్పందిస్తుంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఆక్రమణలు నిర్ధారణ అయితే కూల్చివేతలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా.. చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్‌లో నిర్మించిన భవనాలనూ నేలమట్టం చేస్తారు. చెరువుల వద్ద సీసీ కెమెరాలు లేదా సిబ్బందిని నియమించి నిఘా ఉంచనున్నారు.
- ప్రభుత్వ స్థలాలు, పార్కుల ఆక్రమణలపైనా ఉక్కుపాదం మోపనున్నారు. ఆక్రమణలు తేలితే ప్రస్తుతం విధించే శిక్షను పెంచే విషయాన్నీ పరిశీలిస్తున్నారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) ప్రకారం చట్ట సవరణపై నిర్ణయం తీసుకునేలా నివేదిస్తారు.
- సిబ్బంది గుర్తించిన, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనుమతి లేకుండా నిర్మించినా.. అనుమతి తీసుకున్న అంతస్తుల కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టినా జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం నోటీసులిచ్చి కూల్చివేయనున్నారు. ప్రస్తుతం జోన్‌కు ఒకటి చొప్పున స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు, ఈవీడీఎం పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నా అక్రమ నిర్మాణాల కూల్చివేతలో అలసత్వం కనబరుస్తున్నారు. ఇకమీదట కూల్చివేతల విషయంలో హైడ్రా రంగంలోకి దిగనుంది. అనుమతుల జారీలో అక్రమాలు జరిగినా అధికారులను బాధ్యులను చేయనున్నారు.
- నాలాల పూడికతీత, వరద నిర్వహణ, రోడ్ల నిర్మాణం, మరమ్మతు వంటి పనులనూ విజిలెన్స్ అధికారులు పరిశీలిస్తారు. పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తారు. తదనుగుణంగా సంబంధిత అధికారులపై చర్యలుంటాయి. వాటర్‌బోర్డు చేపట్టే పనులపైనా హైడ్రా పరిశీలన ఉంటుంది.
- హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేలా పోలీసులతో సమన్వయం చేసుకుంటారు. ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై శాశ్వత ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు.
- వరద నిర్వహణకు జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బృందాలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయా? లేదా? వరద ఎంతసేపు రోడ్లపై ఉంటోంది? క్యాచ్ పిట్ల వద్ద సిబ్బంది వ్యర్థాలు తొలగిస్తున్నారా..? అనేది గమనిస్తారు. ఎక్కువ సమయం వరద రోడ్లపై నిలిచిన పక్షంలో ఆ ప్రాంత అధికారి జవాబుదారీగా వ్యవహరించాల్సి ఉంటుంది.



హైడ్రా కమిషనర్‌గా నియమితులైన ఏవీ రంగనాథ్

రూ.250 కోట్ల సంస్థను కాజేసేందుకు యత్నించారు

- రాధాకిషన్‌పై క్రియా హెల్త్ కేర్ డైరెక్టర్ ఫిర్యాదు
- ఆయన సహా 9మందిపై కేసు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో జైల్లో ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావును జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. తనను బెదిరించి, కొట్టించి రూ.250కోట్ల విలువైన సంస్థను రాయించుకునే ప్రయత్నం చేసినట్లు బాధితుడు చెన్నుపాటి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాధాకిషన్ రావును పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకొని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. తన సంస్థలోని సహ డైరెక్టర్లతో కలిసి రాధాకిషన్ రావు తనను అక్రమంగా నిర్బంధించి షేర్లు బదిలీ చేయించుకున్నారంటూ క్రియా హెల్త్ కేర్ సంస్థ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావుతోపాటు మరో 8మందిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2011లో క్రియా హెల్త్‌కేర్‌ను వేణుగోపాల్ ప్రారంభించారు. అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో కలిసి 165హెల్త్‌కేర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఐదేళ్లలో సంస్థ టర్నోవర్‌ను రూ.250 కోట్లకు చేర్చారు. ఉత్తరప్రదేశ్ హెల్త్‌కేర్ సెంటర్ల ప్రాజెక్ట్ వచ్చిన సమయంలో సీఈవోగా బాలాజీ అనే వ్యక్తిని.. పార్ట్‌టైం డైరెక్టర్లుగా గోపాల్, రాజ్, నవీన్, రవిని నియమించుకున్నారు. కొన్నాళ్లకు వారందరూ ఏకమై సంస్థ షేర్లు తమపేరున మార్చాలని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించుకోవడానికి తనకు పరిచయమున్న చంద్రశేఖర్‌కు షేర్లు విక్రయించానని, కానీ అతడు సంస్థ డైరెక్టర్లతో కుమ్మక్కై కంపెనీని స్వాధీనం పరుచుకునేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు ఎస్సైల సాయంతో తనను కిడ్నాప్ చేశారని, సంస్థ షేర్లు తన పేరున రాయించుకునేందుకు చిత్ర హింసలకు గురిచేశారని ఫిర్యాదులో వెల్లడించారు. మీడియాకు చెబితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారని, రూ.10 లక్షలు టాస్క్‌ఫోర్స్ బృందానికి ఇచ్చానని చెప్పారు. కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు రాధాకిషన్ రావును అరెస్ట్ చేయడంతో పాటు, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

బిజినెస్

మరింత సులభంగా ఎస్‌బీఐ రుణాలు

న్యూఢిల్లీ: రుణాల మంజూరు ప్రక్రియను ఎస్‌బీఐ మరింత సులభం చేసింది. బ్యాంకు 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇందుకోసం అనేక చర్యలు ప్రకటించింది. వ్యవసాయ రుణాల్లో ఉండే నష్ట భయాన్ని (రిస్క్) సరిగా అంచనా వేసి, వేగంగా రుణాలు మంజూరు చేసేందుకు కొత్తగా 35 కేంద్రీకృత వ్యవసాయ ప్రాసెసింగ్ సెల్స్ (ఏసీపీసీ) ఏర్పాటు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై రుణాల మంజూరు కోసం తన ఎండ్ టు ఎండ్ డిజిటల్ యాప్ యోనో, భీమ్ ఎస్‌బీఐ పే యాప్‌లో రెండు ప్రత్యేక ఫీచర్లు జోడించింది. ఎస్‌బీఐ సూర్య ఘర్ లోన్ మంజూరు ప్రక్రియనీ సులభతరం చేసింది. ప్రవాస భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంది.

బైజూస్ జీతాలు చెల్లించాల్సిందే

ఎన్‌సీఎల్‌టీ

బెంగళూరు: ఎడ్యు స్టార్టప్ బైజూస్‌కి ఎన్‌సీఎల్‌టీ బెంగళూరు బెంచ్ గట్టి హెచ్చరిక చేసింది. ముందు ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. లేకపోతే బైజూస్ ఆదాయ, వ్యయాల పుస్తకాలను ఐసీఏఐ ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించిన 20 కోట్ల డాలర్లు తమకు అందుబాటులో లేనందున ఇప్పటికిపుడు ఉద్యోగుల జీతాలు చెల్లించడం సాధ్యం కాదన్న బైజూస్ వాదనని ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. బైజూస్ ఇప్పటికే నడుస్తున్న బిజినెస్ సంస్థ కాబట్టి, వచ్చే ఆదాయం నుంచి ఉద్యోగుల జీతాలు చెల్లించడం పెద్ద సమస్య కాదని స్పష్టం చేసింది.

పదేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఆరు నెలల్లో 1,73,241 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ ఈ నగరాల్లో ఇన్ని ఫ్లాట్లు, ఇళ్లు అమ్ముడుపోలేదని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది.

హైదరాబాద్‌లో మరింత పైకి: హైదరాబాద్ రియల్టీ గత ఆరు నెలల్లో 18,573 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ముంబై, ఢిల్లీతో సహా దేశంలో మరే ప్రధాన నగరంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు. ఆఫీసు స్పేస్ లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ కోసం లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

మార్కెట్ దూసుకెళ్తోంది.. జర జాగ్రత్త!



సెబీ, శాట్‌కు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సలహా..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో పాటు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచించారు. అంతేకాదు, వ్యవస్థ సుస్థిరత కోసం శాట్ మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ లావాదేవీలు భారీగా పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ట్రిబ్యునళ్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో అధికారులు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలన్నారు. శాట్ కొత్త కార్యాలయంతోపాటు కొత్త వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పెట్టుబడులకు చట్టాలు రక్షణ కల్పించగలవని, వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థలున్నాయని ఎప్పుడైతే మదుపరులు భావిస్తారో.. వారు మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలుంటాయని, అలాంటి వాతావరణం దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం ఒకరికొకరు హాని చేసుకునే ఆర్థిక ప్రపంచంలో శాట్ రిఫరీ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అందరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. మార్కెట్ సత్ప్రవర్తన, కార్పొరేట్ పాలన ప్రమాణాల అంశాలకు సంబంధించి శాట్ వద్ద అప్పీళ్లు కొన్ని రెట్లు పెరిగిన నేపథ్యంలో ట్రిబ్యునల్ సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు శాట్‌లో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని సూచించారు.

మోసగాళ్లపై సమాచారం ఇవ్వండి: బుచ్

మార్కెట్లో తప్పుడు పనులకు పాల్పడుతున్న వారి సమాచారం ఇవ్వాలని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మార్కెట్ వర్గాలను కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుగా ప్రవర్తించే వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పుడు ప్రవర్తన వ్యవస్థాగత సమస్యగా రూపుదాల్చకుండా, మరిన్ని కఠిన నిబంధనలు ప్రవేశపెట్టే అవసరం లేకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టడమే సెబీ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

2025 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 1,00,000?

ఐదేళ్లకోసారి రెండింతలవుతున్న ఇండెక్స్

ముంబై: బీఎస్ఈ సెన్సెక్స్ గతంలో సాధించిన వృద్ధిని బట్టి చూస్తే, 2025 డిసెంబరు నాటికి 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. గడిచిన 45 సంవత్సరాల్లో సెన్సెక్స్ 15.9 శాతం సంచిత వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు చేసుకుంది. 1979 ఏప్రిల్‌లో 100 బేస్ పాయింట్లతో ఏర్పాటైన సెన్సెక్స్.. ఇప్పటివరకు 800 రెట్ల వృద్ధిని సాధించింది. 15.9 శాతం సీఏజీఆర్‌ను మున్ముందూ కొనసాగించగలిగితే వచ్చే ఏడాది డిసెంబరు నాటికల్లా లక్ష పాయింట్లకు చేరుకోగలదని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం అంచనా వేసింది. స్వల్పకాలంలో ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం సూచీలు వృద్ధి పథంలోనే పయనించనున్నాయని అంటోంది.

మార్కెట్ పర్యవేక్షణ కోసం కేబినెట్ మంత్రిని నియమించాలి..

సెన్సెక్స్ ప్రస్తుత 15.9 శాతం సీఏజీఆర్‌తో ప్రతి ఐదేళ్లకు రెట్టింపవుతూ వచ్చిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే, 2029 నాటికి సెన్సెక్స్ 1,60,000కు చేరుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, దేశీయ క్యాపిటల్ మార్కెట్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేబినెట్ సహాయ మంత్రిని నియమించాలని సూచించారు.

80,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయి. క్రితం సెషన్‌లోనే 80,000 మైలురాయిని తాకి వెనక్కి వచ్చిన సెన్సెక్స్.. తొలిసారిగా ఆ స్థాయికి ఎగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. సెన్సెక్స్ ఒకదశలో 400 పాయింట్ల మేర ఎగిసి 80,392.64 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 62.87 పాయింట్ల లాభంతో మరో జీవితకాల గరిష్ఠ స్థాయి 80,049.67 వద్ద స్థిరపడింది. 24,401 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన నిఫ్టీ చివరికి 15.65 పాయింట్ల లాభంతో 24,302.15 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును సైతం రికార్డు చేసింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.4,47,30,452.99 కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) దూసుకుపోయింది.


రూ.2000 కోట్లతో అన్విత ఇవానా

నగరంలో మరో భారీ హౌసింగ్ ప్రాజెక్టు

హైదరాబాద్: రియల్టీ రంగంలోని అన్విత గ్రూప్ హైదరాబాద్ సమీపంలోని కొల్లూరు వద్ద నిర్మిస్తున్న భారీ హౌసింగ్ ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం పూర్తి కాబోతోంది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అన్విత చేపట్టింది. తొలిదశలో 3.5 ఎకరాల విస్తీర్ణంలో 15 అంతస్తులుండే రెండు టవర్ల నిర్మాణం పూర్తవుతోందని, డిసెంబరు నాటికి యజమానులకు ఫ్లాట్లు అందచేస్తామని కంపెనీ సీఎండీ బొప్పన అచ్యుతరావు తెలిపారు. రెండో దశలో 9.25 ఎకరాల్లో 36 అంతస్తులతో నాలుగు టవర్లు నిర్మించనున్నట్లు చెప్పారు. అపార్ట్‌మెంట్లలో నివశించే వృద్ధులు, పిల్లల కోసం రెండు క్లబ్ హౌస్‌లు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, స్విమ్మింగ్ పూల్స్ నిర్మిస్తున్నట్టు కంపెనీ డైరెక్టర్ అనూప్ బొప్పన తెలిపారు. వృద్ధులు, చిన్నారులను గాడ్జెట్ల నుంచి గార్డెన్‌కు ఆకర్షించడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. అపార్ట్‌మెంట్లలో నివశిస్తున్న వారెవరైనా మరణిస్తే బంధుమిత్రులు వచ్చే వరకు పార్థివ దేహాన్ని కాపాడేందుకు అవసరమైన మూడు బాడీలు ఉంచగల ఫ్రీజర్ వ్యవస్థ కూడా ఇందులో ఏర్పాటు చేస్తున్నామని అచ్యుతరావు చెప్పారు.

పదేళ్లలో ఫార్మా ఎగుమతులు 13,000 కోట్ల డాలర్లు

ప్రస్తుతం 2500 కోట్ల డాలర్లు; తెలంగాణ వాటా 35 శాతం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఫార్మా ఎగుమతులు వచ్చే పదేళ్ల కాలంలో 13000 కోట్ల డాలర్లకు (రూ.10.85 లక్షల కోట్లు) చేరనున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇప్కా) ప్రెసిడెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల పరిమాణం 2500 కోట్ల డాలర్లున్నదని (రూ.2.08 లక్షల కోట్లు), అందులో ఒక్క తెలంగాణ వాటానే 35 శాతం ఉందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ) వివరాలు తెలియచేయడానికి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఔషధ మార్కెట్‌కు భారత్ ఎన్నో కీలక ఔషధాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో భారత ఫార్మాను మరింత విస్తరించి, పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. ప్రపంచ ఫార్మా రంగ ప్రముఖులందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఫార్మా రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఐపీసీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని భిన్న దేశాలకు చెందిన 12 వేల మంది ప్రతినిధులు, 74 మంది వక్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో ఐపీసీ సదస్సు హైదరాబాద్ వేదికగా జరుగుతోందని ఆయన వెల్లడించారు.

ప్లేస్‌మెంట్ కాంక్లేవ్

ఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం ఐపీసీలో భాగంగా ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఐపీఏ అధ్యక్షుడు టీవీ నారాయణ చెప్పారు. పలు ఫార్మా కంపెనీలు ఇందులో పాల్గొని విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, అర్హులైన వారికి ప్లేస్‌మెంట్ లేఖలు కూడా అందచేయనున్నాయని ఆయన తెలిపారు. ఐపీసీలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. అలాగే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు తమ ఊహాత్మక ప్రాజెక్టులను ఇక్కడ ఆవిష్కరించినట్టయితే ఉత్తమ ఆవిష్కరణను కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, అందచేయనున్నట్టు ఆయన చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ అభియోగంలో నిజం లేదు

భారతదేశంలో తయారవుతున్న ఔషధాల్లో 35 శాతం కల్తీ ఔషధాలే అన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ఐపీసీ ప్రతినిధులు ఖండించారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాల కోసం ప్రపంచం యావత్తు భారతదేశం వైపే చూస్తున్నదన్నారు. ప్రపంచ ఫార్మాగా ప్రసిద్ధి చెందిన మన దేశం కొవిడ్ సంక్షోభ కాలంలో 150 పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిందని, అలాగే ఎన్నో కీలకమైన వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నదని గుర్తు చేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	97,500 ▲
ముంబై	72,470 ▲	66,380 ▲	90,020 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	122
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

3 బ్లాకులు మాకే ఇవ్వండి

సింగరేణి గనులను వేలం వేయొద్దు.. ప్రధాని మోదీకి సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ, జులై 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను వేలం జాబితా నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో తెలంగాణ సర్కార్‌కు 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలున్నాయని ఆయన గుర్తు చేశారు. గనులు, ఖనిజాభివృద్ధి నియంత్రణం చట్టంలోని సెక్షన్ 11 ఏ, 17ఏ (2) ప్రకారం వేలం జాబితా నుంచి శ్రావణపల్లి గనిని తొలగించడంతో పాటు గోదావరి లోయ బొగ్గు నిల్వల క్షేత్రం పరిధిలోని కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్‌లో ఉన్న మూడు గనులను సింగరేణికే కేటాయించాలని రేవంత్ ప్రధానిని కోరారు. గురువారం మధ్యాహ్నం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రధానిని కలుసుకున్న రేవంత్ దాదాపు గంటసేపు చర్చలు జరిపారు. అనంతరం మోదీతో సమావేశం వివరాలను రేవంత్ సమక్షంలో భట్టి విలేకరులకు వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుదుత్పత్తికి మూడు గనులు కీలకమని మోదీకి చెప్పామన్నారు. ఐటీ రంగంలో నూతన డెవలపర్లను ప్రోత్సహించేందుకు వీలుగా హైదరాబాద్‌లో యూపీఏ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన సమాచార సాంకేతిక పెట్టుబడుల ప్రాంతం(ఐటీఐఆర్)ను పునరుద్ధరించాలని కూడా కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రానికో ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్రం విధాన నిర్ణయాన్ని తీసుకున్నా తెలంగాణకు ఐఐఎం మంజూరు కాలేదని గుర్తు చేశామని చెప్పారు. ఇందుకోసం భూమి కేటాయింపునకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ ప్రధానికి చెప్పారన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మోదీని కోరామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సెమీ కండక్టర్ల ఫ్యాబ్‌ను నెలకొల్పేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనపరుస్తున్న నేపథ్యంలో ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు.



కేంద్రమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందిజేస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణకు ఇళ్లు కేటాయించండి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన తొలిదశలో తెలంగాణకు తక్కువ ఇళ్లు మంజూరయ్యాయని, ఈ పథకం కింద తెలంగాణకు వెంటనే 25 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని రేవంత్ ప్రధానిని కోరారు. వెనుకబడిన ప్రాంతాల నిధి కింద తెలంగాణకు రావల్సిన రూ.1800 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో పెరిగిన ట్రాఫిక్ అవసరాల రీత్యా హైదరాబాద్-కరీంనగర్, హైదరాబాద్-నాగపూర్ రోడ్లపై ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని నిర్ణయించామని ప్రధానికి చెప్పారు. ఈ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా మార్గమధ్యంలో రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని రేవంత్ కోరారు. రహదారుల విస్తరణకు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉన్న 2,450 ఎకరాల భూములను కూడా బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ భూములకు ప్రత్యామ్నాయంగా రావిర్యాల ప్రాంతంలో రీసెర్చ్ సెంటర్ ఇమారత్‌కు లీజుకు ఇచ్చిన 2,462 ఎకరాల భూమిని కేంద్రానికి పూర్తిగా అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చట్టబద్ధ హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చాలని రేవంత్ మోదీని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రహదారులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూసేకరణ వ్యయంలో 50 శాతం ఖర్చును ఇవ్వడంతో పాటు రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని(చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు) జాతీయ రహదారిగా గుర్తించి భారతమాల పరియోజనలో భాగంగా చేపట్టాలని కోరారు. తెలంగాణలో పెరిగిన రవాణా అవసరాల రీత్యా 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

నిఘా విభాగాలను ఆధునికీకరించాలి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రేవంత్, భట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జులై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిఘా విభాగాల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. రాష్ట్ర స్థాయిలో అత్యున్నత నిఘా విభాగాలైన మాదక ద్రవ్యాల నిరోధక సంస్థ, సైబర్ భద్రతా సంస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయన గురువారమిక్కడ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి అమిత్ షాను కలిశారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాల కొనుగోలుకు నార్కోటిక్స్ బ్యూరోకు రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు రూ.90 కోట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణకు సంబంధించి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లకోసారి ఐపీఎస్ క్యాడర్‌ను సమీక్షించాల్సి ఉండగా, 2016 నుంచీ సమీక్ష నిర్వహించలేదని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేటాయించిన 61 ఐపీఎస్ పోస్టులు సరిపోవని, అదనంగా మరో 29 పోస్టులు కేటాయించాలని కోరారు. వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో భద్రతా బలగాల క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్పీవోల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులను మాత్రమే చేర్చుకోవాలన్న నిబంధనను సడలించాలని.. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.18.31 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విభజన చట్టంలో ఎక్కడా ప్రస్తావించని ఆస్తులు, సంస్థలు తమవేనని ఏపీ చెప్పుకుంటున్నందువల్ల తెలంగాణకు న్యాయం చేయాలని కోరారు. శనివారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో విభజన సమస్యలపై చర్చిస్తున్నామని రేవంత్ అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు.

సహకార రంగం బలోపేతంపై దృష్టి

▸ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకులో గురువారం నిర్వహించిన ఎన్‌సీడీసీ(జాతీయ సహకార అభివృద్ధి సంస్థ) ప్రతిభ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 60.759 సహకార సంఘాలు ఉండగా ఇందులో 24.539 వినియోగదారుల, పొదుపు, మత్స్యకారుల సహకార సంఘాలేనని తెలిపారు. సహకార రంగంలో కంప్యూటరీకరణ, ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. బీమా, ఆరోగ్యం, పర్యాటకం, స్టోరేజీ వంటి రంగాల్లో సహకార సంఘాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్, జగిత్యాల జిల్లా రాయికల్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట, మేడ్చల్ జిల్లా జీడిమెట్ల సహకార సంఘాలకు ప్రతిభ అవార్డులను అందజేశారు. కాగా, బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయాన్ని గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం పదిన్నర గంటలకు కూడా ఒకరిద్దరు వినహా ఉద్యోగులు ఎవరూ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఎవరి సొత్తు కాదు: పొన్నం

ఎల్కతుర్తి/హుస్నాబాద్, జూలై 4: 'తెలంగాణ ఉద్యమ కారుడిగా గర్వపడుతా.. రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియమ్మ గురించి గొప్పగానే చెప్పుకుంటాం. తెలంగాణ ఎవరి సొత్తు కాదు' అని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రసంగం చివరిలో జై తెలంగాణ అని నినాదాలు చేయడానికి సభలో కొందరు ఇబ్బందులు పడుతున్నారని, తాను ఉద్యమకారుడిగా ఎవరికి ఇష్టం ఉన్నా.. లేకున్నా.. జై తెలంగాణ అంటా అని అన్నారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధనకు పార్లమెంట్‌లో కొట్లాడి దాడులకు ఎవరు గురయ్యారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని గుర్తుచేశారు. ప్రతీ సభ, సమావేశాల ముగింపులో జై తెలంగాణ అంటూ ముగిస్తామని, అందులో ఎవరికీ ఎలాంటి సందేహాలు అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని గురుకుల బాలికల పాఠశాలను గురువారం రాత్రి మంత్రి పొన్నం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

వరంగల్‌కు 2050 మాస్టర్‌ప్లాన్

▸ వీలైనంత త్వరగా ప్లాన్ రూపకల్పన: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 2050 సంవత్సరం నాటికి ఉండే జనాభా అవసరాలకు అనుగుణంగా వరంగల్-2050 మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫార్మా సిటీ, ఐటీ కారిడార్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఎకో టూరిజం, విద్యా సంస్థలు, స్టేడియం, విమానాశ్రయం, లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు, పర్యాటకం వంటి అంశాలకు మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌ను వీలైనంత త్వరగా రూపొందించాలని స్పష్టం చేశారు. వరంగల్ నగర అభివృద్ధి అంశంపై సచివాలయంలో గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారుచేయాలని సూచించారు. కాగా, జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గురువారం మంత్రి పొంగులేటి అన్నారు. మీడియా మేనేజ్‌మెంట్ అంశంపై రెండు వారాల శిక్షణ కోసం రాష్ట్రానికి వచ్చిన శ్రీలంక జర్నలిస్టుల బృందం పొంగులేటిని కలిసింది.

ఎడ్యుకేషన్ హబ్‌గా వరంగల్: మంత్రి దుద్దిళ్ల

హనుమకొండ కలెక్టరేట్, జూలై4: వరంగల్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో జరిగిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో, హనుమకొండలోని ఇందిరానగర్‌లో రాక్స్ ఐటీ సొల్యూషన్ ప్రారంభ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. వరంగల్‌లో సూక్ష్మ, మధ్య తరహా ఐటీ కంపెనీలు ప్రారంభిస్తామన్నారు. విమానాశ్రయం నిర్మాణం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు.

నీట్ అక్రమాలపై విద్యార్థి సంఘాల భగ్గు

బర్కత్‌పుర్/హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నీట్-యూజీ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై విద్యార్థి, యువజన సంఘాలు భగ్గుమన్నాయి. దేశవ్యాప్తంగా జరిగిన భారత్‌బంద్‌లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని బర్కత్‌పుర చౌరస్తా నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఇందులో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షను రద్దు చేసేంతా వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఎన్‌టీఏను రద్దు చేయాలని.. నీట్‌లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏఐపీఎస్‌యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు. ఇటు బషీర్‌బాగ్‌లోనూ ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆకాశవాణిలో 'తెలుగు పద్మాలు'

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం.. 'తెలుగు పద్మాలు' శీర్షికతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేయనుంది. ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించి, ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలు అందుకున్న ప్రముఖుల పరిచయాల సముదాయంతో ఈ ధారావాహిక ప్రసారం కానుంది. శుక్రవారం నుంచి ప్రతిరోజు ఉదయం 10గంటలకు 'తెలుగు పద్మాలు' పేరుతో ఈ కార్యక్రమం ప్రసారమవుతుందని డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయశంకర్ తెలిపారు. ప్రజా ప్రసార సేవలో 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ ధారావాహికను అందిస్తున్నామన్నారు.

సరితూగే అభ్యర్థుల్లేకే!

(మొదటిపేజీ తరువాయి)



ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని, ఆ విషయంలో తాను జోక్యం చేసుకోవట్లేదని చెప్పారు. ఒక మహిళా ఐఏఎస్ అధికారి ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసినట్లు వార్తలు వచ్చాయని ప్రస్తావించారు. కత్తి పట్టినోడు కత్తికి బలైతాడు అన్నట్లు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినోళ్లు దానికి బలి కావడం ఖాయమని చెప్పారు. మంత్రివర్గ విస్తరణ గురించి విలేకరులు ప్రశ్నించగా, అంతా మీడియాయే మాట్లాడిందని వ్యాఖ్యానించారు.

ఈవీఎంలతో అక్రమాలకు అవకాశం

ఈవీఎంలతో ఎన్నికల సమయంలో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ అభిప్రాయపడ్డారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలకు అదనంగా మరో 15 శాతం ఈవీఎంలు ప్రతీ నియోజకవర్గానికి కేటాయించి, ఈవీఎంల పంపిణీ కేంద్రానికి తరలిస్తారని చెప్పారు. ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తరలించేటప్పుడు ఆ 15 శాతం అదనపు ఈవీఎంలు పంపిణీ కేంద్రంలోనే ఉండి పోతాయన్నారు. పోలింగ్ పూర్తయ్యాక అన్ని ఈవీఎంలు తిరిగి పంపిణీ కేంద్రానికే వస్తాయన్నారు. ఇలా పోలింగ్‌లో వాడిన ఈవీఎంలను, వాడని ఈవీఎంలను ఒకచోట చేర్చినపుడు అక్రమాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. యూపీఏ ప్రభుత్వం రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు చంద్రబాబు నాయకత్వంలో ఈవీఎంల అక్రమాలపై పోరాటం చేశామని రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఫలితంగానే వీవీప్యాట్ల ద్వారా 5 శాతం ఓట్లు లెక్కించాలనే నిబంధనలు వచ్చాయని గుర్తు చేశారు. ఈవీఎంలు అన్నింటినీ దుర్వినియోగం చేసే అవకాశాలు లేవని, పది వేల ఓట్ల తేడాతో ఓడిపోతామని అంచనా ఉన్న స్థానాలలో మాత్రమే ఫలితాలను తారుమారు చేసే అవకాశాలున్నాయని రేవంత్‌రెడ్డి చెప్పారు.

నా మార్కు మూసీ ప్రాజెక్టు

మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు తన పాలనలో చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని రేవంత్ ప్రకటించారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేరకు మూసీ నదిని, దాని పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా తన ముద్ర వేస్తానని చెప్పారు. మూసీతో పాటు ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. హైకోర్టు నిర్మాణాన్ని అనుకున్న విధంగా పూర్తి చేస్తామని ప్రకటించారు. మూసీ నదిలోకి గండిపేట ద్వారా గోదావరి నీటిని తరలిస్తామని, త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. గండిపేట నుంచి రింగ్ రోడ్డు వరకు 55 కిలోమీటర్ల మేర మూసీ అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి ఖర్చును అంచనా వేసే బాధ్యతను రెండు అంతర్జాతీయ సంస్థలకు అప్పగించామని చెప్పారు. ప్రాజెక్టు పొడవునా రోడ్డు, మెట్రోలు ఉంటాయని తెలిపారు. నగరంలోని మురికి నీటిని ఎస్టీపీల్లో శుద్ధి చేసిన తర్వాతే మూసీలోకి వదులుతామని చెప్పారు. నిర్మాణం ప్రారంభించిన మూడు ఏళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రాజెక్టును 12-15 కిలోమీటర్ల పొడవు ఉండే 4 క్లస్టర్లుగా విభజించి, నాలుగు పెద్ద ఏజెన్సీలకు బాధ్యత అప్పగిస్తామన్నారు. ప్రాజెక్టులో భాగంగా 10,500 అక్రమ నిర్మాణాలను కూల్చివేయాల్సి వస్తుందని అంచనా వేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించడం, ల్యాండ్ పూలింగ్ చేపట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వడం, టీడీఆర్ ఇవ్వడం, నష్టపరిహారం... ఇలా నాలుగు పద్ధతుల్లో పునరావాసం ఉంటుందని చెప్పారు. ఆగస్టులో జపాన్, కొరియాలలో నదుల అభివృద్ధిని పరిశీలిస్తామని వెల్లడించారు.

ఫిరాయింపుల తీర్పు నా పోరాట ఫలితమే

ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారానికి సంబంధించి గతంలో తాను టీడీపీలో ఉండగా న్యాయస్థానాలలో కొట్లాడానని రేవంత్ గుర్తు చేసుకున్నారు. 12 వారాలలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఇచ్చిన తీర్పు తన పోరాట ఫలితమేనన్నారు. పెగాసెస్ ద్వారా ఫోన్ల ట్యాపింగ్ జరుగుతున్న వ్యవహారాన్ని వ్యవహారాన్ని దేశంలోనే మొదట వెలుగులోకి తెచ్చింది తానేనని రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఎంపీగా ఉన్న సమయంలో లోక్‌సభలో పెగాసెస్ అంశంపై మొదట తానే ప్రశ్నించానని తెలిపారు.

గ్రూప్ 1లో 1:50 మీరు పెట్టిందే

గ్రూప్ 1 మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం 1:50 నిష్పత్తిలో చేపట్టాలని నోటిఫికేషన్ ఇచ్చిందని, దాన్నే తాము అమలు చేస్తున్నామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేసే విషయంలో తమ ప్రభుత్వం సీరియస్‌గా ఉందని గ్రహించిన ప్రతిపక్షాలు ఇప్పుడు అడ్డుపుల్లలు వేసేందుకు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించాయని ఆరోపించారు. తాను పలుమార్లు ఢిల్లీ వచ్చిన విషయాన్ని ప్రచారం చేస్తున్న విపక్షాలు రాష్ట్ర అభివృద్ధి కోసం వచ్చిన ప్రతిసారీ కేంద్రమంత్రులను కలుస్తున్న విషయాన్ని మాత్రం చెప్పట్లేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లు ఉండడం గ్యారెంటీ అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీలేదు

విభజన సమస్యల పరిష్కారంలో చట్ట ప్రకారమే నడుచుకుంటామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోనని స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీపడ్డాడు కాబట్టే ఏడు మండలాలను ఏపీకి వదులుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ సీఎం అయ్యాకే కేంద్రం ఏడు మండలాలపై ఆర్డినెన్స్ ఇచ్చి, తర్వాత బిల్లు ఆమోదించిందని ప్రస్తావించారు. 25 లక్షల ఇళ్ల కోసం కోసం కేంద్రాన్ని అభ్యర్థించడం గురించి మాట్లాడుతూ, కేసీఆర్ శ్రీమంతుడు కాబట్టే ఇవ్వన్నీ ఏమీ వద్దని వదులుకున్నారని, తాము పేదవాళ్లం అయినందున కేంద్రాన్ని అడుగుతున్నామని వ్యంగ్యంగా అన్నారు. జాతీయ ఆరోగ్య విషన్ నిధులను కూడా కేసీఆర్ తీసుకోలేదని ప్రస్తావించారు. కృష్ణా జలాలలో 512 టీఎంసీలు ఏపీకి వదులుకున్నారని ఆరోపించారు.

నేను కాదు... మోదీయే

ప్రధాని మోదీని కలిసినపుడు చేతులు పట్టుకోవడంపై విలేకరులు ప్రశ్నించగా, చేతులు ఆయన పట్టుకున్నారని, తానేం పట్టుకోలేదని నవ్వుతూ బదులిచ్చారు. మూడోసారి ప్రధాని అయ్యాక మోదీ వ్యవహార శైలిలో ఏమైనా మార్పు గమనించారా? అని అడగ్గా, ఆయన నరేంద్ర మోదీ కదా ఏం మారుతారు? అని ప్రశ్నించారు. పాతబస్తీ కరెంటు బిల్లులను వసూలు చేసే బాధ్యతను అదానీకి బదులుగా బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తీసుకుంటే తనకు అభ్యంతరం లేదన్నారు.

కేసీఆరే టార్చ్‌లైట్ వేసుకొని వెతకాలి

బీఆర్ఎస్ జాడ లేకుండా పోయింది

క్యాబినెట్ బంతి అధిష్ఠానం కోర్టులో: రేవంత్

న్యూఢిల్లీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, ఇక ఆ పార్టీది గత చరిత్రేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీతో భేటీ అనంతరం రేవంత్ మీడియా ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రజలు టార్చ్‌లైట్ వేసుకొని వెతుక్కుంటూ బీఆర్ఎస్ కోసం వస్తారంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. నిజంగానే ఆ పార్టీ జాడ లేకుండా పోయిందని, దానికోసం టార్చ్‌లైట్ వేసుకొని ప్రజలే కాదు కేసీఆర్ కూడా వెతుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఎప్పుడూ ఇంతటి దురవస్థలో లేదని, లోక్‌సభలో ఆ పార్టీకి సింగిల్ సీటు కూడా లేదని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష నియామకం అంశాలు కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ఉన్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రివర్గ విస్తరణపై తాను ఎలాంటి తేదీలు ప్రకటించలేదని చెప్పారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతించాలని, పీసీసీ అధ్యక్షుడిని నియమించాలని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు విజ్ఞప్తి చేశానని తెలిపారు. ప్రస్తుతం బంతి ఏఐసీసీ కోర్టులో ఉందని, మీడియా ప్రశ్నలకు అక్కడి నుంచే సరైన సమాధానం దొరుకుతుందని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ గురించి అమిత్‌షాకు చెప్పానని, కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని తెలిపారు. నీటి పంపకాలు, భద్రాద్రి రాముడి గుడి, దేవుడి మాన్యాలు కూడా ఏపీతో చర్చకు వస్తాయన్నారు. ఈటల రాజేందర్‌కు కేసీఆర్ మీద ఇంకా ప్రేమ తగ్గినట్లు లేదన్నారు.

ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం

▸ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జనగామ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వచ్చే ఏడాది ఏప్రిల్ 3న కొమురయ్య జయంతి నాటికి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. గురువారం కొమురయ్య వర్ధంతి సందర్భంగా జనగామలో పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురయ్య విగ్రహాన్ని ఆయన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. రజాకార్ల ఆగడాలను భరించలేక 19ఏళ్ల వయసులోనే దొడ్డి కొమురయ్య పోరాటం చేసి ప్రాణాలు వదిలారని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు.

సకల వసతుల 'పల్లె'



గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు తదితర వసతులపై ఫోకస్

హైదరాబాద్, జులై 4 (ఆంధ్రజ్యోతి): ఊర్లో అన్ని వసతులుంటే ఇబ్బందులన్నీ పోయి ప్రజల జీవితాలు ఆనందమయం అవుతాయి. పిల్లలు చదువుకునేందుకు అన్ని వసతులతో కూడిన చక్కని బడి.. వైద్య సౌకర్యం, తాగునీటి వసతి, అంతర్గత రోడ్లు, చక్కని మురుగు నీటి పారుదల వ్యవస్థ, ఇతర గ్రామాలకు అనుసంధానం చేస్తూ రహదారులు ఉంటే ఎంతో బాగుంటుంది అవునా? ఈ సౌకర్యాలున్న ఊర్లు కొన్ని ఉండొచ్చు... మరి మిగతా గ్రామాల్లో? కొన్ని ఉంటాయి. ఇంకొన్ని లేవు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కనీస సౌకర్యాలన్నీ కల్పించి.. పల్లెలను 'సకల వసతులకు కేంద్రం'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అన్ని వసతులు కల్పించాలని యోచిస్తోంది. ఏ గ్రామంలో ఏ సౌకర్యాలున్నాయి? ఏవి లేవు? కల్పించాల్సిన సౌకర్యాలేమిటి? అన్న వివరాలను సేకరించాలని ప్రణాళిక సంఘం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,909 రెవెన్యూ గ్రామాల నుంచి త్వరలోనే వివరాలను సేకరించనుంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి, కార్యరంగంలోకి దిగుతామని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి వివరాలు సేకరించి, వాటన్నింటినీ క్రోడీకరించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. సౌకర్యాల కొరత ఉన్న గ్రామాలకు నిధులు కేటాయించాలని ఆ నివేదికలో సర్కారుకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఏ ఊర్లోనూ 'ఫలానా సౌకర్యం లేదు' అనే మాట వినిపించకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. వాస్తవానికి రాష్ట్రంలో కనీస సౌకర్యాలు లేని గ్రామాలు చాలానే ఉన్నాయి. ఒక గ్రామంలో పాఠశాల ఉంటే... సబ్ సెంటర్ ఉండదు. మరో గ్రామంలో పాఠశాల, సబ్ సెంటర్ ఉంటే... రోడ్డు సౌకర్యం, రవాణా సదుపాయం, తాగునీటి వసతి ఉండవు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురికి కంపు కొడుతున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమితులయ్యాక ఏదైనా వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాలన్న యోచనతో గ్రామాల్లోని సౌకర్యాలపై జి.చిన్నారెడ్డి దృష్టి పెట్టారు. రెవెన్యూ గ్రామాల్లో అక్కడి సర్పంచులు, అభివృద్ధి కమిటీల నుంచి వివరాలు సేకరిస్తామని, వారిచ్చే సమాచారాన్ని క్రోడీకరించి ఆరు నెలల్లోగా నివేదిక తయారు చేస్తామని చెప్పారు. అయితే... ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని, ప్రాథమికంగా ఆయన ఓకే చెప్పారని తెలిపారు.

బండ్లను చేర్చుకుంటే ఆత్మహత్యే..

కాంగ్రెస్‌లోకి కృష్ణమోహన్‌రెడ్డి వద్దే వద్దు.. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేరికపై రగడ

గద్వాల, జూలై 4: జోగులాంబ గద్వాల జిల్లాలో రాజకీయం గరంగరంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యకర్తలు పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి దూకి చస్తానని హల్‌చల్ చేయగా, ధర్నాలో ముగ్గురు యువకులు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చలు పూర్తయ్యాయని, అమావాస్య తర్వాత ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం ఖరారయ్యిందనే వార్తలు రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. ఉదయం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత క్యాంపు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు. సరిత అభిమాని అయిన బొంబాయి ప్రసాద్ సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే టవర్ పైనుంచి దూకి చస్తానని హెచ్చరించాడు. దీంతో పోలీస్ బందోబస్తు పెంచి, ఫైర్ ఇంజన్‌ను కూడా రప్పించారు. మధ్యాహ్నం 2 గంటలకు కాంగ్రెస్ నేతలు సెల్‌టవర్‌పై ఉన్న ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అధిష్ఠానం తమకు న్యాయం చేస్తుందని చెప్పడంతో కిందకు వచ్చిన ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. సెల్ టవర్‌పై ఉన్న ప్రసాద్‌కు మద్దతుగా అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. గద్వాల మండలం అనంతాపురం గ్రామానికి చెందిన రహీం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో.. కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ తర్వాత కాసేపటికే దౌదర్‌పల్లికి చెందిన అనిల్ కూడా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ఫైర్ సిబ్బంది నీళ్లు చల్లి అడ్డుకున్నారు. ఇదే సమయంలో కేటీదొడ్డిలో నిర్వహించిన ధర్నాలో కృష్ణ అనే యువకుడు కూడా ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.. దాంతో అక్కడున్న వారు కాపాడారు..



ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నిస్తున్న అనిల్‌ను కాపాడుతున్న పోలీసులు

రెండ్రోజుల్లో ప్రకటిస్తా..: బండ్ల

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఎప్పుడు చేరతాననేది రెండ్రోజుల్లో ప్రకటిస్తానని ఆయన స్వయంగా వెల్లడించారు. గద్వాలలోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కాంగ్రెస్‌లో చేరికపై తన అనుచరుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందరినోటా గద్వాల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరాలనే అభిప్రాయం రావడంతో ఆయన కూడా తన మనసులోని మాట బయటపెట్టారు. గద్వాల అభివృద్ధితో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముందని, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను గౌరవించి కాంగ్రెస్‌లో చేరాలనుకుంటున్నానని చెప్పారు. అయితే ఎప్పుడు చేరతాననే దానిపై రెండ్రోజుల్లో స్పష్టత వస్తుందని వివరించారు.

మల్లారెడ్డి విద్యా సంస్థపై చర్యలకు హైకోర్టు ఆదేశం

» అనుమతుల్లేకుండా బాలానగర్‌లో ఏర్పాటు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మల్లారెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఎలాంటి అనుమతులు లేకుండా బాలానగర్‌లో ఏర్పాటు చేసిన మల్లారెడ్డి యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కామర్స్ అండ్ డిజైన్ (ఆఫ్ క్యాంపస్)పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), రాష్ట్ర ఉన్నతవిద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ, యూజీసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మల్లారెడ్డి యూనివర్సిటీ ఆఫ్‌క్యాంపస్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ నవీనా ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రతిభా డిగ్రీ కాలేజ్, ఏ మనోహర్ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరించిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ప్రతివాదులైన మల్లారెడ్డి యూనివర్సిటీ, ఆఫ్‌క్యాంపస్‌కు వ్యక్తిగత నోటీసులు అందజేయాలని ఏప్రిల్ 25న పిటిషనర్ తరఫు న్యాయవాదికి ఆదేశాలు జారీచేసింది. మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రతినిధులు నోటీసులు స్వీకరించినా మల్లారెడ్డి వర్సిటీ ఆఫ్‌క్యాంపస్ ప్రతినిధులు మాత్రం నిరాకరించారు. ఈ అంశంపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నోటీసులు తిరస్కరించినా అందినట్లుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వాదనను రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహా ఇతర అధికారిక ప్రతివాదులెవరూ వ్యతిరేకించలేదు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఆఫ్‌క్యాంపస్ సెంటర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

ఐఐటీహెచ్‌లో ఏఆర్-వీఆర్ ల్యాబ్ ప్రారంభం

కంది, జూలై 4: విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య దూరాన్ని తగ్గించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌లో ఏఆర్-వీఆర్ ల్యాబ్ ఏర్పాటైంది. దీనిని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఇన్ఫోవిజన్ సహ వ్యవస్థాపకుడు సీన్ యలమంచి గురువారం ప్రారంభించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇన్ఫోవిజన్ సహకారంతో ఐఐటీ-హెచ్ ప్రాంగణంలో ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్)- వర్చువల్ రియాలిటీ (వీఆర్) ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేందుకు, అభ్యాసానికి మూలస్తంభంగా మారనుంది. ల్యాబ్ ప్రారంభం సందర్భంగా సీన్ యలమంచి మాట్లాడుతూ.. పరిశోధనల్లో ఐఐటీ హైదరాబాద్‌తో భాగస్వామిగా మారినందుకు గర్వంగా ఉందన్నారు. ఏఆర్-వీఆర్ ల్యాబ్ ద్వారా తమ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక పురోగతులను అందించడంలో మరో ముందడుగు వేసినట్టు ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

లాయర్లకు డెత్ బెనిఫిట్ రూ.6 లక్షలకు పెంపు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు అందించే డెత్‌బెనిఫిట్‌ను రూ. 4 లక్షల నుంచి రూ. 6 లక్షలకు పెంచుతూ తెలంగాణ బార్ కౌన్సిల్ తాజాగా నిర్ణయం తీసుకుంది. జూలై 1 తర్వాత మరణించిన న్యాయవాదుల నామినీలకు వెల్ఫేర్‌ఫండ్ యాక్ట్ ప్రకారం పెంచిన మొత్తాన్ని అందజేయనుంది. ఈ పెంపుదల ప్రస్తుత పరిస్థితుల్లో ఎందుకూ సరిపోదని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. డెత్‌బెనిఫిట్‌ను రూ.20 లక్షలకు పెంచాలని, రూ.10 లక్షల ఆరోగ్యబీమా కల్పించాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైపెండ్ అందజేయాలని, నూతన హైకోర్టులో న్యాయవాదులకు లా ఛాంబర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు హైకోర్టు నోటీసు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వచ్చాయనే కారణంతో ఓ విద్యార్థిని 9వ తరగతి నుంచి 10వ తరగతికి ప్రమోట్ చేయనందుకు బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమశాఖ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. 9వ తరగతి ఆంగ్ల పరీక్షలో పాస్‌మార్కుల కంటే 5 మార్కులు తక్కువ వచ్చాయన్న కారణంతో తన కుమారుడిని పదో తరగతికి ప్రమోట్ చేయకపోవడంపై తండ్రి శంకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

తాజా ఉత్తర్వులు కావాలని వేధిస్తారా?

» రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల అవగాహన రాహిత్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే వివాదాలు పరిష్కారమైన భూముల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లకు మళ్లీ తాజా కోర్టు ఉత్తర్వులు కావాలంటూ పౌరులను వేధించడాన్ని తప్పుబట్టింది. అధికారులు కోర్టు తీర్పులు అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేటలోని సర్వే నంబర్ 265లో 167చదరపు గజాల ప్లాట్ నంబర్ 44ను రిజిస్ట్రేషన్ చేయడం లేదని అనంత రామేశ్వరి దేవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ తరహాలోనే మరో 22 పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భూవివాదాలు ఇప్పటికే పరిష్కారమైన భూముల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు మళ్లీ తాజా కోర్టు ఉత్తర్వులు తేవాలని అధికారులు చెబుండటంతో పిటిషనర్‌లు కోర్టుకు వస్తున్నారని గుర్తించింది. దాంతో ఇప్పటికే సెటిల్ అయిన భూవివాదాల్లో రిజిస్ట్రేషన్‌లు తిరస్కరించరాదంటూ జిల్లా రిజిస్ట్రార్‌లకు మార్గదర్శకాలు జారీచేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. ఆదేశాలు ఉన్న వ్యవహారాల్లో తిరస్కరిస్తే తమ ఆదేశాల ఉల్లంఘనగా పరిగణిస్తామని స్పష్టం చేసింది.

పలుకుబడితో కుమారుడిని తప్పించారు

» షకీల్ పాత్రపై హైకోర్టులో పోలీసుల వాదన

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోధన్ ఎమ్మెల్యేగా ఉన్న షకీల్ 2022 నాటి జూబ్లీహిల్స్ ప్రమాద ఘటనలో నుంచి తన కుమారుడు రహీల్‌ను కేసు నుంచి తప్పించారని పోలీసులు హైకోర్టుకు తెలిపారు. అమాయకుడిని జైలుకు పంపించారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రమాదం కేసులో తనను అక్రమంగా ఇరికించేందుకు రెండేళ్ల క్రితం నాటి కేసును తిరగదోడుతున్నారని పేర్కొంటూ షకీల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ కే సుజన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున హోంశాఖ న్యాయవాది మహేశ్ రాజే వాదనలు వినిపిస్తూ.. తమ పలుకుబడి ఉపయోగించిన అప్పటి ఎమ్మెల్యే షకీల్ కేసు నుంచి తన కుమారుడిని తప్పించి అమాయకుడిని జైలుకు పంపారని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

'ఎంఎన్‌జే'లో 45 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 45 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈమేరకు మొత్తం 14 విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించనున్నారు. సంబంధిత విభాగంలో కనీసం పీజీ చేసిన వారు పోస్టులకు అర్హులు. ఈ నెల 12 నుంచి 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మార్కుల ఆధారంగా 80 పాయింట్లు, ప్రభుత్వ దవాఖానాలు, సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసిన వారికి 20 పాయింట్లు కేటాయించనున్నారు.

ఆ నివేదిక తర్వాతే 'చైర్మన్‌గిరీ'!

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల పనితీరుపై కురియన్ కమిటీ సమీక్ష

» నివేదిక ఇచ్చాకే నామినేటెడ్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, జులై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ మరికొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించిన నేతలు, పార్టీ కోసం దీర్ఘకాలికంగా పనిచేసున్న వారికి అవకాశం కల్పిస్తూ మార్చి 14న 37 మందితో జాబితాను వెలువరించింది. కానీ, ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సంబంధిత శాఖలు కార్పొరేషన్లకు జీవోను పంపలేదు. దీంతో ఆ 37 మంది బాధ్యతలు స్వీకరించలేదు. తీరా ఎన్నికలు ముగిశాక.. కొందరు మంత్రులు నామినేటెడ్ పోస్టుల భర్తీపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో తొలి జాబితాలో ఉన్న వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల పనితీరును సమీక్షించిన తర్వాతే నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టాలని అధిష్ఠానం నిర్ణయించడంతో తొలి జాబితాలో అవకాశం దక్కిన నేతలు నాలుగు నెలలుగా ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్షకు కాంగ్రెస్ అధిష్ఠానం కురియన్ కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక తర్వాతే నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఆమోదముద్ర వేసే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 10న కురియన్ కమిటీ నివేదిక రావాల్సి ఉంది. అంటే మరో వారం రోజుల తర్వాతే కార్పొరేషన్ల చైర్మన్లకు ఊరట లభించే అవకాశాలు ఉన్నాయి.



నాలుగు నెలలుగా నిరీక్షణ..

37 మందితో విడుదల చేసిన జాబితాలో మాజీ ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, ఈరవత్రి అనిల్ కుమార్, గుర్నాథరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సతీమణి నిర్మల, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, నేతలు తేజావత్ బెల్లయ్య నాయక్, నేరెళ్ల శారద, శివసేనారెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి, కాల్వ సుజాత తదితరులు ఉన్నారు. వీరిలో కొందరు ఆయా కార్పొరేషన్లకు వెళ్లి చాంబర్లు కూడా చూసుకున్నారు. మరికొందరు ఆధునికీకరించుకున్నారు. కానీ, అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడంతో బాధ్యతలు స్వీకరించలేకపోయారు. చైర్‌పర్సన్ పోస్టులు పొందిన నేతలు కొందరు సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని, సంబంధిత శాఖల మంత్రులను కూడా కలిసి.. కృతజ్ఞతలు తెలిపారు. కానీ, జీవో సర్క్యులేట్ కాకపోవడంతో బాధ్యతలు స్వీకరించడానికి వెనకడుగేశారు. చివరకు లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బాధ్యతలు స్వీకరించాలనే నిర్ణయానికి వచ్చారు. కోడ్ ముగిసిన తర్వాత ముహూర్తాలు కూడా చూసుకున్నారు. ఈలోగా పోస్టుల భర్తీపై మంత్రుల నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పరకాల టికెట్ ఆశించి, భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి వరంగల్ 'కుడా' చైర్మన్ పదవిని ఇచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇక కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని 'సుడా' చైర్మన్‌గా నియమించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వర్గానికి చెందిన నరేందర్ రెడ్డి నియామకాన్ని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల నియామకంపై అసంతృప్తితో ఉన్న ఇద్దరు, ముగ్గురు మంత్రులు.. జాబితా మార్చాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

నివేదిక తర్వాతే ఉత్తర్వులు?

లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు పనిచేశారు? ఎవరు పనిచేయలేదు? సీట్లు తగ్గడానికి గల కారణాలు ఏమిటి? అనే అంశాలపై కురియన్ కమిటీ నివేదిక తయారుచేస్తోంది. దాన్ని ఈ నెల 10న పార్టీ అధినాయకత్వానికి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాతే నామినేటెడ్ పోస్టులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఎన్నికలను భుజాన వేసుకొని పనిచేసినవారికే మంత్రివర్గంలో చోటు ఉంటుందని, పార్టీ పదవులు దక్కుతాయని అధిష్ఠానం ఎన్నికలకు ముందే స్పష్టంగా ప్రకటించింది. ఈ క్రమంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామక ప్రక్రియలను కూడా కురియన్ నివేదికకు ముడిపెట్టినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలకు కూడా..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ), రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లాంటి కీలకమైన కార్పొరేషన్లు కొన్నింటిని పెండింగ్‌లో పెట్టారు. వీటికి చైర్మన్లుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే తొలి జాబితాకు అనుమతి వచ్చిన తర్వాతే మిగిలిన కీలక కార్పొరేషన్లకు చైర్మన్ల పోస్టులను భర్తీచేసే అవకాశాలున్నాయి.

కల్నల్ సంతోష్‌బాబు కుటుంబానికి 711 గజాల స్థలం

» కేటాయింపునకు జీహెచ్‌ఎంసీ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గాల్వన్‌లో చైనాతో ఘర్షణల్లో అమరుడైన కల్నల్ సంతోష్‌బాబు భార్య సంతోషికి హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-14లో 711 చదరపు గజాల స్థలం కేటాయించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశంలో టేబుల్ ఎజెండాగా ఈ అంశాన్ని సభ్యులు ఆమోదించారు. మహానగరంలో భవనాలు, యుటిలిటీల గుర్తింపు దిశగా కీలక అడుగు పడింది. జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ సర్వే (జీఐఎస్) ఆధారిత సర్వేకు కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. గ్రేటర్‌లోని భవనాలను గుర్తించి వాటిలో ఆస్తి పన్ను మదింపు జరిగినవెన్ని..? జరగనివెన్ని..? వాస్తవ పన్ను కంటే తక్కువ చెల్లిస్తున్న నిర్మాణాలెన్ని..? అన్నది తేల్చనున్నారు. తద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నది అధికారుల యోచన..ఇటు భూగర్భంలో తాగునీరు, మురుగు నీటి పైపులైన్లు, రహదారులు, భూగర్భ విద్యుత్తు కేబుళ్లు వంటివీ సర్వేలో భాగంగా గుర్తించనున్నారు. శేరిలింగంపల్లి జోన్ గోపన్‌పల్లిలో స్వచ్ఛంద సంస్థ సహకారంతో జంతు సంరక్షణ కేంద్రం, ఆస్పత్రి ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. ఆల్ ఫర్ ఏనిమల్స్ ఫౌండేషన్‌కు 25 ఏళ్ల పాటు ఎకరా స్థలాన్ని లీజుకిచ్చే విషయమై ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించారు. ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు స్టీల్ బ్రిడ్జి అంచనా వ్యయం పెరిగిన నేపథ్యంలో ఆ ప్రతిపాదనను పక్కనపెట్టారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి కేకే రాజీనామా

» చైర్మన్ ధన్‌ఖడ్‌కు లేఖ అందజేత

» నైతిక విలువలతోనే రాజీనామా చేశా: కేకే

న్యూఢిల్లీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యత్వానికి కె.కేశవరావు రాజీనామా చేశారు. గురువారం ఆయన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. తన రాజీనామాను ఆమోదించాలని చైర్మన్‌ను కోరారు. సీఎం రేవంత్ సాయంత్రం కేకే నివాసానికి వెళ్లి, ఆయన్ను పలకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేకే రాజీనామా అంశం పార్టీ అంతా కలిసి తీసుకున్న నిర్ణయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి ఏది మంచో కేకే నిర్ణయిస్తారని తెలిపారు. ఆయన సలహా మేరకే తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కేకే మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ మనిషినని, పార్టీలోకి వచ్చినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానన్నారు. కాంగ్రెస్ ఎంపీల పోరాటంతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగుతోందన్నారు. ఆర్నెల్లలోనే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేశారని కితాబిచ్చారు. గత ప్రభుత్వంలో ఉన్నవారు కుటుంబ ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. తాను కాంగ్రెస్‌లో చేరినవెంటనే నైతిక విలువలతోనే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. కాగా, కేకే సేవలను రాష్ట్రంలో ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నామని, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమిస్తామని రేవంత్ మీడియాతో ఇష్టాగోష్ఠిలో చెప్పారు. ఆయన్ను తిరిగి రాజ్యసభకు పంపించే విషయమై అడగ్గా.. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తన స్థాయిలో నిర్ణయం జరగదని అన్నారు.

బీఆర్ఎస్ ఓటమితో మహారాష్ట్ర ప్రజల్లో ఆవేదన

» రాష్ట్ర ప్రజల నిర్ణయం దేశ రైతాంగాన్ని నిరుత్సాహపర్చింది

» బాధపడొద్దు.. రాబోయేది మన ప్రభుత్వమే: కేసీఆర్

హైదరాబాద్/మర్కుక్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతురాజ్యాన్ని తెచ్చుకోవాలని 'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' నినాదాన్ని ఎత్తుకున్న బీఆర్ఎస్ తెలంగాణ ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆవేదన చెందారని పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణతోపాటు దేశ రైతుల ప్రగతి కోసం బయలుదేరిన నేపథ్యంలో



వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన బీఆర్ఎస్ నేత కుమారుడితో ముచ్చటిస్తున్న కేసీఆర్

ఇక్కడి ఓటమి దేశవ్యాప్తంగా రైతులను నిరుత్సాహపర్చిందని పేర్కొన్నారు. 'మీ (కేసీఆర్) పాలన లేకపోవడంతో తెలంగాణ రైతుల కంటే.. దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయింది' అని ఇటీవల తనను కలిసిన మహారాష్ట్ర నేతలు అన్నారని కేసీఆర్ చెప్పారు. రైతు రాజ్యాన్ని అందించగలిగిన దమ్మున్న కేసీఆర్ నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని వారు బాధపడ్డారన్నారు. గురువారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ మాట్లాడారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదన్నారు. అధికారం కోల్పోయామని బాధపడడం రాజకీయ నాయకుడి లక్షణం కాదని చెప్పారు. అలాగే ప్రతిపక్ష పాత్ర కూడా శాశ్వతం కాదని, భవిష్యత్తులో అధికారం మనదేనని పార్టీ శ్రేణులకు తెలిపారు. గెలుపోటములకు అతీతంగా కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలు కనబడట్లేదా?: హరీశ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో వరుసగా రైతులు ఆత్మహత్యకు పాల్పడుతుంటే కనబడట్లేదా? ఆ కుటుంబాలు పడుతున్న ఆవేదన వినిపించట్లేదా?' అంటూ కాంగ్రెస్ సర్కారును మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతుల సమస్యలను పరిష్కరించని కారణంగానే వారు బలన్మరణాలకు పాల్పడుతున్నారని గురువారం 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్కారుకు పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ, పట్టిడన్నం పెట్టే రైతుల సంక్షేమం పట్ల లేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల అరాచకాలను తట్టుకోలేకనే ఇటీవల ప్రభాకర్ అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారని, అందులో డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అనుచరుడు ప్రధాన నిందితుడైనప్పటికీ అరెస్టు చేయలేదని ఎమ్మెల్సీ తాతామధు ఆరోపించారు. కాగా, కేంద్రంలోని ఎన్‌డీఏలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలకమైన వ్యక్తి అని.. ఆయన చొరవ చూపి విభజన సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో రాహుల్ విఫలం

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అన్ని సందర్భాల్లో రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్‌గాంధీ దాని స్ఫూర్తిని కాపాడటంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు కట్టుబడి ఉన్నామని చెప్తున్న రాహుల్.. పార్టీ మ్యానిఫెస్టో (న్యాయపత్ర)కు విరుద్ధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ గూటికి చేరాక బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు తన పదవికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మరి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన అరడజను ఎమ్మెల్యేల సంగతేంటని ప్రశ్నించారు.

వణికిస్తున్న డెంగీ, చికున్ గున్యా

మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితి ఉంటోందని తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 65 రోజుల్లో 114 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. మేలో 39, జూన్‌లో 56, జూలై 4వ తేదీ వరకు 19 కేసులు నమోదయ్యాయి. ఫీవర్ ఆస్పత్రిలో రోజూ 350కి పైగా ఓపీ కేసులు వస్తుండగా, అందులో 50 నుంచి 70 మంది దాకా డెంగ్యూ లక్షణాలు ఉన్నవారేనని సమాచారం. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆస్పత్రిలో కూడా చాలా మంది డెంగ్యూ లక్షణాలతో వస్తున్నట్లు తెలుస్తోంది.

టైగర్ దోమతోనే..

డెంగీ, చికున్‌గున్యా వ్యాప్తికి ఎడెస్ ఈజిప్తి అనే దోమ ముఖ్య కారణం. కానీ.. భారతదేశంలో దాని తర్వాత ఆ రెండు జ్వరాల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్న మరో రకం దోమ.. ఎడెస్ అల్బోపిక్టస్ అలియాస్ టైగర్ దోమ.



ఇప్పుడు ఈ దోమలు రాష్ట్రవ్యాప్తంగా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ దోమలపై పులుల మాదిరిగా చారికలు ఉండడంతో వీటికి ఆ పేరు వచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుండడంతో దీన్ని అర్బన్ మస్కిటోగా కూడా పిలుస్తారని వైద్యులు తెలిపారు. డెంగ్యూ రోగిని కుట్టిన టైగర్ దోమ.. ఆ తర్వాత ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతనికి కూడా డెంగీ వచ్చే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట నిద్రపోయేటప్పుడు దోమలు కుడతాయనే భయంతో తెరలు, కాయిల్స్, దోమలు కుట్టకుండా ఒంటిపై రాసుకునే లేపనాలను వాడుతాం. కానీ.. ఈ టైగర్ దోమలు పగటిపూట కుడతాయని.. చీకటిపడ్డాక వీటి జాడ ఉండదని వైద్యులు చెబుతున్నారు.

పరిసరాలే స్థావరాలు

టైగర్ దోమలు ఇంటి పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. మురుగు నీరు ఉండే చోట తన స్థావరాన్ని ఏర్పాటుచేసుకుంటుంది. ఉదాహరణకు.. ఎయిర్ కూలర్‌లో నిల్వ ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, అక్వేరియం, పగిలిన సీసాలు, కుండపెంకుల్లో వర్షపు నీరు పడి నిలిచే చోట.. మూతలు లేని ట్యాంకుల్లో నివాసం ఏర్పరచుకుని అక్కడే గుడ్లు పెడుతూ తన సంతతిని పెంచుకుంటుంది. ఈ దోమలు రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించడం వల్ల చాలా మంది డెంగీ, చికున్‌గున్యా వంటివాటిబారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. కాబట్టి.. పగటి పూట కుట్టే ఈ దోమల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టుపక్కల ఎక్కడా నిల్వ నీరు, మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జ్వరం రాగానే టెస్టులు వద్దు

ఇటీవలికాలంలో చాలామంది 103, 104 జ్వరం.. నీళ్ల విరేచనాలు, ఒళ్లు, కీళ్ల నొప్పుల వంటి లక్షణాలతో ఆస్పత్రికి వస్తున్నారు. అది సాధారణ వైరల్ ఫీవర్ అయితే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. కానీ, చాలా మంది జ్వరం రాగానే డెంగీ, చికున్‌గున్యా పరీక్షలు చేయించుకుంటున్నారు. కానీ.. అలా వెంటనే టెస్టులు చేయించుకోవడం వల్ల ఉపయోగం లేదు. జ్వరం వచ్చిన ఐదురోజులకు శరీరంలో యాంటీబాడీస్ తయారవుతాయి. అప్పుడు పరీక్ష చేయిస్తే.. ఒకవేళ ఆ యాంటీబాడీస్ ఉంటే పాజిటివ్ వస్తుంది. ముందే పరీక్ష చేయిస్తే నెగెటివ్ వస్తుంది. దీంతో డెంగ్యూ లేదని భావించి నిర్లక్ష్యంగా ఉంటారు. అది సరి కాదు. అలాగే.. లక్షణాలు కనిపించిన అయిదు రోజుల వరకు యాంటిబయాటిక్ మందులు ఇవ్వకూడదు. లక్షణాలను బట్టి పారాసెటమాల్, ఫ్లూయిడ్స్ వంటివి ఇవ్వాలి. ఐదురోజుల తర్వాత టెస్ట్ చేయించి అది ఏ జ్వరమో నిర్ధారించుకోవాలి. డెంగీ వస్తే 6వ రోజు నుంచి ప్లేట్‌లెట్స్ తగ్గడం మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య 20 నుంచి 30 వేల లోపునకు పడిపోతేనే అదనంగా ఇవ్వాల్సి ఉంటుంది.

- డాక్టర్ ఆరతి బళ్లారి, ఇంటర్నల్ మెడిసిన్, కిమ్స్ ఆస్పత్రి

ప్రాణాపాయ స్థితిలో భరోసా!

» రాష్ట్రంలో ట్రామాకేర్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్న సర్కారు

» ఏ ఆస్పత్రిలోనైనా రూ.లక్ష దాకా పూర్తి ఉచితంగా వైద్యం

» అధ్యయనానికి తమిళనాడుకు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు.. గుండెపోటు వచ్చినప్పుడు.. ఆత్మహత్యాయత్నం జరిగినప్పుడు బాధితులకు తక్షణం వైద్య సాయం అందితే ప్రాణం నిలబడుతుంది! మరి.. ఆ ఆపత్కాలంలో ఎంతమంది వద్ద చికిత్సకు సరిపడా డబ్బులుంటాయి? డబ్బుల్లేక.. 'గోల్డెన్ అవర్'లో చికిత్స లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే సరైన సమయంలో వైద్యసాయం అందించి.. ప్రాణాలు నిలబెట్టడం ద్వారా బాధిత కుటుంబాల్లో ఆనందం నింపేందుకు రాష్ట్ర సర్కారు ప్రత్యేకంగా ట్రామాకేర్ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. బాధితులను దగ్గర్లోని ఆస్పత్రికి వెళితే అక్కడ పైసా అడగకుండా రూ.లక్ష దాకా పూర్తి ఉచితంగా వైద్యం అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇది ఇప్పటికే తమిళనాడులో అమల్లో ఉంది. అక్కడి వ్యవస్థపై అధ్యయనం చేసేందుకు ఆరోగ్య శాఖ నుంచి అధికారుల బృందాన్ని తమిళనాడుకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో చికిత్స అందించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వాస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ బాధితులకు చికిత్స అందించేలా తమిళనాడు ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపొందించింది. దీని ద్వారా ప్రమాదాలు, గుండెపోటు, ఆత్మహత్యాయత్నం వంటి పరిస్థితుల్లో అత్యవసర వైద్యం కోసం బాధితులకు రూ.లక్ష దాకా ఉచిత చికిత్స అందిస్తున్నారు. ఈ ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. కాగా అధ్యయనానికి తమిళనాడు వెళ్లిన బృందంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, మెడికల్ కార్పొరేషన్ ఎండీ సహదేవ్ ఉన్నారు.

మా 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చెయ్యండి

» ఎటపాక మండలంలోని పంచాయతీల తీర్మానం

» మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేత

హైదరాబాద్, కొత్తగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకలగూడెం గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో గురువారం కలిసిన ఆ పంచాయతీల ప్రతినిధులు తీర్మాన ప్రతులను అందజేశారు. త్వరలో ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ అవుతున్న నేపథ్యంలో తాము ఈ తీర్మానం చేసినట్టు వారు మంత్రికి తెలిపారు. తమ గ్రామాలు తెలంగాణలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న తమ్మినేని.. కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఏకపక్షంగా భద్రాచలాన్ని ముక్కలు చేసిందని ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 5 జూలై 2024

టీటీడీ స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్)- బీఎస్సీ నర్సింగ్, బీపీటీ(ఫిజియోథెరపీ), బీఎస్సీ ఏహెచ్ఎస్(పారామెడికల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పది సీట్లు కేటాయించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) గుర్తింపు ఉంది.

బీపీటీ: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు, ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటాయి. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదు సీట్లు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్(ఐఏపీ) గుర్తింపు ఉంది.

బీఎస్సీ(పారామెడికల్): ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు, ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.29,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఏపీ పారామెడికల్ బోర్డు గుర్తింపు ఉంది.

- **స్పెషలైజేషన్‌లు-సీట్లు:** అనెస్తీషియా టెక్నాలజీ 12, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 20, రేడియోగ్రఫీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ 9, కార్డియాక్ పల్మనరీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2, ఈసీజీ అండ్ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ 8, డయాలసిస్ టెక్నాలజీ 12, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ టెక్నాలజీ 4, న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ 4, రేడియోథెరపీ టెక్నాలజీ 5, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ 2

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంబంధిత విభాగంలో ఇంటర్ ఒకేషనల్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు సంబంధిత బ్రిడ్జ్ కోర్సు ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ/హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. ఏపీ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి.



- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి కనీసం 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠంగా 35 ఏళ్లు మించకూడదు. 25 ఏళ్లు నిండిన అభ్యర్థులందరూ డిక్లరేషన్ ఫారం సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2596; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2077
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 30
- **అభ్యంతరాల స్వీకరణ:** ఆగస్టు 1 వరకు
- **ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 5
- **మొదటి కౌన్సెలింగ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 10
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్, కాలేజ్ ఫీజు చెల్లింపు:** ఆగస్టు 13, 14
- **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

టీజీ సెట్ 2024



తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీజీ సెట్)- 2024 ఫీజు చెల్లింపు తేదీని ఉస్మానియా యూనివర్సిటీ పొడిగించింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. పరీక్షను ఆగస్టులో నిర్వహించనున్నారు. 29 సబ్జెక్టుల్లో సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో పరీక్ష ఉంటుంది.

- తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీజీ సెట్)- 2024

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు

పరీక్ష విధానం: పరీక్షను కంప్యూటర్ ఆధారిత(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు(100 మార్కులు), పేపర్-2లో 100 ప్రశ్నలు(200 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష రుసుము: ఓసీలకు రూ.2000; బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 8

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28, 29, 30, 31

వెబ్‌సైట్: http://telanganaset.org/index.html

లిటిల్స్



అంతరంగం

ఒక ముసలావిడ తల మీద పెద్ద మూట మోసుకుంటూ పొరుగూరికి నడుస్తున్నది.

ఆమెకా మూట చాలా బరువుగా తోచింది. అపుడే ఆమె పక్కనుండి గుర్రం మీద ఒక యువకుడు వెళుతూ కనిపించాడు. ముసలావిడ అతన్ని ఆపి, 'బాబూ ఈ మూట చాలా బరువుగా ఉంది. దీన్ని గుర్రం మీద తీసుకెళితే నేను తరువాత వచ్చి తీసుకుంటాను' అన్నది. అప్పటికే చాలా అసహనంగా ఉన్న ఆ యువకుడు 'నాకంత సమయం లేదమ్మా' అనేసి వెళ్లిపోయాడు. కాసేపు ప్రయాణం చేసిన తర్వాత అతను

' ఆ మూటలో ఏవైనా విలువైన వస్తువులు ఉండవచ్చు కదా, ఆ మూటను తీసుకుని, ఆమెకు ఇవ్వకుండా వెళ్లిపోతే మాత్రం నన్ను అడిగేదెవరు? మూట తీసుకున్నా బాగుండేది' అనుకున్నాడు. అలా అనుకోగానే అతను తిరిగి ముసలావిడ వద్దకు వచ్చి 'పెద్దమ్మా నీ మూటను నేను మోస్తా ఇటివ్వు' అని అడిగాడు. దానికి ముసలావిడ 'ఇపుడు నేను నిన్ను నమ్మలేను' అన్నది.

దానికి ఆ యువకుడు ఎందుకలా అంటున్నావు? ఇలా మాట్లాడమని నీకెవరు చెప్పారు? అన్నాడు అపుడు ముసలావిడ 'మూట కోసం తిరిగి వెనక్కి రమ్మని నీకు చెప్పిన వాడే నాకూ ఇవ్వవద్దని చెప్పాడు అన్నది.

'నీ మాటలను బట్టి నీ అంతరంగంలో ఆలోచన నాకు తెలిసిపోయిందిలే' అని మెల్లగా అని అక్కడినుండి నడక సాగించింది ముసలావిడ.

దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి!






ఎలి పన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 350

	9		1	6				
			7		9	6		5
					3			8
5				9				
9	8	4		2		7	3	6
				3				4
2			9					
4		7	8		6			
				7	2		4	

సుడోకు - 349 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

మౌలానా ఆజాద్ వర్సిటీలో ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

వెబ్‌సైట్: https://manuu.edu.in

ఎంటెక్(సీఎస్ఈ) పార్ట్ టైమ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఉర్దూ/ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. హాస్టల్ సౌకర్యం లేదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.


అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఐఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ ప్రోగ్రామ్‌లు: ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ విభాగాల్లో ఏడాది వ్యవధి గల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు; రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ప్రోగ్రామ్‌లు; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటికి హైదరాబాద్‌లోని సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సహకారం అందిస్తోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. మనూ మోడల్ స్కూల్స్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; మనూ పాలిటెక్నిక్‌లలో చదివినవారు; మనూ నుంచి డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 7



డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

1. విటమిన్‌ను కనుగొన్నది ఎఫ్.జి.హాక్సిన్. అయితే విటమిన్ అని పేరు ప్రతిపాదించిన ఫంక్ ఏ దేశస్థుడు
 1. అమెరికా 2. బ్రిటన్ 3. జపాన్ 4. చైనా
2. పార్కర్ సోలార్ ప్రోబ్‌ను నాసా ఎవరి గౌరవార్థం పేరు పెట్టి సూర్యగోళ అధ్యయనానికి పంపిస్తోంది?
 1. యూజీన్ పార్కర్, ప్రఖ్యాత ఆస్ట్రోఫిజియిస్ట్ 2. ఎస్. చంద్రశేఖర్ 3. గ్రెగర్ మెండల్ 4. చార్లెస్ డార్విన్
3. నాగార్జున సాగర్ - శ్రీశైలం సంరక్షణ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఉంది?
 1. గుంటూరు 2. కర్నూలు 3. నల్లగొండ 4. 1, 2
4. నేల సహాయం లేకుండా మొక్కలు పెంచే విధానాన్ని అధ్యయనం చేసే శాస్త్రం?
 1. క్రయోజనిక్స్ 2. హైడ్రో పోనిక్స్ 3. జెనిటిక్స్ 4. ఫానెటిక్స్
5. ఒలింపిక్ క్రీడల్లో పతకాన్ని గెలుచుకున్న మొదటి మహిళ?
 1. ఫోరెన్స్ గ్రిఫిత్ జాయనర్ 2. మెర్లిన్ బట్టి 3. మెరియన్ జోన్స్ 4. చార్లోటీ కూపర్
6. జన్యువును కృత్రిమంగా ప్రయోగశాలలో సంశ్లేషణ చేసినందుకు నోబెల్ బహుమతి పొందిన భారతీయ శాస్త్రవేత్త?
 1. హరగోవింద్ ఖురాన 2. అబ్దుల్ కలాం 3. ఎల్లాప్రగడ సుబ్బారావు 4. గ్రెగర్ మెండల్
7. మధుమేహ వ్యాధి చికిత్సలో వాడే ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న వారు?
 1. హిదేకి యుకోవా 2. ఎడ్వర్డ్ జన్నర్ 3. సర్ ఫ్రెడ్రిక్ గ్రాంట్ బెంటింగ్ 4. సర్ జేమ్స్ యంగ్ సింప్సన్
8. 1948లో భాష ఆధారంగా రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ఏర్పాటైన కమిషన్?
 1. థార్ కమిషన్ 2. షా కమిషన్ 3. ఫజల్ అలీ కమిషన్ 4. కోస్లా కమిషన్
9. పురిటి నొప్పులతో ఎలక్ట్రిక్ సైకిల్‌పై ఆస్పత్రికి వెళ్లిన జూలీ అన్నే జెంటర్ ఏ దేశానికి చెందిన ఎంపీ?
 1. జర్మన్ 2. అమెరికా 3. డెన్మార్క్ 4. న్యూజిలాండ్
10. పోలవరం ప్రాజెక్టుకు గల మరొక పేరు?
 1. రాజీవ్ సాగర్ 2. ఇందిరా సాగర్ 3. లాల్ బహదూర్ శాస్త్రి ప్రాజెక్టు 4. నెహ్రూ సాగర్
11. శీతల దేశాల్లో థర్మామీటర్లలో పాదరసానికి బదులు దేనిని వాడతారు?
 1. సారాయి 2. హైపో 3. నీరు 4. ఆల్కహాల్
12. కింద పేర్కొన్న వారిలో ఎవరిని ఆంధ్ర భీష్మగా పిలుస్తారు?
 1. న్యాపతి సుబ్బారావు 2. గాజుల లక్ష్మీనరసు శెట్టి 3. నావిళ్ల వెంకటేశ్వర రావు శాస్త్రి 4. భోగరాజు పట్టాభి సీతారామయ్య
13. జెమినీ వైరస్ ఏ పంటకు సంబంధించింది?
 1. చెరుకు పంట 2. వేరుశనగ 3. మిర్చి పంట 4. కొబ్బరి
14. సమానమైన పీడనానికి చెందిన రేఖలు?
 1. ఐసోబార్స్ 2. ఐసోహెల్స్ 3. హైసోహైట్స్ 4. ఐసోనిఫ్
15. ప్రపంచంలో ఎలక్ట్రిక్ కోడ్ అమలులో ఉన్న మొదటి దేశం?
 1. భారత్ 2. చైనా 3. అమెరికా 4. స్వీడన్
16. ఇటీవల కేంద్ర కేబినెట్ గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సంబంధించి ఏ దేశంతో ఒప్పందానికి ఆమోదం తెలిపింది?
 1. కెన్యా 2. మారిషస్ 3. అమెరికా 4. నైజీరియా
17. 'యెట్, ఐయామ్ నాట్ డిఫీటెడ్' పుస్తక రచయిత?
 1. జుంపాలాహరి 2. జ్యోతి రెడ్డి 3. అమిత్ వర్మ 4. ఎస్.వి. శేషగిరిరావు
18. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి అధునాతన రూఫ్ సస్పెండెడ్ అల్ట్రా మోడర్న్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని విరాళంగా ఇచ్చింది?
 1. డీ మార్ట్ - ఆంధ్రప్రదేశ్ 2. రిలయన్స్ ట్రెండ్స్ అండ్ డిజిటల్స్ 3. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 4. చెన్నై షాపింగ్ మాల్
19. కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ మీటింగ్: ఏప్రిల్ 2018 ఎక్కడ నిర్వహించారు?
 1. లండన్ 2. బ్రిస్బేన్ 3. జోహన్నస్‌బర్గ్ 4. డబ్లిన్
20. బాలికపై అత్యాచారం ఘటనలో పోక్సో కోర్టు ఒక్కరోజులోనే విచారణ పూర్తి చేసి, నిందితునికి శిక్ష విధించిన సంఘటన ఏ రాష్ట్రంలో చోటు చేసుకున్నది?
 1. తమిళనాడు 2. కేరళ 3. బిహార్ 4. కర్ణాటక

పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్

21. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం టీచర్ల మొత్తం సంఖ్యలో ఖాళీలు ఎంత శాతానికి మించరాదు?
 1. 10 2. 15 3. 20 4. 30
22. ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయునికి ఇచ్చే టీచర్స్ గ్రాంట్ ఎంత?
 1. 500 2. 1000 3. 1500 4. 2000
23. కె.జి.బి.వి. పాఠశాలలు ఎవరి కొరకు ఏర్పాటు చేశారు?
 1. 6, 7, 8 తరగతులు చదువుతూ బడిమానేసిన పిల్లలు 2. 5వ తరగతి చదివి బడి మానేసిన పిల్లలు 3. 9, 10 చదువుతూ బడి మానేసిన పిల్లలు 4. పైవన్నీ
24. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా ఎవరు ఉంటారు?
 1. గ్రామ సర్పంచ్ 2. గ్రామ వైస్ సర్పంచ్ 3. గ్రామ ప్రత్యేకాధికారి 4. పాఠశాల ప్రధానోపాధ్యాయులు
25. మత, భాషా సంబంధ మైనార్టీలు విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించుకునే స్వేచ్ఛను కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్?
 1. 26 2. 27 3. 30 4. 28
26. 6-14 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించే ప్రయత్నంలో ఏ వ్యక్తికి విద్యకు సంబంధించిన హక్కును హరించకూడదని చెప్పే ఆర్టికల్?
 1. 24 2. 23 3. 21 4. 45
27. నిరంతర విద్యా కేంద్రాన్ని ఎంత మంది జనాభాకు ఒకటి నియమిస్తారు?
 1. 1000 2. 1500 3. 2000 4. 3000
28. కేంద్ర ప్రభుత్వం డీపీఈపీ పథకాన్ని ప్రారంభించిన తేదీ?
 1. 11-8-1995 2. 8-11-1994 3. 6-8-1992 4. 7-11-1996
29. ఎస్ఎస్ఏ కార్యక్రమం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్రణాళికలో కేటాయించిన నిష్పత్తి, తొమ్మిది, పది, పదకొండో పంచవర్ష ప్రణాళికల్లో వరుసగా..
 1. 85:15, 25:25, 50:50 2. 80:20, 70:30, 50:50 3. 80:20, 75:25, 60: 40 4. 85:15, 70:30, 60:40
30. ప్రస్తుతం మన రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక విద్య ఏ వయసు వారికి ఇస్తున్నారు.
 1. 3-5 2. 4-6 3. 2-5 4. 4-7
31. మానసిక వైకల్యం గల పిల్లల ప్రవర్తనను అభివృద్ధి పరిచే పద్ధతి?
 1. ఆకృతీకరణ 2. గొలుసు విధానం 3. ప్రేరణ 4. పైవన్నీ
32. ఏ రకమైన వినికిడి లోపాన్ని ఔషధాలు, శస్త్ర చికిత్సల ద్వారా తగ్గించవచ్చు.
 1. వ్యతిరిక్త, వినికిడి లోపం 2. అపరివర్తన వినికిడి లోపం 3. అన్యావర్త వినికిడి లోపం 4. ఏదీకాదు
33. నవోదయ పాఠశాలలను ప్రతి జిల్లాలో స్థాపించాలని సూచించిన కమిటీ?
 1. జనార్దన్‌రెడ్డి కమిటీ 2. కొఠారి కమిషన్ 3. ఎన్ఈపీ-1986 4. యశ్‌పాల్ కమిటీ
34. N.C.F ను విస్తరించండి.
 1. National Continious Frame
 2. National Curriculam Frame
 3. National Council for Education
 4. National Conference For Education
35. CABE స్థాపించిన సంవత్సరం?
 1. 1920 2. 1921 3. 1924 4. 1926
36. ప్రధానోపాధ్యాయుని లక్షణం కానిది?
 1. వృత్తి నైపుణ్యం 2. ఉత్తమ మూర్తిమత్వం 3. పర్యవేక్షణ నైపుణ్యం 4. కఠిన నిర్ణయాలు
37. సమైక్యత ఉపగమం ప్రస్తావించిన శాస్త్రవేత్త?
 1. జైనింగ్ అండ్ జైనింగ్ 2. హెర్బర్ట్ 3. బ్లూమ్స్ 4. వెస్లీ
38. మధ్యాహ్న భోజన పథకం ఎవరి పర్యవేక్షణలో అమలు అవుతుంది?
 1. ఎంఈవో 2. హెచ్ఎం 3. 1, 2 4. ఎంఆర్వో
39. బీఈడీ, ఎంఈడీ కోర్సులు నిర్వహించే సంస్థ
 1. ఎస్ఆర్‌సీ 2. ఎన్‌సీఈఆర్టీ 3. ఆర్ఐఈ 4. డీఐఈటీ
40. ఇంగ్లీష్, విదేశీ భాషల కేంద్ర సంస్థ గల నగరం?
 1. బెంగళూరు 2. ఇండోర్ 3. కలకత్తా 4. హైదరాబాద్

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 2 5) 4 6) 1 7) 3 8) 1 9) 4 10) 2 11) 4 12) 1 13) 3 14) 1 15) 4 16) 2 17) 2 18) 1 19) 1 20) 3 21)1 22) 1 23) 1 24) 4 25) 3 26) 3 27)1 28) 2 29) 1 30) 1 31) 4 32) 2 33) 3 34) 2 35) 2 36) 4 37) 1 38) 3 39) 3 40) 4

పై ప్రశ్నలను హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.